ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 6 పేజీలు: 10+4 వెల: 6.50

సంకెళ్లువేసి భారత్‌కు తేవడమా? ప్రియాంక 5లో

గాజా వ్యవహారంలో ట్రంప్‌కు నెతన్యాహు మద్దతు

## నామినేటెడ్ పోస్టులు

# బిసిలకు 34 శాతం

- ప్రజల నమ్మకానికి భంగం రాకుండా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న సిఎం చంద్రబాబు
- కేబినెట్ సమావేశంలో 21 కీలక అంశాలపై చర్చ, ఆమోదం
- బడులు తెరిచేనాటికి డిఎస్సీ పూర్తి, మధ్యాహ్న భోజనం పథకంలో సన్నబియ్యం
- మద్యం దుకాణాల యజమానులకు కమిసన్ పెంపు



**విజయవాడ,ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల నమ్మకానికి ఏ మాత్రం భంగం కలిగించకుండా ప్రభుత్వం అడుగులు వేస్తోందని సిఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం ఇచ్చేందుకు ఏపీ మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపింది.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా పారిశ్రామికవేత్తలను ఆదుకునేలా ప్రభుత్వం రూపొందించిన పాలసీకి మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. పారిశ్రామిక వేత్తలకు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో ఇవాళ భేటీ అయిన ఎపి కేబినెట్ మొత్తం 21 అంశాలకు ఆమోద ముద్ర వేసింది. విద్యుత్ సహా పలు విభాగాల్లో పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వనుంది. ఎంఎస్ఎంఇ పాలసీలో మార్పులతో పాటు ఏపీ నాలెడ్జ్ సొసైటీ కెపాసిటీ బిల్డింగ్ 2025కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు సమాచారం. అదేవిధంగా పలు కీలక అంశాలపై కేబినెట్ సమావేశంలో ప్రతిపాదనలు వచ్చాయి.

**సిఆర్డీఏ చేపట్టే పనులకు టెండర్ల పరిమితి పెంపుపై కేబినెట్**లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ల చట్ట సవరణపై చర్చించినట్లు సమాచారం. 2019లో తెచ్చిన చట్టం సవరించి కొత్త చట్టం తెచ్చే అంశంపై చర్చ జరిగింది. టిటిడి పోటులోని కార్మికులను సూపర్‌వైజర్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశం, రిజిస్ట్రేషన్ల శాఖలో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రతిపాదనపై చర్చించారని తెలుస్తోంది. తిరుపతి జిల్లాలోని తమ్మినపట్నంతో పాటు కొత్తపట్నం సిబిఐసిలో భూములు కోల్పోయిన వారికి పరిహారం పెంపు అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. వారికి ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం ఇచ్చే ప్రతిపాదనపై చర్చ జరిగినట్లు సమాచారం. భారత్‌లో తయారైన విదేశీమద్యంపై రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ సవరణపై కూడా చర్చించారని తెలుస్తోంది. మరోవైపు రూ.44,776 కోట్ల ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపే అంశంపై చర్చించింది.ఈ ప్రతిపాదనకు ఓకే చెప్పింది. విశాఖ గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి గజాల వరకు అభ్యంతరం లేని భూముల నిర్మాణానికి క్రమబద్ధీకరణ చేయాలనే ప్రతిపాదనపై కేబినెట్‌లో ఆమోదం లభించింది. గతంలోనే అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి >>2



మంత్రి ఫరూక్



మంత్రి సుభాష్

## ఫస్ట్.. ఫరూక్ లాస్ట్.. సుభాష్

ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు

### సిఎం చంద్రబాబు-6, లోకేష్-8, పవన్-10

మంత్రుల పనితీరు మెరుగుపడకపోతే ఊరుకోనన్న ముఖ్యమంత్రి

రెవెన్యూ, పోలీసు శాఖపై ఫిర్యాదులు ఎక్కువవుతున్నాయన్న సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రులు వారి,వారి పనితీరు మార్చుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.ఇది వారి పట్ల ప్రజల్లో గట్టినమ్మకాన్ని కలిగిస్తోందన్నారు.ఆరునెలల ప్రభుత్వంలో మంత్రులు పనితీరు పర్వాలేదన్పించినా.ఇంకా మెరుగైన సితిలో ఉండాలన్నారు, కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో వేరుగా భేటీ అయిన ముఖ్యమంత్రి.. పలు కీలక అంశాలను పేర్కొన్నారు. అందరూ గేర్ మార్చాలని.. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు సిఎం. మంత్రుల ఫైల్స్ క్లియరెన్స్‌పై పెర్ఫార్మెన్స్‌ను సిఎం చదివి వినిపించారు. మొదటి 6 నెలలు మంత్రుల పనితీరును అంతగా పట్టించుకోలేదన్న చంద్రబాబు ఇకపై ఎవరినీ ఉపేక్షించనని హెచ్చరించారు. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్‌సిబ్బందిని ఇక శాఖల వారిగా తీసుకోవచ్చని >>2

## రూ. 84,750 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పునర్వ్యవస్థీకరణ

**విజయవాడ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి:** జలజీవన్ మిషన్ గడువు 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో రూ.84750 కోట్లతో ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది.కేంద్రం నుంచి అనుమతులు రాగానే టెండర్లు పిలిపి మూడేళ్లలో పనులు పూర్తి చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వం బోర్లు ద్వారా నీరు సరఫరా చేసేలా రూపొందించిన ప్రణాళికలకు బదులుగా సమీప జలాశయాలు, నదులనుంచి నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. దీనివల్ల ప్రాజెక్టు వ్యయం రూ.84750 కోట్లకు పెరిగింది. కేంద్రాన్ని ఒప్పించి గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం వ్యయంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున నిధులు సమకూర్చనున్నాయి. వచ్చే 30 ఏళ్లలో గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాల మేరకు ఉమ్మడి 13 జిల్లాల్లో 55 ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేసింది. జలజీవన్ పథకానికి జలాశయాలను అనుసంధానించి 95.54 లక్షల ఇళ్లకు కుళాయిల ద్వారా రక్షిత నీరిందించేలా ప్రణాళికలు రూపొందించింది. వీటికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొంది పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటోంది.

## 'జమిలి' కోసం చూస్తున్న జనం




### ఆ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్సీకే అధికారం : జగన్

**విజయవాడ.ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతుందని, 9 నెలల్లో ప్రజలకు అంతా అర్థమైందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు వస్తాయని మనకంటే ముందే ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇవే ఎన్నికలు వస్తే కూటమి ఓటమి ఖాయమంటూ.. జగన్ జోస్యం చెప్పారు. చంద్రబాబు చొక్కా పట్టుకొని ప్రజలు ప్రశ్నించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తాను పదేపదే చెప్పానని, ప్రజలు అబద్దాలనే నమ్మి కూటమికి పట్టం కట్టినట్లు జగన్‌తెలిపారు. రాజకీయాల్లో క్యారెక్టర్ ముఖ్యమని, లేనప్పుడు ప్రజలు క్షమించారు. క్యారెక్టర్ లేని వారు పార్టీనుంచి వెళ్ళినా పట్టించుకోనవసం లేదు, మనకు ప్రజాబలం ఉంది,. మనకు దేవుడి దయ, ఆశీస్సులు ఉన్నాయని క్యాడర్ భయపడాల్సిన అవసరం లేదని జగన్ భరోసానిచ్చారు. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వసనీయత ముఖ్యమని అన్నారు. ప్రలోభాలకులొంగోలేక భయపడో వ్యక్తిత్వం తగ్గించు >>2

## క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

### రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు

**విజయవాడ, ఫిబ్రవరి6, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డితోపాటు శాప్ చైర్మన్ రవినాయుడు విజ్ఞప్తితో క్రీడా ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంపై శాప్ చైర్మన్ రవి నాయుడు గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ >>2








యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ 79వ సమావేశం అధ్యక్షుడు ఫిలేమన్‌యంగ్ గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన దృశ్యం

# లాస్ట్.. సుభాష్

>> సిఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరును సీఎం చంద్రబాబు వివరించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఫైల్స్ వేగంగా క్లియర్ చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. అయితే ఫైల్స్ క్లియరెన్స్‌లో తొలి స్థానంలో ఎన్ఎండీ ఫరూఖ్ ఉంటే.. చివరి స్థానంలో వాసంశెట్టి సుభాష్ ఉన్నారన్నారు. ఇక మంత్రులు వరుసగా.. కందుల దుర్గేష్ (2), కొండపల్లి శ్రీనివాస్ (3), నాదెండ్ల మనోహర్ (4), డోలా బాల వీరాంజనేయులు (5), సీఎం చంద్రబాబు (6), సత్యకుమార్ (7), లోకేష్ (8), బీసీ జనార్ధన్ రెడ్డి (9), పవన్ కళ్యాణ్ (10), సవిత (11), కొల్లు రవీంద్ర (12), గొట్టిపాటి రవికుమార్ (13), నారాయణ (14), టీజీ భరత్ (15), ఆనం రాంనారాయణరెడ్డి (16), అచ్చెన్నాయుడు (17), రాంప్రసాద్ రెడ్డి (18), గుమ్మడి సంధ్యారాణి (19), వంగలపూడి అనిత (20), అనగాని సత్యప్రసాద్ (21), నిమ్మల రామానాయుడు (22), కొలుసు పార్థసారధి (23), పయ్యావుల కేశవ్ (24), చివరి 25వ స్థానంలో వాసంశెట్టి సుభాష్ ఉన్నట్లు సీఎం చంద్రబాబు వివరించారు.

తక్కువ ఫైల్స్ ఉండే వాళ్లు కూడా క్లియరెన్స్‌లో వెనుకబడి ఉంటే ఎలా? అంటూ వెనుకబడిన మంత్రులను ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకానికి న్యాణ్యమైన బియ్యం ఇవ్వాలని మంత్రులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ శాఖపై ఫిర్యాదులు వస్తున్నాయి.. వాటిని తగ్గించాల్సి ఉందన్నారు. రెవెన్యూపై ఫిర్యాదులను త్వరలో తగ్గిస్తామని ఈ సందర్భంగా ఆ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు ఇసుక, మద్యంలో ఫిర్యాదులపై వెంటనే సమీక్షించాలన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై వెంటనే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రెండు, మూడు నెలల్లో విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశించారు. శాఖల ఇక మీరు పెర్ఫార్మెన్స్ పెంచాలి. అందరు గేర్ అప్ కావాలి. కేంద్ర బడ్జెట్ వచ్చింది. మార్చ్‌లో మన బడ్జెట్ వస్తుంది. ఢిల్లీలో వివిధ శాఖల్లో మిగిలిపోయిన బడ్జెట్ ఉంటుంది.. ఆ నిధులను మనం తెచ్చుకోవాలి అని సూచించారు. సచివాలయం సిబ్బందిలో ఐదుగురికి ఎంపిక చేసి ఒక్కో మండలానికి ఒక్కొక్కరిని పెట్టుకోవాలని.. వీళ్లకు ఒక ప్రొఫెషనల్ ఉంటారని.. వీళ్లకు ఒక స్పెషల్ ఆఫీసర్ ఉంటారని తెలిపారు. వీళ్ల జీఎస్‌డీపీపై దృష్టి కేంద్రీకరిస్తారని తెలిపారు.

వాట్స్ ఆప్ గవరెన్స్‌కు మంచి స్పందన వస్తుందని అన్నారు. రెగ్యులర్‌గా సర్వేలు చేయిస్తున్నానని.. అన్ని పథకాలపై ప్రజల నుంచి ప్రభుత్వానికి మంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందన్నారు. దీనిని ఇంకా మరింత పెంచుకోవాలని చెప్పారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంకాక ముందే తల్లికి వందనం నిధులు వేస్తామన్నారు. అలాగే డీఎస్సీ నియామకాలను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. ద్రవ్యోల్బణంపై ఆర్థికశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉన్న కమిటీ రెగ్యులర్‌గా మానిటరింగ్ జరగాలన్నారు. దావోస్‌లో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఎనర్జీతో పాటు వివిధ అంశాలపై మంచి ఫీడ్ బాక్ వచ్చింది.. మన బ్రాండ్ ఇమేజ్ బాగుందని మంత్రులకు సీఎం చెప్పారు.

యూఎస్ నుంచి తెలుగు వాళ్ల వెనక్కు పంపుతున్నారు కదా అని మంత్రులు ప్రశ్నించారు. అయితే భయం అక్కర్లేదని.. తెలుగు వాళ్లకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని.. అందరికి వీసాలు ఉన్నాయని తెలిపారు. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శాఖల వారీగా ఎవరికి వారు ఏజెన్సీల ద్వారా రిక్రూట్ చేసుకోమని సీఎం చెప్పారు. వైసీపీ అధికారంలోకి రాకముందు ఉన్న విధానాన్నే అనుసరించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## రాధాకిషన్ రావును అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి6:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాధాకిషన్‌రావుకు ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈనెల 12వ తేదీ వరకు రాధాకిషన్‌రావును అరెస్టు చేయవద్దని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తన ఫోన్ ట్యాప్ చేశారన్న చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో రాధాకిషన్‌పై కేసు నమోదు అయ్యింది. దీంతో ఈ కేసును కొట్టివేయాలని రాధాకిషన్ రావు.. గతంలో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాడు. తాజాగా ఈ కేసులో దాఖలైన పిటిషన్ పై విచారించిన కోర్టు.. రాధాకిషన్ రావును అరెస్టు చేయొద్దని చెప్పింది.

# బిసిలకు 34 శాతం

>> సవరణ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గాజువాకను ప్రత్యేకంగా తీసుకుని ఈ ప్రాంతంలో వెయ్యి గజాల వరకు కూడా సవరణ చేయలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే పట్టాదారు పుస్తకం విషయంలో కూడా చట్టసవరణకు వచ్చిన ప్రతిపాదనకు సంబంధించి మంత్రిమండలి ఆమోద ముద్ర పడింది. ఇక ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ 2025కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏప్రిల్ నెల నుంచే ఏపీలో మత్స్యకార భరోసా అమలు చేయాలని ఏపీ మంత్రి వర్గం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయం చీసుకుంది. మరోవైపు.. అన్నదాత సుఖీభవ పథకం కోసం విధివిధానాలు రూపొందించాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు.

వచ్చే 3 నెలల పాటు జనంలోకి వెళ్లాలని.. మంత్రులకు సూచించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని హితవు పలికారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యత మొత్తం మంత్రులే తీసుకోవాలని వెల్లడించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల మార్జిన్‌ను భారీగా పెంచుతూ ఏపి కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 10.5 శాతం ఉన్న లిక్కర్ షాపుల మార్జిన్‌ను 14 శాతానికి పెంచేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

ఎమ్ఎస్ఎఇ పాలసీని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. బడ్డి ఇండస్ట్రీలిస్టులకు అనేక ప్రోత్సహకాలు ఇచ్చారు. అయితే ఈసారి దాంట్లో స్వల్ప మార్పులు చేస్తూ కేబినెట్ ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి వారికి మరిన్ని ప్రోత్సహకాలు అందించే విధంగా కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమలను రాష్టానికి రప్పించడంతో పాటు.. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. పోలవరం నిర్వాసితులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వంలో, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రెండు సార్లు నగుదును రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఓ వైపు పోలవరం నిర్మాణం జరుగుతుండగానే.. మరోవైపు పోలవరం నిర్వాసితులకు రిహాబిలిటేషన్ చేసే విధంగా కేబినెట్‌లో చర్చించారు. వచ్చే 3 నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రులకు సిఎం సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు కీలక బాధ్యత తీసుకుని ప్రచారం నిర్వహించాలన్నారు. ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రం రూ.14 వేలు కలిపి ఇచ్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రంతోపాటు 3 విడతలుగా రాష్ట్రం ఆర్థిక సాయం ఇవ్వాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. మద్యం దుకాణాల యజమానులకు వచ్చే కమిషన్ 10.5 శాతం నుంచి 14 శాతానికి పెంచారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలు వచ్చే 3 నెలల్లో అమల్లోకి తీసుకొస్తున్నట్లు పునరుద్ఘాటించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లను కులాల వారీగా సర్దుబాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు.ఎన్ని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయో ఎప్పటికప్పుడు పరిశీలించి అందుకు తగ్గట్టు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలని సిఎం అన్నారు. పాఠశాలల పునప్రారంభంలోనే డిఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని ఆదేశించారు.ఉన్నత విద్యామండలికి ప్రత్యేక కమిషనరేట్ ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు.. స్వర్ణాంధ్ర విజన్2047లో భాగంగా అమలు చేయనున్న పీ4 విధానాన్ని ఉగాది నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించారు.దీనిపై కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రంలో సవరించిన రిజిస్ట్రేషన్ విలువలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. అదేవిధంగా 22ఏ, ఫ్రీ హోల్డ్ భూముల అంశంపై మంత్రివర్గానికి స్టేటస్ నోట్‌ను ఆయా జిల్లాల ఇంఛార్జ్ మంత్రులకు ఇచ్చే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంది.వైఎస్సార్సీపీ హయాంలో మద్యం అక్రమాలపై సిట్ విచారణ, సూపర్ సిక్స్‌లో భాగంగా అమలు చేస్తామని ప్రకటించిన కొన్ని పథకాలపైనా చర్చించి ఓ నిర్ణయం తీసుకుంది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నిర్మించే ఇళ్ల టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు పిలిచే ప్రతిపాదనపై కేబినెట్ చర్చించి.ఆ దిశలో నిర్ణయం తీసుకుంది..

2019కు ముందు నీరు చెట్టు కింద ఉన్న నిధులు సుమారు రూ. 900 కోట్లు క్లియర్ చేయాలంటూ ఉన్నతాధికారులకు సిఎం కేబినేట్‌నుంచి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికి నీరు చెట్టు కింద రూ.330 కోట్ల మేర పెండింగ్ బిల్లులు చెల్లించే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. పోలవరం ప్రాజెక్టులో పరిహారం పునరావాసం కల్పించే అంశపైనా చర్చించి నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రాజెక్టు నిర్మాణంతోపాటు ఆర్ అండ్ ఆర్ సమాంతరంగా చేపట్టేలా ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అలాగే 2019కి ముందున్న ఇళ్ళ బకాయిలు కూడా క్లియర్ చేయాలిని సూచించారు. ఈ బకాయిల కోసం పలువురు కార్యకర్తలు, నాయకులు మన చుట్టు తిరుగుతున్నారని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే ఇన్‌ఛార్జ్ మంత్రులు, జిల్లాలకు వెళ్లినప్పుడు వీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇకపై నాణ్యమైన పోషక విలువలు కలిగి సన్న బియ్యంతో మధ్యాహ్నా భోజర పథకం అమలు చేయాలని మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరుపై కేబినేట్‌లో చర్చించారు.మెనూలో చేసిన మార్పులపై సమావేశంలో విద్యామంత్రి నారా లోకేష్ వివరించారు. ప్రాంతాల వారిగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తీసుకుని వచ్చిన మార్పులను మంత్రి మండలి సమావేశంలో లోకేష్ ప్రస్తావించారు. బడులు తెరిచే నాటికి మెగా డీఎస్సీని పూర్తి చేయాలని మంత్రి మండలిలో నిర్ణయించారు. మద్యం దుకాణాల యజమానులకు కమిషన్ పెంపు చేయాలనని మంత్రి మండలి నిర్ణయించింది.ఇప్పటికే కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ తో పాటుగా అన్నదాత సుఖీభవ అమలు చేసేలా నిర్ణయించింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో డాక్యుమెంట్‌ల రిజిస్ట్రేషన్ కు డైనమిక్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రవేశ పెట్టే ప్రతిపాదనపై కేబినెట్ చర్చించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభించేలా ప్రభుత్వం సూత్ర ప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు మరింత బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేసారు. మూడు నెలల పాటు ప్రజల్లోనే ఉండాలని నిర్దేశించారు.

ఎపి మంత్రివర్గ సమావేశంలో సంక్షేమ పథకాల అమలు పైన కీలక చర్చ జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి పైన మంత్రివర్గంలో వివరించారు. జూన్ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ విద్యార్థికి అమలయ్యేలా రూ 15 వేల జమదిశగా తల్లికి వందనం పథకం అమలు చేయాలని నిర్ణయంతీసుకున్నారు. అన్నదాత సుఖీభవ గా అమలు చేయనున్న రైతు భరోసా పై మంత్రులకు చంద్రబాబు కీలక ఆదేశాలు ఇచ్చారు.



అమెరికానుండి వలసదారులను వెనక్కి పంపినందుకు నిరసనగా కాంగ్రెస్ గురువారం న్యూఢిల్లీలో జరిపిన ప్రదర్శనలో ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరులు

## వేసవిలో విద్యుత్తు కోతలు లేకుండా చర్యలు

### సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ.ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధనశాఖ అధికారులను ఆదేశించారు. దీనికోసం సాంకేతికత ఆధారంగా కరెంట్ డిమాండ్ అంచనాలను పక్కాగా రూపొందించాలని స్పష్టంచేశారు. వేసవిలో విద్యుత్‌శాఖ సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. వాతావరణ నివేదిక ఆధారంగా కృత్రిమ మేధను వినియోగించి డిమాండ్ అంచనాలను ఇంధనశాఖ రూపొందిస్తోందని చంద్రబాబు తెలిపారు. ఇంకా కచ్చితత్వం కోసం భూమిలో తేమశాతం, భూగర్భ జలాల డేటాను కూడా ఏఐకి అనుసంధానించాలని చెప్పారు. దీనివల్ల వ్యవసాయానికి ఎంత విద్యుత్ అవసరమనే లెక్కలు వస్తాయన్నారు.

విద్యుత్ అంతరాయాలను సాధ్యమైనంత మేరకు తగ్గించాలని సిఎం సూచించారు. ఇందుకోసం ప్రాంతాలవారీగా సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలన్నారు. తరచూ కరెంట్ అంతరాయం తలెత్తే ప్రాంతాల్లో కారణాలను గుర్తించి పరిష్కరించాలని సూచనలు చేశారు. విద్యుత్ సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న విధానంలోనే సిబ్బంది పనితీరుపైనా సర్వే చేయాలని వివరించారు. డిస్కంల సరఫరా నష్టాలను ఇంకా తగ్గించాలని చెప్పారు. దీనికోసం సబ్‌స్టేషన్, ఫీడర్ స్థాయిలో మీటర్లు ఏర్పాటుచేసి ఎనర్జీ ఆడిట్ చేయాలని తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయొద్దని ఎక్కువ సరఫరా నష్టాలు వచ్చే ఫీడర్ల పరిధిలో అవసరమైతే డ్రోన్ల ద్వారా కారణాలు గుర్తించాలని పేర్కొన్నారు.జెన్‌కో, కోల్ ఇండియా భాగస్వామ్యంతో ఒడిశాలోని తాల్చేరులో థర్మల్ ప్లాంట్ ఏర్పాటుచేసే ప్రతిపాదనను పరిశీలించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, ఇతర ప్రాంతాల్లో ప్లాంట్ ఏర్పాటుచేస్తే బొగ్గు రవాణా వ్యయం భారంగా మారుతుందని చెప్పారు. ఇక మీదట బొగ్గు గనులకు సమీపంలో థర్మల్ కేంద్రాలనే ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే సౌరవిద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటును పరిశీలించాలని సూచనలు చేశారు. వాటి నుంచి వచ్చే కరెంట్ ను నిల్వ చేసేందుకు పీఎస్పీలు, బ్యాటరీ స్టోరేజి ప్లాంట్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం పేర్కొన్నారు. అన్ని జెన్‌కో యూనిట్లు పనిచేసేందుకు వీలుగా బొగ్గు సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు గ్రిడ్ పీక్ డిమాండ్ రికార్డు స్థాయిలో 12,260 మెగావాట్లుగా రెండురోజుల కితం నమోదైంది. జనవరిలో 11,807 మెగావాట్లు గరిష్ఠ డిమాండ్‌గా నమోదైంది. జనవరిలో 6343 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదుకావడం ఇదే తొలిసారని ఇంధనశాఖ తెలిపింది. వివిధ పథకాల అమలుపై చేయిస్తున్న సర్వేల్లో సానుకూల స్పందన ఉందని సిఎం చెప్పారు. దావోస్ పర్యటన ఫలితం సానుకూలంగా ఉందని చంద్రబాబు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని ఆయన తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్మెంట్‌తో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదని తెలిపారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, ఎస్ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

## సిఎస్ విజయానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డిజిపి

**విజయవాడ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్త బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గుప్త సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు,తదితరంశాలపై ఇరువురు ఉన్నతాధికారులు చర్చించారు.పోలీసుపరంగా తీసుకుంటున్న పలు అంశాలను డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా, సీఎస్ విజయానంద్‌కు వివరించారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

>> పాలనలో రూ.11,68,62,288 క్రీడా ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రోత్సాహకాలు అందక దాదాపు 224 మంది రాష్ట్రంలోని క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.189 మంది క్రీడాకారులకు రూ.7,96,62,289 నగదును కూటమి ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసిందన్నారు. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంతో సిఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్‌కు శాప్ ఛైర్మన్ రవి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు.. ప్రోత్సహకాలు విడుదల చేయడంపై క్రీడాకారులతోపాటు క్రీడా సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేశాయి.

# ప్రతీకారం తప్పక తీర్చుకుంటా!

## బంగ్లాలో తమ నివాసాల ధ్వంసంపై షేక్ హాసీనా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** చరిత్రను బంగ్లాదేశ్ విధ్వంసకారులు మరువకూడదని, చరిత్రను విస్మరించలేరని, అలాగే చరిత్రను ధ్వంసంచేస్తేప్రతీకారం తీర్చుకుంటుందని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్‌హాసీనా హెచ్చరించారు. ఢాకాలో తన తండ్రి షేక్ ముజిబుర్‌రెహమాన్ ఇంటిని ధ్వంసంచేయడంపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశ రాజ్యాంగం, స్వాతంత్ర్యాన్ని విస్మరించిన దుండగులు నేడు జాతీయ పతాకాన్ని సైతం ధ్వంసంచేస్తారని ఆమె ఆరోపించారు. వేలాదిమంది అమరులైన తర్వాత ఎంతో అతికష్టంపై దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చామని ఈనాటి ప్రభుత్వం చరిత్రను విస్మరిస్తోందని ప్రస్తుత మహ్మద్ యూనస్ కేర్‌టేకర్‌ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఢాకాలోని 32ధన్‌మోండి నివాసంగా చెపుతున్న బంగ్లా జాతిపిత షేక్‌ముజిబుం రెహమాన్ ఇంటిని ఆందోళనకారులు ర్యాలీగా వెళ్లి ధ్వంసంచేసారు. అలాగే భవనంలో పలు భాగాలకు నిప్పుపెట్టారు. అలాగే పలువురు ఆవామీ లీగ్ నాయకుల ఇళ్లు, ఆవామీలీగ్‌కార్యాలయాలను కూడా ధ్వంసంచేసారు. షేక్ బుజబుర్‌రెహమాన్ విగ్రహాలను కూడా ధ్వంసంచేసారు. హాసీనా భర్త వాజేద్‌మియాన్ నివాసం సుధా సదన్, ఆమె సోదరులు షేక్ హేలాల్‌ఉద్దీన్, షేక్ సలావుద్దీన్ జ్యూయెల్‌ల నివాసాలను కూడా ధ్వంసంచేసారు. ఈ విధ్వంసకాండపై తీవ్రంగా స్పందించిన హాసీనా చరిత్రను ధ్వంసంచేయలేరని, అలాగే అదే చరిత్రకు ప్రతీకారం తీర్చుకోడం కూడా తెలుసని వ్యాఖ్యలుచేసారు. హాసీనా వ్యాఖ్యలపై బంగ్లా విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. ఢాకాలోని తాత్కాలిక భారత్ రాయబారిని పిలిపించి బంగ్లాదేశ్ విదేశాంగ ప్రతినిధి తౌహుద్‌మహ్మద్ హాసీనా వ్యాఖ్యలపట్ల నిరసన, తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

# 'జమిలి' కోసం చూస్తున్న జనం

>> కుంటే ఎలా అని ప్రశ్నించారు. సాయిరెడ్డి సహా వెళ్లిపోయిన అందరికీ ఇదే వర్తిస్తుందని అన్నారు. వైఎస్సార్సీపీకి ఈ రోజు ఉందంటే అది నాయకుల వల్ల అయితే కాదని జగన్ అన్నారు.

గురువారం ఉదయం 11గంటల ప్రాంతంలో వైకాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్ తన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని

ఎన్డీఏ కూటమిపైన,తమ పార్టీని వదిలివెళ్ళిన వారిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు.ఆయా అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మీడియాకు చూపించారు. బాబు ష్యూరిటీ. మోసం గ్యారెంటీ అన్నరీతిలో సాగుతుంది. ఎన్నికల ముందు, చంద్రబాబుగారి నోట మాట ఏమిటంటే.. బాబు ష్యూరిటీ. భవిష్యత్తు గ్యారెంటీ. కానీ, ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే.. బాబు ష్యూరిటీ. మోసం గ్యారెంటీ అన్నట్లుగా మారిందంటూ ఏద్దేవా చేసారు.చంద్రబాబు సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ అన్నారు. మ్యానిఫెస్టోలో 143 హామీలు ఇచ్చి, ఇంటింటికీ ప్రచారం చేశారు. ఇంకా ఆ హామీలకు గ్యారెంటీ అంటూ బాండ్లు చూపారు. ఇంటింటికీ పంచారు. అమలు చేయలేకపోతే చొక్కా పట్టుకోమన్నారు. నిలదీయమన్నారు.అప్పుడు మీరిచ్చిన బాండ్లు ఏమయ్యాయి? మ్యానిఫెస్టో ఏమైంది? పంచిన పాంప్లెంట్లు ఏమయ్యాయి? ఎవరి చొక్కా పట్టుకోవాలన్నారు.గతంలో ఎన్నడు లేనంతగా రికార్డు స్థాయిలో అప్పులు చేసారన్నారు.మరోవైపు రాష్ట్ర అప్పులు ఈ 9 నెలల్లోనే రికార్డుల బద్ధలు కొట్టాయి. గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో అప్పులు చేయలేదు. 9 నెలల కాలంలోనే బడ్జెటరీ అప్పులే రూ.80,827 కోట్లు.

ఇంకా అమరావతి పేరు చెప్పి ఇప్పటికే తెచ్చిన అప్పులు. తేబోతున్న అప్పులు మరో రూ.52 వేల కోట్లు. ఇందులో ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.15 వేల కోట్లు. జర్మనీ కెఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు. హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు. సీఆర్‌డీఏ కమిట్ అయిన అప్పులు మరో రూ.21 వేల కోట్లు.ఇవికాక మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా మరో రూ.8 వేల కోట్లు, ఏపీ ఎండీసీ ద్వారా తేబోతున్న అప్పులు మరో రూ.5 వేల కోట్లు. అన్నీ కలిపితే ఇప్పటికే చేసిన, తెస్తున్న అప్పులు ఏకంగా రూ.1.45 లక్షల కోట్లకు పైగానే. ఇది నిజంగా రికార్డు. ఎవరూ బద్దలు కొట్టలేని రికార్డు. రాష్ట్ర సంపద అమ్మేస్తున్నారన్నారు.

**ఎవరి హయాంలో వాస్తవ అభివృద్ధి?:**

చంద్రబాబు హయాంలో 2014-19 మధ్య దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.47 శాతం కాగా.. వైయస్సార్‌సీపీ హయాంలో అది 4.80 శాతం. చంద్రబాబు దిగి పోయే నాటికి, 2018-19లో రాష్ట్ర తలసరి ఆదాయంలో మనం దేశంలో 18వ స్థానంలో ఉంటే.. అదే మేము దిగిపోయే నాటికి తలసరి ఆదాయంలో 15వ స్థానానికి ఎదిగాం.

2019-24 మధ్య మన ప్రభుత్వ హయాంలో దేశంతోనే పోటీ పడ్డాం. మన ప్రభుత్వం ఉన్న హయాంలో దేశ జీడీపీ పురోగతి 9.34 శాతం అయితే, రాష్ట్ర జీడీపీ 10.23 శాతం చొప్పున పెరిగింది.

పారిశ్రామిక రంగం జీవీఏ. అంటే పారిశ్రామిక రంగం ఉత్పత్తుల విలువ మొత్తం చూస్తే.. చంద్రబాబు దిగిపోయే నాటికి మన రాష్ట్రం 11వ స్థానంలో ఉంటే, మా హయాంలో 9వ స్థానానికి ఎదిగామన్నారు.ఇప్పటి పరిస్థితి ఏమిటో ఆలోచించాలన్నారు.చంద్రబాబు తప్పుడు ప్రచారాన్ని ఇక జనం నమ్మే పరిస్థితి లేదన్నారు.

## చైనా డీప్‌సీక్‌పై దక్షిణకొరియా నిషేధం!

### మరికొన్ని దేశాలు ఇదే బాటలో...

**సియోల్, ఫిబ్రవరి 6:** కృత్రిమమేధ రంగంలో తాజా సంచలనం చైనాకు చెందిన దీప్‌సీక్ ఒకవైపు దూసుకుపోతుంటే మరోవైపు ఈసంస్థపై అనుమానాలు కూడా ఎక్కువ వస్తున్నాయి. డీప్‌సీక్ వాడకంపై ఇప్పటికే పలు దేశాలు నిషేధం విధించగా తాజాగా దక్షిణకొరియా సైతం ఆ జాబితాలో చేరింది. ఆ దేశ రక్షణ వాణిజ్య కంప్యూటర్లలో డీప్‌సీక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. డీప్‌సీక్ వినియోగంపై పలుదేశాలనుంచి వస్తున్న ఆందోళనల నేపథ్యంలోనే దాన్ని నిషేధించాలని నిర్ణయించామని ఇంటెలిజెన్స్ అధికారులు వినియోగంలోజాగ్రత్తలు వహించాలని యూజర్లకు చెందిన వ్యక్తిగత సమాచార సేకరణ వ్యవస్థకు సంబంధించిన వివరాలు అస్పష్టంగా ఉన్నాయని రక్షణ వాణిజ్యమంత్రిత్వశాఖలు వెల్లడించాయి. దేశ పర్యావరణ మంత్రిత్వశాఖసైతం ఇదే హెచ్చరికలు జారీచేసింది. అమెరికాలో నిషేధం ఎదుర్కొన్న చైనా ప్రభుత్వరంగ టెలికాం కంపెనీతో డీప్‌సీక్‌కు సంబంధాలున్నాయని నిపుణులు చెపుతున్నారు. కంప్యూటర్ కోడ్ ద్వారా యూజర్లకు చెందిన లాగిన్‌సమాచారాన్ని ఆ టెలికాం సంస్థకు చేరవేస్తోందని చెపుతున్నారు. తొలుత కెనడాకు చెందినఫీరూట్ సెక్యూరిటీసంస్థ దీన్ని గుర్తించి అసోసియేటెడ్‌ప్రెస్ వార్తా సంస్థతో పంచుకుంది. ఈ వివరాలను స్వతంత్ర కంప్యూటర్ నిపుణులు ధృవీకరించారు. అయితే డేటా బదిలీజరిగిందా లేదా అన్నది మాత్రం ఈ సంస్థలు గుర్తించలేదు. ఈ ఆరోపణలపై అటు డీప్‌సీక్‌గాని చైనా మొబైల్‌కానీ స్పందించలేదు. దీనితో డీప్ సీక్ సేవలపై ఆస్ట్రేలియా, ఇటలీ, తైవాన్‌దేశాలు ఇప్పటికే నిషేధంప్రకటించాయి. ప్రభుత్వ కంప్యూటర్లు,డివైజ్‌లలో వాడకంపై ఆస్ట్రేలియా నిషేధం ప్రకటించింది వ్యక్తిగత డివైజ్‌లపై మాత్రం నిషేధంలేదు. డీప్‌సీక్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని పైరులకు అక్కడి ప్రభుత్వం సూచించింది.

## బేగంపేట విమానాశ్రయంలో ప్రమాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి6:** బేగంపేట విమానాశ్రయంలో ప్రమాదం చోటు చేసుకోవడం కలకలం రేపుతుంది. ఇందుకు సంబందించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ల్యాండ్ అవుతున్న క్రమంలో ఓ ట్రైనీ ఎయిర్ క్రాఫ్ట్ అదుపుతప్పి రన్ వే నుంచి పక్కకు ఒరిగి పోయింది. ఎయిర్ క్రాఫ్ట్ ముందు చక్రం వంగిపోవడంతో రన్ వేను చీల్చుకుంటూ కొంత దూరం ముందుకు వెళ్లింది. దీంతో రన్ వే దెబ్బతిన్నది. ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడినట్లు తెలిసింది.కాగా ఈ ఘటన జరిగిన వెంటనే ఎయిర్ పోర్టు సిబ్బంది స్పందించి అవసరమైన చర్యలు చేపట్టారు. పాడైన రన్ వే ను ప్రస్తుతం అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో బేగంపేట విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ఆలస్యంగా సాగినట్లు సమాచారం. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లే ముందు ఈ ప్రమాదం చోటు చేసుకోవడం కలకలం రేపింది.

## జనసేనకు తెలంగాణలో కూడా గాజు గ్లాస్ గుర్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి6:** జనసేన పార్టీకి తెలంగాణ ఎలక్షన్ కమిషన్ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ఆ పార్టీకి గాజు గ్లాసు గుర్తును కేటాయించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కామన్ సింబల్‌తో పోటీ చేసే వెసులుబాటు కల్పించింది. అయితే జనసేన తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనలో లేనట్టే కనిపిస్తోంది. ఎన్డీయే కూటమిలో భాగంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ తెలంగాణలో కొన్ని స్థానాల్లో పోటీ చేసింది.

పవన్ కళ్యాణ్ పోటీకి సుముఖంగా లేనప్పటికీ బీజేపీ ఒత్తిడితో ఆఖరి నిమిషంలో 8 స్థానాల్లో అభ్యర్థులను బరిలో నిలబెట్టారు. పోటీ చేసిన అన్ని చోట్లా డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. అనంతరం పూర్తిగా ఏపీ ఎన్నికలపైనే దృష్టి పెట్టారు. అక్కడ పోటీ చేసిన 21 స్థానాల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఫోకస్ ఏపీ రాజకీయాలపైనే ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీ చేయకపోవచ్చునని అంటున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 7-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
దశమి రా.9.26
రోహిణి సా.6.39
వర్జ్యం : రా.12.07-12.41
దు.ఉ.9.03-9.49 2) మ.12.52-1.38
శుభసమయం : ఉ.7.00-8.00,
సా.5.00-5.50
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో పేరు ప్రతిష్ఠలు పెరుగుతాయి. వస్తు, వస్త్రాలాభాలు పొందుతారు.

**వృషభం :** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు. వాహన సౌఖ్యం. బంధువుల కలయిక.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. వస్తు, వస్త్రాల కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలు చేపడతారు. రుణాలు తీరుస్తారు. కాంట్రాక్టులు లభిస్తాయి.

**సింహం:** ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రయాణాలు లాభిస్తాయి. నూతన పరిచయాలు.

**కన్య :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. పట్టుదల పెరుగుతుంది.

**తుల :** బంధువులతో ఏర్పడిన మాటపట్టింపులు పరిష్కరించుకొంటారు. విలువైన వస్తువులు జాగ్రత్త.

**వృశ్చికం:** ఖర్చులు అధికం.మిత్రుల నుండి వత్తిడులు పెరుగుతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**ధనుస్సు:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. పెద్దల సలహాలు స్వీకరిస్తారు. ఇంటా బయట అనుకూలం.

**మకరం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధికమిస్తారు. ప్రయాణాలు రద్దు చేసుకొంటారు.

**కుంభం:** మీలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. కొత్త విషయాలు తెలుసుకొంటారు.

**మీనం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖుల కలయిక. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5వేల మందికి షేడ్‌నెట్స్

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ ఫిబ్రవరి6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యానసాగును ప్రోత్సహించేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 5వేల మంది డ్వాక్రా మహిళలకు 50 శాతం రాయితీతో షేడ్‌నెట్స్‌ను అందిస్తామని సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ నేతృత్వంలో రాయితీపై షేడ్‌నెట్స్ అందజేతకు సంబంధించి నాబార్డు కేతీ సంస్థలతో సెర్ప్ అధికారులతో బుదవారం ఒప్పందం చేసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఒక్కో షేడ్ నెట్ వ్యయం రూ.3.22 లక్షలు. అందులో 50 శాతం రాయితీని ఉద్యానశాఖ ద్వారా అందిస్తాం. మిగతా మొత్తాన్ని ఉన్నతి స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణం ఇప్పిస్తాం. జాతీయ జీవనోపాధుల కార్యక్రమం కింద కేంద్రంనుంచి భారీగా నిధులు మంజూరుకుగాను రాష్ట్రవాటాఅందించేందుకు ప్రభుత్వం సమ్మతితెలిపింది. ఈ కార్యక్రమం కింద ఇప్పటి వరకు రూ.550 కోట్ల వరకే రాష్ట్రానికి దక్కుతుండగా దాన్ని రూ.1000 కోట్లకు పెంచనున్నాం. వైకాపా ప్రభుత్వంలో ఈ పథకానికి రాష్ట్రవాటా విడుదల చేయలేదు అని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి 260 మందికి పంపిణీ చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టామని, లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయిందని వెల్లడించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



పట్టువస్త్రాలను అందించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు(ఫైల్ ఫోటో)

## 23న శ్రీశైలం, 25న శ్రీకాళహస్తిలో సిఎం పట్టువస్త్రాల సమర్పణ

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఈ నెల 23న శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి 25న జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి మహాశివరాత్రి సందర్భంగా పట్టు వస్త్రాలను ప్రభుత్వం తరఫున అందించనున్నారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఉత్తం ్వులు జారి చేసింది. ఏర్పాట్లుకు ఆదేశించింది శ్రీకాళహస్తీశ్వరునికి ప్రభుత్వం నుంచి మొట్టమొదటి సారి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను అందించనున్నారు. ఇప్పటి వరకు ఆలయ చరిత్రలో లేని విధంగా ఈ ఏడాది ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వాయులింగేశ్వరునికి పట్టు వస్త్రాలు అందించనున్నారు. ఈ నెల 1న జరిగిన రెవెన్యూ, దేవాదాయశాఖ మంత్రుల శివరాత్రి ఏర్పాట్ల సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్యమంత్రిని పట్టువస్త్రాలు అందించుటకు అభ్యర్ధించామని ప్రకటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి అంగీకరించినట్లు సమాచారం. తిరుపతి జిల్లా లోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను జిల్లాకు చెందిన మంత్రి అందించే వారు. లేకుంటే జిల్లా ఇన్‌చార్జి మంత్రి అందించే వారు. అయితే ఈ ఏడాది జిల్లాలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నారు. మంత్రి ఎవ్వరూ లేదు. ఇన్‌చార్జిగా రెవెన్యూశాఖ మంత్రి ఉన్నారు. జిల్లాకు చెందిన చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కూడా అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పట్టు వస్త్రాలను అందించాలని అభ్యర్థించారు. గతంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఐదేళ్ళు కొనసాగినపుడు కూడా అభ్యర్ధించారు. కానీ సాధ్యం కాలేదు. ఈ సారి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల తనయుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పట్టుబట్టారు. అంతేకాక జిల్లాకు మంత్రి లేదు కాబట్టి ముఖ్యమంత్రియే అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈ సారి 'నభూతో అన్నట్లు' ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటు శ్రీకాళహస్తి అటు శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వ లాంఛనాలతో అందించే పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి అందించుటకు అంగీకరించటంతో ఆ పార్టీ కార్యకర్తల్లోనే కాకుండా నాయకుల్లో కూడా ఉత్సాహం చోటు చేసుకుంది. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి భారీ ఎత్తున ఏర్పాట్లుకు సిద్దమౌతున్నారు.

## తిరుమల సమాచారం

### వెంకన్న ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి





**తిరుమల,ఫిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా ఉండాలని, అందరికీ మంచిజరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌ఎ పులివర్తినాని తది తరులు విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా శ్రీవేంకటే శ్వరస్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాపు, మున్నూరు కాపు, బలిజ, తూర్పు కాపు ప్రతినిధుల సమావేశం

### - జె ఎ సి - చందు జనార్దన్, మంగ బాబు

**విజయవాడ ఫిబ్రవరి 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కాపు, మున్నూరు కాపు, తూర్పు కాపు, బలిజ వర్గాల ప్రతినిధుల సమావేశం హైదరాబాద్‌లో ఫిబ్రవరి 22 న జరగనుందని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చందు జనార్దన్ ,రంగిశెట్టి మంగబాబు తెలిపారు. కులం ఎదుర్కొంటున్న ప్రధాన మైన సమస్యలపై ఈ ప్రతినిధుల సమావేశంలో చర్చించున్నట్లు ఈ సమావేశంకు చెందిన బ్రోచర్ ఆవిష్కరణ మన పార్లమెంట్ సభ్యుల, నాయకుల చేతుల మీదగా ఢిల్లీలో జరిపినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ , డాక్టర్ కె. లక్ష్మణ్ ఎంపీ, పార్లమెంటరీ కమిటీ సభ్యులు బిజెపి, ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ బీఆర్ ఎస్ గాయత్రి గ్రానైట్స్ అధినేత, మచిలీపట్నం ఎంపి జనసేననేత వల్లభనేని బాలశౌరి, బిజెపి బెంగుళూర్ ఎంపీ పీ సి మోహన్. హోసూరు కాంగ్రెస్ ఎంపీ గోపి నాథ్ కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ టీడీపీ సాన ఎంపీ సతీష్ ,సుమన్ టీవీ ఛైర్మన్ సుమన్, సి హెచ్ విఠల్ మాజీ టి ఎస్ పి ఎస్ సి సభ్యులు, వుసా రఘు సీనియర్ న్యాయవాది మున్నూరు కాపు సంఘం క్రమశిక్షణ సంఘం చైర్మన్ వేదుల వెంకటరమణ త్రిబుల్ ఇటీ మాజీ వీసీ, సుధీర్ ప్రముఖ వ్యాపారస్తులు సంఘ నాయకులు, చందు శ్రీనివాస్ మెగా పొలిటికల్ ఎనలిస్ట్ డాక్టర్ పీ ఎల్ ఎన్ పటేల్ పెన్ సంఘనాయకులు బేతి శ్రీదర్ ప్రముఖ వ్యాపారస్తులు పెన్ సంఘ నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

## రూ.44లక్షల విరాళంతో ఒకరోజు అన్నప్రసాద వితరణ

### - దాతపేరున స్వయంగా వడ్డించే అవకాశం

**తిరుమల,ఫిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి వస్తున్న భక్తులకు తిరుమల,తిరుపతిలో కలపి రోజుకు సరాసరి 2.50లక్షలమంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు. లక్షలాదిమంది భక్తులకు రుచిగా,శుచిగా నాణ్యతతో కూడిన పదార్థాలతో అన్నప్రసాదాలను తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తోంది. భక్తుల రద్దీ,అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తుల సంఖ్య కూడా పెరగడంతో అవసరమైన మేరకు దాతలైన భక్తుల కోరిక మేరకు అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం విదితమే. ఏడుకొండలవాడా గోవిందా...వేంకటరమణా గోవిందా....అంటూ కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. అంతేగాక పుట్టినరోజు, వివాహవార్షికోత్సవం, ఇతరత్రా ప్రాధాన్యత రోజుల్లో దాతలైన భక్తులు తమ పేరున భక్తులకు అన్నప్రసాద వితరణ చేసే అవకాశం కల్పించారు. ఇందుకు ఒకరోజు పూర్తిగా 44లక్షలు రూపాయలు విరాళం అందించాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. విరాళం అందించిన దాత పేరును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు. దాతలు కోరిక మేరకు వారే స్వయంగా ఒకరోజు ఇక్కడ అన్నప్రసాద వితరణ చేయొచ్చు. తిరుమలకొండకు వచ్చిన భక్తులు ఆకలి అనేది తెలియకుండా అక్షయపాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసాదాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. దేశవిదేశాల నుండి ఏడుకొండలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు తిరుమలలో రుచిగా, శుచిగా పలు ప్రాంతాల్లో అన్నప్రసాదాల కౌంటర్లు ఏర్పాటుచేసి పంపిణీ చేస్తున్నారు. మాతృశ్రీ వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1,2,లోని కంపార్టుమెంట్లు, వృద్ధులు,దివ్యాంగులు వేచి వుండే కాంప్లెక్స్, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన కంపార్టుమెంట్లు, ప్రదాన కల్యాణకట్టలో టీ,కాఫీ, పాలు అందిస్తున్నారు. అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30గంటల నుండి 10.30గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటల నుండి రాత్రి 10.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ, అన్నం, కూర,సాంబారు,రసం, మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. అన్నప్రససాదాల తయారీకి రోజుకు 14నుండి 16.5టన్నుల బియ్యం, 6.5టన్నుల నుండి 7.5టన్నుల కూరగాయలు వినియోగిన స్తున్నారు. తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసం వసతిసముదాయం, విష్ణునివాసం కాంప్లెక్స్‌లు ,రుయా ఆస్పత్రి, స్విమ్స్, ప్రసూతి ఆస్పత్రి, బర్డ్, ఎస్వీయూ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు.

## కోనేరు సత్యనారాయణకు హైకోర్టులో స్వల్ప ఊరట

### న్యాక్ బృందానికి లంచాల కేసు

**విజయవాడ ఫిబ్రవరి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. కోనేరు సత్యనారాయణపై 2 వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి ఏ++ గుర్తింపు పొందేందుకు న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చిన ఆ సంస్థ యాజమాన్యంపైన, తీసుకున్న సభ్యులపైనా సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మొత్తం 14 మందిని నిందితులుగా చేర్చింది. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్, ఇతర ప్రతినిధులతోపాటు న్యాక్ తనిఖీ బృందంలోని మొత్తం 10 మంది సభ్యులను నిందితులుగా పేర్కొంది. 10 మందిని ఆరెస్టు చేసింది. కేఎల్‌యూ యాజమాన్య ప్రతినిధులతో పాటు దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు ఇందులో సంచలనం సృష్టించింది. ఏ++ రేటింగ్ కోసం యూనివర్సిటీ యాజమాన్యం నగదు. బంగారం, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల రూపంలో న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చింది. దీనిపై సీబీఐకి ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేసి, వెంటనే రంగంలోకి దిగింది. ఆఘమేఘాలపై దిల్లీ నుంచి వచ్చిన బృందాలు తనిఖీలు చేపట్టాయి. చెన్నై బెంగుళూరు , విజయవాడ, పాలము, సంబల్‌పూర్, బోపాల్ బిలాస్‌పూర్, గౌతమ్ బుద్ధనగర్ , న్యూదిల్లీలోని 20 చోట్ల న్యాక్ బృంద సభ్యుల నివాసాలు కార్యాలయాల్లోనూ సోదాలు చేశాయి. రూ. 37 లక్షల నగదు, 6 ల్యాప్‌టాప్‌లు, ఒక ఐఫోన్ 16 ప్రో స్వాధీనం చేసుకున్నాయి.

## తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్



ఈవెంట్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న భువనేశ్వరి,తమన్

**విజయవాడ ఫిబ్రవరి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** తలసేమియా బాధితులకు సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ ఈ నెల 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని, ఆ ట్రస్టు చైర్మన్ భువనేశ్వరి చంద్రబాబు నాయుడు, ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకుడు తమన్ మీడియాకు వివరించారు. అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో జరగనున్న సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. తమన్ మాట్లోడుతూ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఈ షోను నేను చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.. నారా భువనేశ్వరి ఈ కార్యక్రమం చేయాలి అని అడిగారు. తలసేమియా బాధితులకు సహాయం కోసం అని చెప్పగానే నేను వెంటనే ఈ కార్యక్రమంకి వస్తా అని చెప్పాను. భువనేశ్వరి నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం నా చేతిలో పెట్టారు. ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్రం కోసి పగలు రాత్రి పని చేస్తున్నారు. టికెట్‌పై పెట్టే ప్రతి రూపాయి తలసేమియా బాదితులకు వెళ్తుంది. నారా భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం అనే సిద్ధాంతంతో ఎన్టీఆర్ ట్రస్ట్ నడుస్తుంది. తలసేమియా బాధితుల కోసం ఈ నెల 15న మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసాము. ప్రతి టికెట్‌పై వచ్చే రూపాయి తలసేమియా బాధితులకు అందిస్తాం .బ్లడ్ డొనేట్ చేస్తే చాలా మంది జీవితాలు నిలబడతాయి. తమన్ కూడా ఒక్క నిమిషం ఆలోచించకుండా వెంటనే మ్యూజికల్ నైట్ కి వస్తా అన్నారు. తమన్ ఈ షో ఫ్రీ గా చేస్తా అని గొప్ప హృదయంతో చెప్పారు. ప్రతి ఒక్కరు తెలుగు తల్లికి రుణం తీర్చుకోవాలి సమాజ సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేయాలి. మనం వెళ్ళేటప్పుడు మన వెంట డబ్బు రాదు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తే అందరికి గుర్తు ఉంటుంది. ప్రతి ఒక్కరు కొనే టికెట్ సమాజ సేవకే ఉపయోగపడుతుంది. ఈ నిర్ణయం సీఎం చంద్రబాబు పీఏలకుగాని, మరెవ్వరికిగాని వర్తిస్తోందన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే కార్యక్రమ ఏర్పాట్లుకు సంబంధించిన అంశాలను నారా భువనేశ్వరి, తమన్ పరిశీలించారు.

## సీమ మీదుగా మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు..

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ (అలహాబాద్)లో జరుగుతున్న మహాకుంభమేళకు రాయలసీమ జిల్లాల మీదుగా తిరుపతి-దానాపూర్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి దానాపూర్ వెళ్లే నెంబర్ 07117ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14వ తేదీ రాత్రి 11-45గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి, రెండోరోజున రాత్రి 11-55గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07118ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3-15గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి రెండవరోజు మధ్యాహ్నం 1-55గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మల్కాజిగిరి, చర్లపల్లి, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, సేవగ్రామ్, నాగపూర్, ఇటార్సీ, పిపారియా, జాబల్‌పూర్, కత్ని, సత్నా, మాణిక్‌పూర్, ప్రయాగరాజ్(అలహాబాద్), మిర్జాపూర్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ (మొగల్ సరాయ్), బక్సర్, అరా స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే తిరుపతి నుంచి దానాపూర్ వెళ్లే నెంబర్ 07119మరో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18వ తేదీ రాత్రి 11-45గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి రెండవరోజు రాత్రి 11-55గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్ నుండి తిరుపతి వెళ్లే నెంబర్ 07120ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21న మధ్యాహ్నం 3-15గంటలకు దానాపూర్ నుంచి బయలుదేరి రెండవరోజు మధ్యాహ్నం 1-45గంటలకు తిరుపతి చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం , రాయచూరు, క్రిష్ణా, యాద్గీర్, సూలేహళ్ళీ, సేడం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లపల్లి, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, సేవ గ్రామ్, నాగపూర్, ఇటార్సీ, పిపారియా, జాబల్ పూర్, కత్ని, సత్నా, మాణిక్‌పూర్, ప్రయాగ రాజ్(అలహాబాద్), మిర్జాపూర్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ(మొగల్ సరాయ్), బక్సర్, అరా స్టేషన్లలో నిలుస్తాయి.

## దేశం అభివృద్ధి చెందాలంటే కొన్ని సామాజిక విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి

### - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్

**విజయవాడ ఫిబ్రవరి 06 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ దేశం అయిన అభివృద్ధి చెందాలి అంటే కొన్ని సామాజిక విషయాలు పరిగణలోకి తీసుకోవాలి జయప్రకాష్ భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ అన్నారు. దేశీయ వ్యవస్థలో పేదరికం లేని పరిస్థితులు కల్పించాలన్నారు. ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి వివరాలను అందరు పరిశీలించాలన్నారు. అందులో ప్రధానంగా వ్యవసాయం, చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందాలి. అందుకు అనుగుణంగానే బడ్జెట్ ప్రవేశపెట్టారు. వికసిత్ భారత్ కేవలం, మోడీతో సాధ్యం, అందుకు అనుగుణంగా నిర్మలా సీతారమాన్ బడ్జెట్ వుంది. దేశంలో వున్న ప్రతి ఒక్క సామాన్య వ్యక్తికి కూడా బడ్జెట్ లో ప్రాముఖ్యత ఉంది. దేశం అభివృద్ధి చెందాలి అంటే దేశం యొక్క తలసరి ఆదాయం పెరగాలి. భారత్ తలసరి ఆదాయం పెరగాలి అంటే 7.6 శాతం పెరిగితే దాన్ని అభివృద్ధి చెందిన దేశంగా పరిగణిస్తారు. దీనితో పాటు మధ్యతరగతి కుటుంబంలో 12 లక్షల ఆదాయం వున్న వారికి ఆదాయ పన్ను సడలింపు చేశారు. ఎంఎస్ఎమ్ఇ లకు 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. మంచి చదువులు చదువుకున్న యువతకు ఎంఎస్ఎంఇ రుణాలు పెంచుతూ ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్ లో మహిళలకు గతంలో కంటే రుణాలు ఎక్కువ ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా వున్న విద్య సంస్థలకు మన రాష్ట్రానికి బడ్జెట్‌లో ప్రాముఖ్యత కల్పించారు. అమరావతి, పోలవరంకి ప్రత్యేక నిధులు కేటాయించారు. గతంలోనే అమరావతిని స్మాట్ సిటీ గా ప్రకటించారు. పోలవరంకి మరొక 5వేల కోట్లు కేటాయించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి పునర్జీవం కల్పించే దిశగా అడుగులు దశల వారికి స్టీల్ ప్లాంట్‌కి నిధులు కేటాయించారు. రైల్వే బడ్జెట్ ఆంధ్రకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. విశాఖ పోర్టుకి 730 కోట్లు కేటాయింపు. గత 5 ఏళ్లలో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో జగన ప్రభుత్వం విఫలం అయ్యింది. కానీ నేడు చంద్రబాబు ఎన్డీఏ నాయకత్వములో రాష్ట్రానికి నిధులు అధికంగా వస్తున్నాయి. ఎన్డీఏ భాగస్వామ్యంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నాయన్నారు.

## గుంతకల్లు రైల్వే డివిజన్ మరోమారు కుదింపు..



గుంతకల్లు రైల్వే డివిజనల్ కార్యాలయం

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 6,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మరోమారు కుదింపుకు గురికానుంది. గతంలో 2003ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన నూతన రైల్వే విధానంలో నాడు బెజవాడ డివిజన్‌లోని దొనకొండ-నంద్యాల 136.9కి.మీల సెక్షన్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన గుంటూరు రైల్వే డివిజన్‌లో విలీనం చేశారు. దీంతో నాడు దొనకొండ-నంద్యాల సెక్షన్‌ను గుంతకల్లు డివిజన్ కోల్పోయింది. అదే సమయంలో ఏర్పడిన నైరుతి రైల్వే జోన్‌లో అప్పటి వరకు గుంతకల్లు డివిజన్‌లో కొనసాగిన గుంతకల్లు-తోరణగల్లు-రంజిత్‌పుర-హాస్పేట 135.72కి.మీల సెక్షన్‌ను విడగొట్టి హాస్పేట్-తోరణగల్లు-రంజిత్ పుర-బళ్లారి 87కి.మీలను హుబ్లీ డివిజన్‌కు బదలాయించారు.

బళ్లారి-గుంతకల్లు మధ్య 48కి.మీలను మాత్రమే గుంతకల్లు డివిజన్‌లో ఉంచారు. దీంతో వాణిజ్యపరంగా కీలకమైన హాస్పేట-తోరణగల్లు-రంజిత్ పుర సెక్షన్‌ను కూడా నాడు గుంతకల్లు కోల్పోయింది. ప్రస్తుతం తాజాగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని రాయచూరు-వాడి 108కి.మీల సెక్షన్‌ను సైతం గుంతకల్లు డివిజన్ కోల్పోనుంది. కొత్తగా ఏర్పడే రైల్వే జోన్‌లు,డివిజన్ల ప్రభావంతో గుంతకల్లు రైల్వే డివిజన్ మొత్తంగా 332.62కి.మీల మేర కోల్పోయినట్లే..

## ప్రత్యేక హోదా తేవడంలో కేంద్ర మంత్రులు, ఎంపిలు విఫలం!

### - విభజన హామీల సాధన కమిటి నేతలు శ్రీనివాసులు, జెడి లక్ష్మీనారాయణ, సిపిఐ నేతల హెచ్చరికలు




**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఏపీకి ప్రత్యేక హోదా తీసుకుని రావడంలో కేంద్ర మంత్రులు, ఎంపీలు విఫలం అయ్యారని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాదన సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్రం నిన్న విడుదల చేసిన బడ్జెట్‌లో ఏపీని నయవంచన చేసిందని బాధపడ్డారు. ప్రధాని మోదీ గుజరాత్, ఇతర రాష్ట్రాలకు బడ్జెట్‌లో రూ. వేల కోట్ల నిధులు మంజూరు చేస్తుంటే, ఏపీ రాష్ట్రాన్ని బడ్జెట్‌లో గ్రామం, జిల్లా హోదాలో పరిగణించి కేవలం రూ.278 కోట్లు రైల్వే బడ్జెట్‌కు కేటాయించడం దారుణమన్నారు. ఇదే తరహాలో ప్రతి బడ్జెట్‌లో జరుగుతుందని, ఇకనైనా కేంద్ర మంత్రులు, ఎంపీలు ఏపీకి ప్రత్యేక హోదా తేవడానికి ప్రయత్నించాలని సూచించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఏపీ అభివృద్ధికి నిరంతరం సైనికునిలా పనిచేస్తున్నాడని, అయితే అమరావతికి రూ.17వేల కోట్లు అప్పుల రూపంలో కేటాయించి కూటమి సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. పార్టీలకు అతీతంగా ఏపీకి ప్రత్యేక హోదా కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఏపీ, తెలంగాణ విభజన తర్వాత ఇప్పటి వరకు కూడా కేంద్రం విభజన హామీలు ఇచ్చిన పాపాన పోలేదని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్ల నీటి మట్టానికి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. దీని వలన అధిక విద్యుత్ రాబడికి, తాగునీరు, సాగునీటికి ప్రజలు భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని స్పష్టం చేశారు. దీనివలన పోలవరం ప్రాజెక్టు రిజర్వాయర్ ప్రాజెక్టుగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర మంత్రులు, ఎంపీలు ఓఅడుగు ముందుకు వేసి ఏపీకి ప్రత్యేక హోదా సాధించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, లేని పక్షంలో భవిష్యత్‌లో ఏపీ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని జోస్యం చెప్పారు. అనంతరం సీపీఐ నేతలు మురళీ మాట్లాడుతూ కేంద్రం నిన్న విడుదల చేసిన బడ్జెట్‌లో ఏపీకి విడుదల చేసిన నిధులు జీరో అన్నారు.

## ఒంటరి మహిళను టార్గెట్ చేసి దోపిడీ చేసిన దొంగలు అరెస్టు

### - రూ. 30 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, కారు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం



**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త** ఒంటరి మహిళను టార్గెట్ చేసి దోపిడి చేసిన ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి హార్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అంతర్ రాష్ట్ర దోపిడి అరెస్టు కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పి హార్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ముద్దాయిలు కృష్ణ, అతని తమ్ముడు శరత్, వేణుగోపాల్ ఒక సభ్యులుగా ఉండి మరియు వారి సహచరులు రవి, గణేష్, ప్రశాంత్‌లతో కలసి చెడు అలవాట్లుకు అలవాటు పడి, యుక్త వయసు నుండి దొంగతనలు చేయడం మొదలుపెట్టినారు. ఆ క్రమంలో వీరు బస్‌లలో ప్రయాణించు ప్రయాణీకుల వద్ద బ్యాగు దొంగతనములు, జేబు దొంగతనములు, రాత్రివేళ ఇంటి దొంగతనములు, మోటార్ సైకిల్ దొంగతనములు చేస్తూ అలాగే మోసాలకు పాల్పడి, మున్సిపల్ అధికారులము అని చెప్పి, ఒక గ్రూప్ గా ఏర్పడి కాలనీలలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళలను గమనించి వారి ఇంటి వద్దకు వెళ్ళి, మేము మున్సిపల్ అదికారులము అని చెప్పి, ఇంటిలో వాటర్ పైపులు కొలతలు వేయాలి, అని వారిని నమ్మించి మోసం చేసి వారి ఇంటిలోకి వెళ్ళి ఇంటి లోని విలువైన బంగారు, నగదు దొంగిలిస్తారు, దొంగిలించిన సొత్తులతో విలాసవంతమైన జీవితము గడుపుతున్నారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు అయ్యాయి.

వార్త

ఐకమత్యం ద్వారా చిన్నచిన్న రాజ్యాలు అభివృద్ధి చెందుతాయి. కాని విభేదాలు జనిస్తే పెద్దపెద్ద దేశాలే సర్వనాశనమవుతాయి.

న-సాల్స్ట్

# ఎన్ని పని గంటలు అవసరం?

ఒకప్పటి బానిసత్వాన్ని వదిలించుకుని ఇప్పుడే స్వేచ్ఛాయుత వాతావరణంలో కార్మికులు పనిచేసుకుంటున్నారు. ఎన్నో ఉద్యమాలు,పోరాటాల పర్యవసానంగా కనీసం 8గంటల పనికాలాన్ని సాధించుకున్న కార్మికులు పని గంటల పెంపు చర్చతో కొత్త ఉచ్చులోకి పడే పరిస్థితులున్నాయి. చెప్పాలంటే పని గంటలు పెంపు అనేది సాధారణ కార్మికులకు కాదు. అవన్నీ కేవలం సాఫ్ట్వేర్ ఉద్యోగులకు కదా! అని కొట్టిపారేసే వారున్నారు. నిజానికి మేధివర్గాలుగా చెప్పబడే ఐటీఉద్యోగుల సేవలను ఎక్కువగా ఉపయోగించుకోవాలన్న కార్పొరేట్ల ఆలోచనా ధోరణిని ఇక్కడ వ్యతిరేకించే పని లేదు. ఇటీవల కొందరు కార్పొరేట్లు పనిగంటల పెంపు విషయంలో కొత్తకొత్త వాదనలు తెస్తున్నారు. ఆ వ్యాఖ్యలు ఈ విధానాన్ని అవహేళన చేసేలా ఉన్నాయి. ఉద్యోగులను మేధో వర్గాలుగా భావిస్తున్నారా లేక పని యంత్రాలను కుంటున్నారా! అన్న సందేహం తలెత్తుతుంది. కనీసం వారానికోసారి ఇచ్చే వీక్లీ ఆఫ్, సెలవులన్నవి లేకుండా ఇంటిని, ఇల్లాలిని పక్కన పెట్టిపని చేయాలన్న సూత్రీకరణ అంతా గౌరవప్రదంగా లేదు.పనిని దైవంగాను, పని చేసే ప్రదేశాన్ని దేవాలయంగాను భావించే భారతీయులకు ప్రస్తుతం వినిపిస్తున్న ప్రతిపాదనలు ఎందుకోగానీ ఎబ్బెట్టుగా అనిపిస్తున్నాయి. ఇలాంటి ఆలోచనలను ఆదిలోనే తుంచివేయడం అవసరమని కొందరు భావిస్తుండగా, సాఫ్ట్వేర్ ఉద్యోగాలలో జీతాన్ని బట్టి పని గంటలు, పని గంటలను బట్టిజీతాలు ఉంటాయి కనుక అది వారిష్టం అని ఎంత మాత్రమూ కొట్టిపారేయలేం. పని గంటలను 80నుంచి 90కి పెంచే ఆలోచనపదీ తమకులేదని, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే స్పష్టం చేసారు. అయినా ఉద్యోగుల్లో గుబులు ఉండనే ఉంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగబోతున్న తరుణంలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాల్సిన బాధ్యత విపక్షాలపై వుంది. ప్రభుత్వ ఆలోచనలపై ఇంకా స్పష్టత తీసుకురావాల్సి ఉంది.పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా, జీవితంలో ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో , ఎప్పుడు వదిలిపెట్టాల్సి వస్తుందో తెలియని పరిస్థితి వస్తోంది. ఇక ఉద్యోగాలకు భద్రత కల్పించేలా, పనిగంటలను నిర్దేశించేలా కఠిన చర్యలకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. నిజానికి పనిచేసే ప్రదేశంలో మంచి వాతావరణం కల్పిస్తే చాలు. అలా ఉంటే చెప్పకుండానే ఉద్యోగులు వారంతటవారేమంచిగా విధి నిర్వహణ చేసుకుంటారు.అలాంటిపని చేసే పరిస్థితులు కల్పించడం ముఖ్యం. అంతేతప్ప పని గంటల విషయంలో జరిగే చర్చను పొడిగించేలా కొనసాగించడం అంత మంచిదికాదేమో ఆలోచించాలి. బ్యాంకులు, స్థానిక ప్రభుత్వాలు సైతం తమ సిబ్బందికి పని గంటలు తగ్గించడమో,ఆదివారం తప్పనిసరి సెలవు దినంగానూ,రెండో,నాలుగో శనివారాలు సెలవు ప్రకటించడమో చేస్తున్న వేళ తాజా ప్రతిపాదనలను అంగీకరించడం కష్టమే కావచ్చు. ఇక అసలు విషయానికి వస్తే వారానికి 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సరికావనే అభిప్రాయాలు మంచి చర్చకే దారితీశాయి. ఆదివారం పూట కూడా పనిచేయించలేక పోవడాన్ని కూడా ఆయన విమర్శించడం ఐటి ఉద్యోగుల్లో కలకలం రేకెత్తింది. కొన్నాళ్లగా ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా పనిగంటలు,వర్క్ ఫ్రం హోం విషయంలో నిర్దిష్ట అభిప్రాయాలను వెల్లడిస్తూనే ఉన్నారు. వారానికి 70 గంటలు పనిచేయాలని నారాయణమూర్తి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు సుబ్రమణ్యన్ మరో 20 గంటలు అదనంగా కలిపి వారానికి 90 గంటలు పనిచేసి తీరాలనడం లేదా ఆవిధంగా ప్రతిపాదించడం మళ్లీ ఉద్యోగ లోకాన్ని గందరగోళ పరచడమే! అలా చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నది ఆయన ఆలోచన.దానిని కాదనలేం. కానీ ఈ వ్యాఖ్యలపై కార్మిక లోకం సహజంగానే ఆగ్రహిస్తోంది. అవసరమైతే కార్మిక చట్టాలను బలోపేతం చేసేందుకు పూనుకోవాలి. పనిదినాలు, సెలవులు, కార్మిక చట్టాలు ఇవన్నీ పటిష్ఠంగా అమలులో ఉండగా కొత్త కొత్త ఆలోచనలు ఎక్కడికి దారితీస్తాయో చెప్పలేం. వారు ఉద్యోగులు పనియంత్రాలుకాదు కనుక వారిపై ప్రయోగించే ఏ అస్త్రమైనా విఫలయత్నం కాగలదు. అందుకే వారి మీద ఈ రకపు ప్రతిపాదనలు, ప్రస్తావనలు ఐటి ఉద్యోగులే కాకుండా చిన్నాచితక కంపెనీలు,రియల్ ఎస్టేట్ల వంటి సంస్థలలో వెట్టిచాకిరీ చేస్తున్న విషయం లోకవిదితమే.కార్పొరేట్ ప్రపంచంలో కూడా సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. హర్షవర్ధన్ గోయెంకా, ఆనంద్ మహీంద్ర తదితరులు ఆ వ్యాఖ్యలలోని హేతుబద్ధతను తప్పుపట్టారు.కేంద్రం పనిగంటల విషయమై తన వైఖరిని పార్లమెంట్లోనే స్పష్టం చేయడం అవసరం. అప్పుడు కానీ ఇలాంటి పరిస్థితుల్లో ఈఅంశంపై చర్చ ఆగదు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కొన్ని బిజెపి ప్రభుత్వాలు కూడా పని గంటలు పెంచేందుకు చట్టాలు తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకుంటున్నాయి. ఎక్కువ గంటలు పని చేయాలన్న కార్పొరేట్ కంపెనీల ఆలోచనను ప్రభుత్వాలు వత్తాసు పలికితే కార్మిక సంఘర్షణ,తద్వారా సంక్షోభం ఏర్పడే పరిస్థితి కనుచూపు మేరలోనే ఉందని గ్రహించాలి. నిజానికి మనిషి పనిచేయడానికి కొన్ని గంటలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఆ తరవాత విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. కొంత ఉల్లాసం కూడా అవసరం. అలా చేయలేకపోతే మనిషి శరీరం పనిచేయదు. మెదడు ఆలోచించదు. మొద్దుబారి పోతుంది. అప్పుడు మానవునికి పని గంటలు లాగే, విశ్రాంతి సమయాలు కూడా అవసరం అన్న విషయం ద్యోతకమౌతుంది .


# చట్టసభలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి

**ప్రపంచ దేశాలలో మహిళలు జనాభాలో సగభాగం ఉండి శాస్త్ర సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా పోటీపడుతూ ఉన్నప్పటికీ చట్టసభల్లో సభ్యులుగా 20 నుంచి30శాతం పార్లమెంటుకు ఎన్నిక కాని దుస్థితి దాపురించింది. భారతదేశంలో యువతకు అధికారంలో ప్రాతినిధ్యం ఇవ్వాలని అభివృద్ధిలో వారిని సంపూర్ణ భాగంగా చేయాలన్న వాదనలు రోజు రోజుకు బలపడుతున్నాయి.ఎలాంటి రాజకీయ అనుభవం లేని లక్షమంది యువకులు క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని అప్పుడు మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుంది.**




నేదునూరి కనకయ్య

బ్రిటిష్ వారి పాలన అంతమైన తర్వాత స్వపరిపాలన కొరకు దేశ పరిస్థితులకనుకూలంగా జాతీయ నాయకులు అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యానికి బదులుగా పార్లమెంటరీ ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థను ఎంపిక చేసుకొని ప్రజాపాలనకు శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమగ్రమైన చర్చలు జరగాలని ప్రశ్నలు సరైన జవాబులతో కార్య నిర్వాహక వర్గాన్నిప్రభుత్వ యంత్రాంగాన్ని చట్టసభలకు జవాబుదారీ తనం చెయ్యాలనే ఉద్దేశంతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిని ప్రవేశ పెట్టడం జరిగింది. రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరాలంటే పార్లమెంట్ రాష్ట్రాల చట్టసభలు(అసెంబ్లీలు) ఎక్కువ కాలం సమావేశం కావాలి. ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో చూయించే శ్రద్ధచట్టసభల సమావేశాలు నిర్వహించడంలో చిత్తశుద్ధి కొరవడింది. దేశంలోచట్టసభల సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. దేశంలో నెలకొన్న సమకాలీన రాజకీయ ఆర్థిక పరిస్థితులు రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్నాయి. అధికార పక్షం ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా సమస్యలను పక్కదారి పట్టించే డైవర్షన్ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నాయి.ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. చట్ట సభలు తరచుగా సమావేశాలు కావాలన్న నిబంధనలు పాటించకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నాయనితాజాగా అఖిల భారత స్పీకర్ల సదస్సులో లోక్‌సభాపతి ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభలు సమావేశమయ్యేరోజులు తగ్గిపోతున్నాయి. చట్టసభల్లో సభామర్యాదలు తగ్గాయి. వ్యక్తిగత విమర్శల్లో అధికార పక్షం ప్రతిపక్ష సభ్యుల మధ్య పోటీ నెలకొంది. నిర్మాణాత్మక చర్చలు జరగడం లేదు.నిర్మాణాత్మక విమర్శల స్థానంలో పరస్పర ఆరోపణలు వ్యంగ్యాస్త్రాలు రాజకీయ ప్రసంగాలు చోటు చేసుకుంటున్నాయి. సభా సాంప్రదాయాలు ప్రజాస్వామిక విలువలు తగ్గిపోతున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య స్వాగతించదగిన చర్చలు ఆచరణకు నోచుకోవడం లేదు. జాతీయ ప్రయోజనాల కొరకు అధికార పక్షం ప్రవేశపెట్టిన బిల్లులపై సమగ్రమైన చర్చ జరుగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి. రాజ్యాధికారంలో అందరికి సమాన అవకాశాలు కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థ పురుడు పోసుకుంది. దేశ ప్రజల సంక్షేమానికి ఉజ్వల భవిష్యత్తు కోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. మన దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి,అభివృద్ధికి పెద్దపీట వేయడం గమనార్హం. మానవ వనరుల సంక్షేమానికి దోహదపడే చట్టాలను రూపొందించడంలో చట్టసభల్లో ప్రజాస్వామ్య పార్లమెంటరీ విధానాలను అనుసరిస్తున్నాం. వనరుల సేకరణ వనరుల వినియోగం, పెట్టుబడుల సమీకరణ, విదేశీ వాణిజ్యం, ఉత్పత్తి విధానాలు వ్యవసాయ పారిశ్రామిక సేవారంగాల్లో శీఘ్రతర అభివృద్ధికి ప్రణాళికలను అమలు చేస్తున్నాం. పార్లమెంటరీ పాలన వ్యవస్థలో ప్రజలందరికీ సమాన అవకాశాల కల్పన లింగ సమానత్వం ప్రాంతీయ సమానత్వం మైనార్టీ రక్షణ మానవ హక్కుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. యువజన మహిళా సాధికారిత పాలనలో యువతకు భాగస్వామ్యం కల్పించడం జరిగింది. దివ్యాంగుల సంక్షేమం, పాలనలో జవాబుదారీతనం, సుపరిపాలన పాలనలో పారదర్శకత జవాబుదారీతనానికి పెద్దపీట వేయడం జరిగింది.సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటరీ విధానం ద్వారా ఎంపికైన ప్రభుత్వాలు పార్లమెంటరీ విలువలకు తిలోదకాలివ్వడం.ఎన్నికైన ప్రభుత్వాలు అహంకారం, నియంతృత్వం,అవినీతి, అరాచక ఏకపక్ష పాలనా విధానాలకు పెద్దపీట వేయడం ద్వారా ప్రజాస్వామ్యం ఆశించిన స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వం ఎండమావిగానే మారిపోయింది. ప్రజలు ఎదుర్కొనే మౌలిక సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కొరకు



వ్యక్తిగత రాగద్వేషాలకు తిట్లకు చట్టసభలు వేదికలు కావడం శోచనీయం. చట్ట సభలు అప్రజాస్వామిక పద ప్రయోగ శాలలుగా మారిపోయినాయి.ప్రజా ప్రయోజనాలు కాకుండా జనస్వామ్యం స్థానంలో ప్రమాదకర నేత స్వామ్యంగామారే పరిస్థితులు దాపురించే అవకాశం వుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు తరుచుగా భేటీ కావాలి. రాజ్యాంగ విలువలే గీటురాళ్లుగా ప్రభుత్వాల పనితీరును నిష్పాక్షికంగా సమీక్షించాలి. పాలకుల తప్పులను తూర్పారపడుతూ పౌరసేవల్లో నాణ్యత పెంచడానికి మెరుగైన సూచనలు అందించాలి. అందుకు విరుద్ధంగా సమావేశాలు మొక్కుబడి తంతులవుతున్నాయి. సమకాలీన భారతంలో ఈ ఆదర్శాలు చెల్లని కాసులైనాయి. అఖిలభారత స్పీకర్ల సదస్సులో లోక్‌సభాపతి ఆవేదనవ్యక్తం చేస్తూ చట్టసభల సమావేశాలు తగ్గిపోతున్నాయి.సభా కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కల్పించే పెడపోకడలు పెరిగిపోతున్నాయి. వీటన్నింటి మూలంగా మన చట్టసభల గౌరవ మర్యాదలు మంట కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీకి నాయకులకు కార్యకర్తలకు లబ్ధి చేకూరే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సామాన్యుల సాధికారిత నినాదంగానే మిగిలిపోయింది. పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే ఒంటెద్దు పోకడలు ఆధిపత్యం అహంభావ ధోరణులు ప్రభుత్వాల్లో నెలకొన్నాయి. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ సూచించినట్లు ప్రజలకు కనీస అవసరాలైన విద్య, వైద్యం మౌలిక వసతుల కల్పన పట్ల చట్టసభల్లో ఆశించిన మేరకు పనిచేయని స్థితిలో వున్నాయి. ఆర్థికశక్తి కేంద్రీకరణ జరిగి ఆర్థిక అసమానతలు ఏర్పడ్డాయి. కార్పొరేట్ ప్రైవేటీకరణకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను కొనసాగించడం వల్ల దేశంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే కేంద్రీకృతమై మిగతా ప్రాంతాలు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి పోయి దారిద్రం తాండవిస్తోంది. అనేక ప్రాంతాలు వ్యవసాయ పారిశ్రామిక సేవా రంగాల్లో వెనుకబడిపోయినాయి. ప్రజలు తీవ్ర ఆర్థిక అసమానతలతో అల్ప జీవన ప్రమాణాలతో కూడు,గూడు గుడ్డ లేని గడ్డు పరిస్థితిలో పేదరికంలోకి వెళ్లే విచిత్ర పరిస్థితులు నెలకొనడం విచారకరం. పార్లమెంట్లో జాతీయ సమస్యల మీద ప్రతిపక్షం అధికారపక్షం సమగ్రంగా చర్చించకపోవడం వల్ల రూపొందించే చట్టాలు అమలులో అనేక సవాళ్లు ఎదురౌతున్నాయి. ఆధునిక సాంకేతిక యుగంలో సంభవించిన మార్పులు పేదలకు అండగా నిలువడంలేదు. ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంలో ఆశించిన మేరకు పనిచేయడం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం అధికారంలో ఉన్నపార్టీలను చీల్చడం రాజకీయ చదరంగంలో ప్రజలను పావులుగా వాడుకునే సంస్కృతికి అలవాటుపడిన రాజకీయ పార్టీలకు ఇటీవల దేశంలో జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పిప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటడం స్వాగతించదగిన పరిణామం. అధికార పార్టీ స్వార్థపర రాజకీయాలు మానుకోవాలి. ప్రజల హక్కులకు రక్షణ,భద్రత కరువైంది. ఉపాధి కల్పన ఊసే లేదు. మహిళా సాధికారిత, యువజన సాధికారిక గ్రామీణ అభివృద్ధి చేతివృత్తుల రక్షణ స్వదేశీ పరిశ్రమల స్థాపన, ఖాదీ గ్రామీణ పరిశ్రమల నిర్లక్ష్యం కొనసాగుతూనే వుంది.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుచేయడానికి పాలన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు మాటలకే పరిమితమైనాయి. మెజారిటీ ప్రజలకు రాజ్యాధికారంలో వాటా లభిస్తే ప్రజాస్వామ్యం పరిపుష్టమౌతుంది. జనాభాలో సగభాగం ఉన్న మహిళలు బీసీలు రాజ్యాధికారానికి దూరంగా నెట్టి వేయబడి రెండవ తరగతి పౌరులుగా పరిగణించబడుతున్నారు.పార్లమెంటరీ ఎన్నికల్లో ఎంపీలుగా చట్టసభల్లో మహిళలు 15 శాతం మించి ఎన్నిక కాని దుస్థితి కనబడుతుంది. చట్టసభల్లో బలహీన వర్గాలకు మహిళలకు సముచిత ప్రాతినిధ్యం లేదు. బలహీన వర్గాల మహిళలసమస్యలపై గొంతుకలు పార్లమెంటులోలేకపోవడం విచారకరం. ప్రపంచజనాభాలో 40ఏళ్ల వయసున్నయువత 40శాతంలోపు యువత ఉన్నప్పటికీ పార్లమెంటరీ వ్యవస్థలో చట్టసభల్లో యువత ప్రాతినిధ్యం 15శాతం మాత్రమే వుంది. ప్రపంచ దేశాల్లోని 33శాతం పార్లమెంట్లో 30లోపు వయసు వున్న యువతకు ప్రాతినిధ్యం లేదు. ప్రపంచ దేశాలలో మహిళలు జనాభాలో సగభాగంఉండి శాస్త్ర సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా పోటీపడుతూ ఉన్నప్పటికీ చట్టసభల్లో సభ్యులుగా 20 నుంచి30శాతం పార్లమెంటుకు ఎన్నిక కాని దుస్థితి దాపురించింది. భారతదేశంలో యువతకు అధికారంలో ప్రాతినిధ్యం ఇవ్వాలని అభివృద్ధిలో వారిని సంపూర్ణ భాగంగా చేయాలన్న వాదనలు రోజు రోజుకు బలపడుతున్నాయి.ఎలాంటి రాజకీయ అనుభవం లేని లక్షమంది యువకులు క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని అప్పుడుమాత్రమే వికసిత్ భారత్‌లక్ష్యం నెరవేరుతుంది అన్నదేశప్రధాని పిలుపు యువతకు మేలుకొలుపు కావాలి. •

నీ బాధకు ఏదైనా కారణం కావచ్చు! కాని ఆ కారణంతో ఇతరులకు మాత్రం హాని చేయకు.



బుద్ధుడు

చీకట్లోనే నక్షత్రాలు కనబడతాయి. అలాగే కష్టాల్లోనే సత్యాలు గోచరమవుతాయి.



శంకరాచార్యులు

# ప్రజారోగ్య సమస్యలను అధిగమించలేమా?

డా :చిట్యాల రవీందర్

ప్రజారోగ్యం అనేది సమాజంలోని వ్యక్తుల శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును పరిరక్షించడం మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్న ఒక బహుముఖ రంగం. ఇది వ్యాధులను నివారించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ఆరోగ్య సంరక్షణ సేవలకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించడం వంటి అనేక అంశాలను కలిగి ఉంటుంది. ప్రజా ఆరోగ్యం అనేక కారణాల వల్ల చాలా ముఖ్యమైనది. టీకాలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా, ప్రజా ఆరోగ్యం అనేక వ్యాధుల వ్యాప్తిని తీవ్రతను తగ్గించగలదు. వ్యాధులను నివారించడం,ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా, ప్రజాఆరోగ్యం ప్రజల జీవిత కాలాన్ని పెంచడానికి సహాయపడుతుంది. వ్యాధులను నివారించడం ద్వారా, ప్రజా ఆరోగ్యం ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించగలదు. ఆరోగ్య సంరక్షణ సేవలకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించడం ద్వారా, ప్రజారోగ్యం సమాజంలో సమానత్వాన్ని ప్రోత్సహించగలదు. ప్రజారోగ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. కోవిడ్19 వంటి అంటు వ్యాధులు ప్రజా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తాయి. క్యాన్సర్, గుండె జబ్బులు డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా మరణానికి ప్రధాన కారణాలలో ఒకటి. పర్యావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. పేదరికం అసమానత ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ప్రజా ఆరోగ్యసవాళ్లను పరిష్కరించడానికి అనేక పరిష్కారాలు ఉన్నాయి. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణ సేవలకు సమానమైన ప్రాప్యతను కలిగి ఉండాలి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం ప్రజల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ప్రజారోగ్యం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ప్రభుత్వం, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ప్రజలు కలిసి పనిచేయడం ద్వారానే మనం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం. కొవిడ్ 19, వంటి వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు ప్రణాళికలు సంసిద్ధతను కలిగి ఉండటం చాలా ముఖ్యం.వ్యాధుల వ్యాప్తిని ముందుగా గుర్తించడానికి వేగంగా స్పందించడానికి బలమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం చాలా అవసరం. దీనిలో వ్యాధి కేసులను గుర్తించడం,నివేదించడం విశ్లేషించడం వంటివి ఉంటాయి. వ్యాధులను నిర్ధారించడానికి వాటి వ్యాప్తిని ట్రాక్ చేయడానికి తగినంత పరీక్షా సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడానికి ఆసుపత్రులు ఇతర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో తగినంత సామర్థ్యం ఉండాలి. వ్యాధులను నివారించడానికి టీకాలు ఇతర నివారణ చర్యలను అభివృద్ధి చేయాలి. ప్రజలకు వ్యాధుల గురించివాటిని ఎలా నివారించాలనే దాని గురించి అవగాహన కల్పించాలి. ప్రజలకు ఆరోగ్య సంరక్షణ నిపుణులకు సమాచారం అందించడానికి సమర్థవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వివిధ ప్రభుత్వశాఖలు సంస్థలు కలిసి పనిచేయడానికి సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. •

# ప్రజావాక్కు



## పారదర్శక పాలన అవసరం

కేసుల గురించి మాట్లాడేటప్పుడు రాజకీయ నాయకులు తప్పించుకునే పదం ఏమంటే చట్టం తనపని తాను చేసుకుంటూపోతుందని. నిజంగా అలా జరుగుతోందా అని ప్రశ్నిస్తే ద్వందసమాధానాలు వస్తున్నాయి. ఉదాహరణకు ఏనేరం నిరూపించకుండావట్టినే చంద్రబాబు నాయుడు గారిని 53రోజులు కారాగారం పాలు చేసారు. అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద అనేక అవినీతి కేసులున్నా, పదిసంవత్సరాల పైగా బెయిల్ మీద ఉన్నా,వేలమీద కోర్టులలో వాయిదాలుపడుతున్నా కేసుల పరిష్కారానికితీవ్రజాప్యం జరుగుతుండడాన్ని ఏమనాలి? చట్టం దాని పని అది చేసుకుపో తోందనాలా? కోట్లకొలది కేసులు దేశంలోని అన్నికోర్టులలోనూ దశాబ్దాల తరబడి పరిష్కారంకాకుండా పేరుకుపోయిన్నాయంటే ఏమనాలి?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పత్రికల్లో వస్తేనే విచారణలా?

ఇటీవలకాలంలో పలువురు వైకాపా పెద్దలు అధికారంలో ఉండగా అటవీ భూములను, అసైన్డ్ భూములను అక్రమంగా కైంకర్యం చేసిన ఉదంతాలు పూర్తి ఆధారాలతో పత్రికల్లో వస్తున్నాయి.ఆపైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విచారణకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇదే సందర్భంలో కొంత మంది మంత్రులు అసలు పత్రికల్లో వస్తున్నది గోరంతే, వైకాపా పెద్దలు వందల ఎకరాలు దోచుకున్నారు అనిప్రకటించారు.ఎవరినీ వదలం, తిన్నది కక్కిస్తాంఅన్నారు.అటవీ భూములను కైంకర్యంచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి! ఆ మేరకు నివేదికలు ఇచ్చినా నమోదు చేయడం లేదు! చట్టబద్ధ పాలనలో చట్టాలు పని చేయని దుస్థితి నెలకొంది.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## మద్దతు ధర కల్పించాలి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రైతులు పండించిన కందులు, వేరుశనగ మార్కెట్ యార్డ్‌లకు తీసుకు రావడం జరిగింది.రైతులుమార్కెట్‌యార్డులలో మద్దతుధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురు చూస్తున్నారు. కానీ సరైన ధర లేదని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## ప్రమాదాలకు కళ్లెం వేయాలి

అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం ఇలా ఎన్నో ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. సీసీటీవీ కెమెరాలు, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి ప్రమాదాలకు సంబంధించిన ఎన్నో వీడియోలు సోషల్ మీడియాలో వేదికగా వైరల్ అవుతున్నాయి.అయినా ప్రజలలో మార్పు రావడం లేదు. ఈ మధ్య కాలంలో యువత బైక్‌లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ప్రమాదాలకు కేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్ర రవాణా శాఖవారు ఎన్ని పెట్టినా వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయు వేగంతో తమ మోటార్ బైక్‌లను నడుపుతూ పలు ప్రమాదాలకుకారణమవుతున్నారు. ఇటు రోడ్డుమీద నడిచే పాదచారులను,వాహనాలపైప్రయాణించే ఇతర వాహనదారుల ప్రాణాలనుకూడా ప్రమాదంలోకి నెట్టివేస్తుండటం శోచనీయం.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## భారత విద్యార్థులకు భరోసా ఇవ్వాలి

అమెరికా నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్ నిర్ణయాలతో భారతవిద్యార్థులు ఉలిక్కి పడుతున్నారు. అక్కడ పార్ట్ టైమ్ జాబ్స్ చేస్తే వేటు వేస్తున్న నిబంధనతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వున్నారు. మన దేశం నుండి ప్రతీ ఏటా లక్షల విద్యార్థులు అమెరికావెళ్లి ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగాలు చేసి జీవిస్తారు. భారత్ ప్రధానిమోడీ అమెరికా అధ్యక్షుడుతో సన్నిహిత సంబంధాలు ఉన్నందున భారత్ విద్యార్థులకు ఉద్యోగాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసి మన విద్యార్థులకు పూర్తి భరోసా ఇవ్వాలని అందరి కోరిక.

-కామిడి సతీశ్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## సర్వే ఫలితాలు నిరాశాజనకం


ఇటీవల రాష్ట్రంలో వివిధ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షచేసే సర్వేజరిగింది. ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. విద్యార్థులు ఏకాగ్రత, ఉత్సాహంగా పాఠాన్ని, ఇంటి చదువునీ పట్టించక వృధా నష్టంకలిగించే వాటిలో నిమగ్నమవుతున్నారు. ఈ స్థితిలో అవగాహన సేవా భావంతో పిల్లలను ప్రశాంత వాతావరణంలో వారి టెక్స్టుక్‌లను చదివిస్తున్నారు.ఆ సమయం వారు పర్యవేక్షిస్తున్నారు. ఇది మహత్తరమైన పరిష్కారం. కొందరు సేకరించిన సామాన్య పుస్తకాలను వారికి ఇచ్చి ఇంటి వద్ద చదివి వాటి సారాంశాన్ని అడుగుచున్నారు.

-బొల్లోజు మేఘనాధం విశాఖపట్నం

# పిల్లలపై వార్షిక పరీక్షల ప్రభావం

బి. మధుపాళి

మార్చి, ఫిబ్రవరి మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీ విద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమతమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారుఅవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్న యువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకులకన్న కొంతైనా మెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపై ప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతం కన్న తక్కువస్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడి పెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది.పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణ సంబంధ సమస్యలు, గుండె వేగం పెరగడం, శ్వాస మందగించడం, తల నొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయ దాడి (పానిక్‌అటాక్) లాంటి అవలక్షణాలు కనుపిస్తాయి. భావోద్వేగ ఆందోళన వల్ల అభద్రతా భావం, తన శక్తి నమ్మకం తగ్గడం, నిస్సహాయ స్థితి, ఏదో తెలియని లోపం వెంటాడడం, ప్రతికూల స్వయం భావనలు, అనవ సర ఆలోచనలు వెంటాడడం, నిరాశ నిస్పృహలు మేలుకొన డం లాంటి మానసిక ప్రతికూల లక్షణాలు బయట పడతా యి. వీటికి తోడుగా ఏకాగ్రతకు భంగం కలగడం, చంచల త్వం, వాయిదా వేసే ప్రవృత్తి పెరగడం, ఇతర సహచరు లతో అనవసరంగా పోల్చుకోవడం, నిద్ర లేమి సమస్యలు ఉత్పన్నం కావడం సాధారణంగా కనిపిస్తుంది. రాబోయే



పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాల పట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి.సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతాక్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తు ఉన్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కుల కన్న ఎక్కువ రావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటి కన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిచినట్లే అని నమ్మాలి. మన మీద మనకు నమ్మకం ఉండాలి. మనం చదివే చదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తి పలకాలి. నా శక్తివంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధింగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగుపరుచుకోగలను లాంటి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్య మధ్య పాలు లేదా టీ లాంటివని తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. మధ్య మధ్య ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలి. చదువుతున్న పాఠంలోనిముఖ్య అంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు,లెక్కలు, డయాగ్రామ్స్, సూత్రాలు,సమీకరణాలు లాంటి అంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడం మంచిది. ఒకసారి రాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. కఠినమైన అందాలంటూ పక్కన పెట్టడం మంచిది కాదు. ప్రతి రోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. అవసరమని భావించినపుడు మీకు ఇష్టమైన టీచర్ లేదా సలహాదారుతో మాట్లాడండి. చక్కెరలు అధికంగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండండి. పరీక్ష రోజున కనీసం 15 -30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. ప్రోటీన్లు అధికంగా ఉన్ననట్స్, గింజలు, చేపలు లాంటి ఆహారం పరిమితంగా తీసుకొండి. అవసరమనించినప్పుడు కొద్దిపాటి నీరుతాగండి. పరీక్షకు ముందురోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగం కలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి.ఒక్క నిమిషం ఆసలస్యం అయినా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. పరీక్షహాల్‌లో ఒత్తిడి పెరిగినట్లు అనిపిస్తే ఒకటి రెండునిమిషాలు కళ్లు మూసుకొని,నిశ్శబ్దం పాటించి, దీర్ఘశ్వాసలు తీసుకొని వదలడం చేసిన తర్వాతమళ్లీ రాయడం మొదలుపెట్టండి.పరీక్షలో సమాధానాలు రాస్తున్నపుడు సమయపాలన పాటించండి. చివరి నిమిషాల్లో ఆందోళనలు పెరిగే పనులు చేయవద్దు. మార్కులను బట్టిఏప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో నిర్ణయించుకొండి. కనీసం 10-15 నిమిషాల ముందు రాయడం పూర్తి చేసి, ఏం రాసామో, ఎలా రాసామో పేపర్‌ను తిరగేసి పరిశీలించండి. పరీక్షలే జీవితం కాదని, జీవితంలో పరీక్షలు ఒక చిన్న భాగమని పిల్లలకు ధైర్యం నూరి పోయాలి. •

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సంకెళ్లు వేసి భారత్‌కు తేవడమా?

## మోడీ, ట్రంప్ మంచి మిత్రులైనా ఇలా ఎందుకు జరిగింది?

### నిరసన ప్రదర్శనలో ధ్వజమెత్తిన ఎంపి ప్రియాంక గాంధీ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** అమెరికాలో సరైన పత్రాలులేకుండా నివసిస్తున్నారన్న కారణంతో వందమందిని నిర్బంధంగా భారత్‌కు పంపించి వేసిన సంఘటనకు సంబంధించి కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, ప్రధానిమోడీకి మధ్య ఉన్న సంబంధాలవల్లనే ఇలా జరిగిందని లేనిపక్షంలో ఇలా ఎందుకు జరిగిందోప్రధానిమోడీ వివరణ ఇవ్వాలని ఆమె డిమాండ్‌చేసారు. పిఎం మోడీ, అధ్యక్షుడు ట్రంప్ మంచి స్నేహితులని అనేక సంఘటనలు రుజువుచేసాయని, అలాంటప్పుడు ఈసంఘటన ఎలా జరిగిందని నిర్బంధంగా వారిని భారత్‌కు తీసుకురావడంపైనా ఆమె తీవ్రస్థాయిలో విమర్శలుచేసారు. అవసరమయితే భారత్ తమ వారిని తీసుకురావడానికి సొంత విమానాన్ని పంపించాలే కానీ అమెరికన్ల విమానంలో నిర్బంధించి తీసుకురావడం ఏమిటని ఆమె నిలదీసారు. మనం మన సొంత విమానం వారి కోసం పంపించలేమా అమెరికా సిబ్బంది మన భారతీయులను మనుషులుగా చూసారా బేడీలు వేసి కాళ్లను కట్టివేసి భారత్‌కు తెచ్చారని విదేశాంగమంత్రి, ప్రధానిమోడీలు తక్షణమే వివరణ ఇవ్వాలని ప్రియాంక డిమాండ్‌చేసారు. ఇందుకు సంబంధించి పార్లమెంటులో చర్చించాలంటూ విపక్ష ఎంపిలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన కూడా నిర్వహించారు. అమృత్‌సర్ కాంగ్రెస్ ఎంపి గురుజీత్‌సింగ్ ఔజ్లా కూడా ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆయన చేతులకు బేడీలు వేసుకుని మరీ ఈ నిరసనలో పాల్గొన్నారు.

మన భారతీయులను తీసుకువచ్చిన విధానం మంచి సాంప్రదాయం కాదని అన్నారు. వారిని ఎంతో హింసించారని అన్నారు. వారి చేతులు కాళ్లకు గొలుసులు వేసారని వారిని దేశానికి అప్పగిస్తున్నట్లు మన ప్రభుత్వానికి తెలిసినా కూడా సకాలంలో ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ఇలా పంపిస్తారని తెలిసినపుడు మన భారత విమానాన్ని ఎందుకు పంపించలేదని మనమే వారిని తెచ్చుకునేవారం కదా అని ఆయన నిలదీసారు. కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, సమాజ్‌వాది పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్ మరికొందరు నాయకులు కూడా ఈ నిరసనలో చేతులకు బేడీలు వేసుకుని మరీ పాల్గొన్నారు. పార్లమెంటుప్రధాన ద్వారం వద్దనే ఈ ప్రదర్శననిర్వహించి భారత పౌరులను అమెరికా ఏవిధంగా వేధింపులకు గురిచేసిందోచూడాలంటూ నినాదాలుచేసారు. వారంతా మానవులని ఖైదీలు కాదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఇందుకు సంబంధించి వాయిదా తీర్మా నాన్ని కూడా ప్రవేశపెట్టింది. వెంటనే ఈ సంఘటనపైచర్చలుజరగాలని డిమాండ్‌చేసింది. విపక్ష సభ్యుల నిరసనలతో లోక్‌సభను మధ్యాహ్నం రెండు గంటలవరకూ వాయిదా వేసారు. మళ్లీప్రారంభం అయినా అదే నిరసన కొనసాగడంతో మరుసటి రోజుకు వాయిదా వేసారు.



## గాజా వ్యవహారంలో ట్రంప్‌కు

# నెతన్యాహు మద్దతు

**టెల్‌అవీవ్, ఫిబ్రవరి 6:**పాలస్తీనీయుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై అంతర్జాతీయంగా విమర్శలు తలెత్తాయి. దీనిపై తాజాగా స్పందించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. ట్రంప్‌నకు మద్దతు పలికారు. ఆయన చేసిన ప్రతిపాదనలో తప్పేమీ లేదన్నారు.

ఇజ్రాయెల్ భీకర దాడుల కారణంగా గాజా శిథిలాల కుప్పగా మారింది. అయినవారిని కోల్పోయి ఎంతోమంది పౌరులు నిరాశ్రయులుగా మారారు. అయితే... ఈ అంశంపై ఇటీవల ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తాము గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. పాలస్తీనీయులను తరలించి ఆ ప్రాంతాన్ని తామ హస్తగతం చేసుకోవాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. ధ్వంసమైన భవనాలను పునరుద్ధరించి.. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తామన్నారు. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు, ఇళ్లు నిర్మించవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. గాజాను స్వాధీపం చేసుకోవాలనే ప్రతిపాదనపై అంతర్జాతీయ విమర్శలు గుప్పుమన్నాయి.

దీనిపై నెతన్యాహు మాట్లాడుతు.. 'ట్రంప్ ఆలోచనలో తప్పేమీలేదు. ఒకవేళ గాజా వాసులు ఆ ప్రాంతాన్ని విడిచివెళ్లిపోవాలని నిర్ణయించుకుంటే అలాగే చేయవచ్చు. లేదా అక్కడే ఉండాలని అనుకుంటే ఉండొచ్చు. ఏదేమైనా గాజాను పునర్మించాలి' అని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

'హమాస్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా దళాలను గాజాకు పంపడం, ఆ ప్రాంత పునరుద్ధరణకు క సహాయం చేస్తానని చెప్పడాన్ని నేను నమ్మలేకపోయా' అని నెతన్యాహు అన్నారు. ఇదిలా ఉండగా.. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి.



## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ఎనిమిది మందిమృతి, ఆరుగురికి తీవ్రగాయాలు

**జైపూర్, ఫిబ్రవరి 7:** రాష్ట్రంలోని దుదురీజియన్‌లో జైపూర్ అజ్మేర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. ఒక బస్సు అదుపు తప్పి కారును ఢీకొట్టడంతో భారీ సంఖ్యలోప్రాణనష్టం వాటిల్లింది. రాజస్థాన్‌లోని దుడు రీజియన్‌లో జైపూర్ అజ్మేర్ హైవేపై మౌఖంపూరాకు అతిసమీపంలోనే ఈప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదికాస్తా అదుపు తప్పిందని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో బస్సును డ్రైవర్ కంట్రోల్ చేయలేకపోయారని అందువల్లనే ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టినట్లు చెప్పారు. కారులో ఉన్న పలువురుప్రాణాలు కోల్పోగా కొందరు తీవ్రగాయాలపాలయ్యారు. గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తుచేపట్టారు.

## బిల్లులపై నిర్ణయానికి యేళ్లతరబడి మౌనమా?

### తమిళనాడు గవర్నర్ వైఖరికి సుప్రీం తీవ్ర అసంతృప్తి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** తమిళనాడు రాష్ట్రప్రభుత్వం ఆమోదించి పంపించిన బిల్లులపై తన నిర్ణయాన్ని ప్రకటించకుండా ఏళ్లతరబడి మౌనం వహిస్తారా అంటూ తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవికి సుప్రీంకోర్టు తీవ్ర స్వరంతోప్రశ్నలువేసింది. గవర్నర్ అనుసరిస్తున్న వైఖరి రాజ్యాంగంలోని 200వ అధికరణానికి విరుద్ధంగా ఉన్నాయని తమిళనాడుప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. యూనివర్సిటీలకు ఉపకులపతుల నియామకాల్లో యుజిసి ఛైర్మన్‌ను కూడా చేర్చాలని గవర్నర్‌కోరడం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని హరించడమేనని వాదించింది. ఈ బిల్లుతోపాటే మరికొన్ని కీలక బిల్లులపై తన ఆమోదం తెలపకుండామౌనం వహించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇలాంటి చర్యలు ప్రజలకు నష్టం కలిగించడమే కాకుండా రాజకీయ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందన్నారు. గవర్నర్ ఎంతకాలమైనా బిల్లులపై తన వైఖరి చెప్పకుండా అలా మౌనంగా ఉండవచ్చా అని సుప్రీం బెంచ్‌ప్రశ్నించింది. అంతకుముందు విచారణలో సుప్రీంకోర్టు గవర్నర్ రవికి స్పష్టమైన ఆదేశాలిస్తూ తమిళనాడు ప్రభుత్వంతో చర్చలుజరిపి 24 గంటల్లోనే నిర్ణయానికి రావాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం కూడా తన నిర్ణయానికి ఉన్న ఆధారాలు తెలియజేయాలని గవర్నర్‌ను కోరింది. తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఆర్‌ఎన్‌రవిలమధ్య సుదీర్ఘకాలంగా వివాదాలు నడుస్తున్న సంగతి తెలిసిందే. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించి పంపించిన అనేక బిల్లులను గవర్నర్ తన వద్దనే ఉంచుకున్నారు. రెండోసారి ఆమోదించి పంపించిన బిల్లులను నేరుగా రాష్ట్రపతికి పంపించారు. అవికూడా ఇప్పటికీ క్లియర్‌కాలేదని డిఎంకె ప్రభుత్వం విమర్శిస్తోంది. గవర్నర్ రాజ్యాంగ పరంగా తనకు ఉన్న అధికారాలనుకూడా అతిక్రమిస్తున్నారంటూ డిఎంకెప్రభుత్వం ఆరోపణలు గుప్పించింది. దీనివల్లనే రాష్ట్రప్రభుత్వం, గవర్నర్ మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయని వాదించింది. గవర్నర్ చర్యలు ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు ముప్పుతెచ్చేవిగా ఉన్నాయని ఆరోపిస్తుంటే తాను మాత్రం చట్టాలకు లోబడి వ్యవహరిస్తున్నట్లు చెపుతున్నారు.

# అమెరికాలో వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారు

## సభలో ప్రకటించిన కేంద్ర మంత్రి!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. తాజాగా అమెరికా 104 మంది భారతీయులను స్వదేశానికి పంపించడంపై ఈ మేరకు కేంద్ర మంత్రి రాజ్యసభలో ప్రకటన చేశారు. వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ డీపోర్టేషన్ సమయంలో వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా 2019లో 2 వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత అని జైశంకర్ వివరించారు. అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే ప్రక్రియను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. వలసదారులను ఎయిర్‌క్రాఫ్ట్‌లలో తరలించే విధానాన్ని 2012 నుంచి అమలు చేస్తుండగా నిబంధనల ప్రకారం వారిని నిర్బంధిస్తారు. టాయిలెట్‌కు వెళ్లే సమయంలో అవసరమైతే వాటిని తొలగిస్తారు. ఎయిర్‌క్రాఫ్ట్, చార్టర్డ్ విమానాలకు ఇది వర్తిస్తుంది.

ఇందులో ఎటువంటి మార్పు లేదు. అయితే మహిళలు, చిన్నారులను నిర్బంధిం చలేదని ఐసిఇ అధికారులు మాకు సమాచారం ఇచ్చారు అని జైశంకర్ పేర్కొన్నారు. భారతీయులను అమెరికా వెనక్కి పంపించిన విధానాన్ని లేవనెత్తిన విపక్షాలు పార్లమెంటులో నిరసనలు చేపట్టాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి.

అమెరికా ప్రభుత్వ యంత్రాంగంతో తీసుకుంటున్న దౌత్యచర్యల గురించి వివరించాలని కోరాయి. దీనిపై లోక్‌సభ స్పీకర్ స్పందిస్తూ ఈ అంశం విదేశాంగ మంత్రిత్వశాఖకు సంబంధించిందన్నారు. కేంద్ర ఉభయసభలకు అంతరాయం కలుగుతోన్న క్రమంలోనే రాజ్యసభలో కేంద్ర మంత్రి దీనిపై ప్రకటన చేశారు.

# విద్యారంగంలో ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిళ్లు

## యుజిసి ముసాయిదా నిబంధనలపై రాహుల్ ధ్వజం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** యూనివర్సిటీలు, కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి యుజిసి విడుదలచేసిన ముసాయిదా నిబంధనలు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని విద్యారంగంలోకి జొప్పించాలన్న కుట్ర కనిపిస్తోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్ గాంధీ ఆరోపిం చారు. యుసిసి రూపొందించిన ముసాయిదా నిబంధనలకు నిరసనగా డిఎంకె నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లా డారు. అన్ని చారిత్రక అంశాలు, సంస్కృతి సాంప్రదాయాలను తొలగించి కేవలం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని మాత్రమే ఉంచేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ యోచన అంతా ఒకే చరిత్ర ఒకే సాంప్రదాయం, ఒకేభాష ఒకే సంస్కృతి ఉండాలన్న తపన కొనసాగుతోందని కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ తన అజెండాను రాష్ట్రాల్లో అమలుచేసేందుకే ఈ నిబంధనలు రూపొందించారన్నారు. ప్రతిరాష్ట్రా నికి వేరువేరు సాంప్రదాయాలు, చరిత్ర, భాషా సంస్కృతి వంటివి ఉన్నాయని, రాజ్యాంగంలో కూడా ఈవ్యవస్థను యూనియన్ ఆఫ్ స్టేట్స్ అని పొందుపరిచారని గుర్తుచేసారు. అన్ని భాషలను మనం గౌరవించుకోవాలని, అన్ని సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలని అవి ఎక్కడి నుంచి మనకు వర్తించాయో తెలుసుకోవాల్సిన చారిత్రిక మూలాలను ఇపుడు ఆర్‌ఎస్‌ఎస్ ఒత్తిడితో ఈయుజిసి కాలరాస్తోందని ఆరోపించారు.

తమిళప్రజలకు సొంత చరిత్ర, భాష సాంప్రదాయాలున్నాయని ఆయన అన్నారు. ఈ చర్యలు తమిళప్రజలను కించపరచడం మాత్రమేనని ఇతర రాష్ట్రాల్లోకూడా ఇదే వర్తింపచేయాలని చూస్తున్నారని, ఆర్‌ఎస్‌ఎస్ తన ఆధిపత్యం చాటిచెప్పాలనిచూస్తోందని ఆరోపించారు.

సమాజ్‌వాది చీఫ్ అఖిలేష్ యాదవ్‌మాట్లాడుతూ బిజెపిఆర్‌ఎస్‌ఎస్‌లు తమ భావజాలాన్ని విద్యారంగంలోకిక కూడా చొప్పించే కుట్రలుచేస్తున్నాయని, అంతేకాకుండా రాష్ట్రాల అదికారాలనా కైవసంచేసుకోవాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాజకీయ నాయకులు పారిశ్రామికవేత్తలకు నౌకర్లుగా చేయాలనిచూస్తోందని, కొత్త విద్యావిధానాన్ని ఎప్పటికీ ఆమోదించబోమని ఆయన అన్నారు. తనవరకూ తాను నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి వ్యతిరేకమని బిజెపికి తాను వ్యతిరేకమని అఖిలేష్ అన్నారు.

బోధనబోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి రూపొందించిన మార్గదర్శకాలు అత్యంత ప్రమాదకరమైనవని రాజ్యాంగానికి వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రకటించి, వెంటనే వాటిని నిలిపివేయాలనికూడా డిమాండ్‌చేసింది. ఈ ముసాయిదా నిబంధనలపైనే చర్చించేందుకు విద్యాశాఖమంత్రులతో కర్ణాటక విద్యామంత్రి ఎంసి సుధాకర్ సమావేశం నిర్వహించారని, కర్ణాటక, కేరళ, తెలంగాణ, తమిలనాడు, హిమాచల్‌ప్రదేశ్; జార్ఖండ్ రాష్ట్రాల విద్యామంత్రులు హాజరయ్యారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేస్ వెల్లడించారు. యుజిసి ప్రమాదకర ముసాయిదాకు వ్యతిరేకంగా 15 అంశాలతోకూడిన తీర్మానంచేసారని జైరామ్ రమేష్ అన్నారు.

## దాడిచేసిన నిందితుడిని గుర్తించిన

# సైఫ్ ఇంటి సిబ్బంది!

**ముంబయి,ఫిబ్రవరి 6:** బాలివుడ్‌నటుడు సైఫ్ ఆలీఖాన్‌పై దాడికేసులో బంగ్లాదేశీ నిందితుడిని ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది ఇద్దరు గుర్తించారు. షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్‌మహ్మద్ రోహిల్లా అమిన్‌ఫకీర్(30) అలియాస్ విజయ్‌దాస్‌ను పోలీసులు అరెస్టుచేసారు. ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నాడు. ముంబయి పోలీసులు నిందితుడితో సైఫ్ ఇంటి మనుషులవద్ద గుర్తింపుపెరేడ్‌నిర్వహించారు. సైఫ్ ఇంట్లో పనిచేస్తున్న ఎలియమ్మ ఫిలిప్(56) ఏళ్ల మహిళ షరీఫుల్‌ను గుర్తించింది. తహసీల్దారు, మరో ఐదుగురు పంచానామాచేసే సిబ్బంది సమక్షంలోజరిగిందని పోలీసులు తెలిపారు. ఫిలిప్ తొట్టతొలిసారిగా నిందితుడిని ఆరోజు చూసిందని, ఆమెపైనా నిందితుడు దాడికి దిగాడని ఆమె చెప్పింది. గతనెలలోనే ముఖగుర్తింపు టెక్నాలజీ సాయంతో నిందితుడేనని ఖరారుచేసారు. సిసిటివిఫుటేజితో నిందితుడి ముఖం సరిపోల్చారు. సత్‌గురు షారన్ భవనంలో ఉన్న సిసికెమేరాల్లో రికార్డయిన నిందితుడు ఇతడు ఒక్కడేనని తేల్చారు. సైఫ్ కుటుంబం నివసిస్తున్న 12వ అంతస్తులోకి చాకచర్యంగా ప్రవేశించాడని, సిబ్బంది అరుపులు కేకలతో అక్కడికి వచ్చిన సైఫ్‌ను ఆరుసార్లు పొడిచి అక్కడినుంచి పరారయ్యాడని పోలీసులు తెలిపారు. ముంబయిలోని థాణె నగరంలో మూడురోజుల తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## యాంటీ ర్యాగింగ్ చర్యలు తీసుకోనందుకు


# 18 కళాశాలలకు యుజిసి నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ దేశంలోని 18 మెడికల్ కళాశాలలకు సంజాయిషీనోటీసులు జారీచేసింది యాంటి ర్యాంగింగ్ నిబంధనలు అమలుచేయనందుకుగాను యుజిసి ఈ నోటీసులు జారీచేసినట్లు ప్రకటించింది. ఢిల్లీ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిల్లో రెండేసి, ఆంధ్రప్రదేశ్, బీహార్‌లలో మూడుచొప్పున వైద్యకళాశాలలున్నాయి. మధ్య ప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో ఒక్కోకళాశాల ఉందని యుజిసి వెల్లడించింది. 2009లో జారీచేసిన యాంటి రాగింగ్ నిబంధనలకకు అనుగుణంగా చర్యలు తీసుకోలేదని కళాశాలల్లో రాగింగ్ నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని 2009లోనే ఆదేశాలు జారీచేసామనియుజిసి తెలిపింది. విద్యార్థులనుంచి యాంటీర్యాగింగ్ అండర్ టేకింగ్స్ తీసుకోవడంలో ఈసంస్థలు విఫలం అయ్యాయని అందువల్లనే వాటికి నోటీసులు జారీచేసినట్లుయుజిసి కార్యదర్శిమనిష్ జోషి వెల్లడించారు. ఈ నిబంధనలప్రకారం ప్రతి విద్యార్థి, వారి తల్లితండ్రులు, సంరక్షకులు విధిగా యాంటి ర్యాగింగ్ అండర్‌టేకింగ్ ప్రవేశం సమయంలోనే ఇవ్వాల్సి ఉంటుంది. వీటివల్ల కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టగలుగుతామని యుజిసి భావిస్తోంది. కళాశాలలు ఇలా తీసుకోకపోవడంవల్ల జూనియర్లుగా వచ్చే కొత్త విద్యార్థులకు అక్కడ మనుగడ రిస్క్ అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందువల్లనే ఖచ్చితంగా ఈ నిబంధనలు పాటించాలనిసూచించినట్లు యుజిసి వెల్లడించింది. వెంటనే ఈ నిబంధనలు అమలుచేయాలని కూడా కోరుతూ ఇప్పటివరకూ ఎందుకు అమలుచేయలేదో, చర్యలు ఎందుకు తీసుకోరాదో తెలియజేయాలంటూ నోటీసుల్లో పేర్కొంది. జరిమానాలతోపాటు ఇతర కఠిన చర్యలు కూడా తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లోవివరించింది.

## అమెరికా నౌకల ఉచిత ప్రయాణానికి

# రాయితీలు ఇవ్వలేదు

### పనామా అథారిటీ ప్రకటన



**పనామాసిటీ, ఫిబ్రవరి 6:** పనామా కాల్వలో నుంచి అమెరికా ప్రభుత్వ నౌకలు ప్రయాణించే సమయంలో వాటినుంచి ఎటువంటి ఫీజు వసూలు చేయమని పనామాచెప్పినట్లు అమెరికా ప్రకటించింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని పోస్టు చేసింది. కానీ, పనామా మాత్రం అబ్బే అలా రాయితీలేమీ ఇవ్వలేదంటూ తాజాగా ప్రకటన విడుదల చేసింది. తాజాగా పనామా కెనాల్ అథారిటీ స్పందిస్తూ.. 'టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం.. మార్పులు వంటివి మా పరిధిలోకి వస్తాయి. ఇప్పటివరక ఎటువంటి సవరణలు చేయలేదు' అని ప్రకటించింది.

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ వారం లాటిన్ అమెరికా దేశాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కెనాల్‌పై చైనా నియంత్రణల్లో తక్షణమే మార్పులు తీసుకురావాలని ఆయన గట్టిగా ఒత్తిడి చేయనున్నారు. ఆ దేశం చర్యలు తీసుకోకపోతే మాత్రం తాము ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని ఆయన చెబుతున్నారు. ఆయన తాజాగా పనామా అధ్యక్షుడు జాస్ రౌల్‌తో భేటీ అయ్యారు.

దాదాపు 51 మైళ్ల పొడవున్న పనామా కెనాల్ అట్లాంటిక్–పసిఫిక్ సముద్రాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నవంబరులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నాటి నుంచి ట్రంప్ పనామా కాల్వను తిరిగి స్వాధీనం చేసుకొంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందుకోసం సైనిక శక్తిని కూడా వాడే అవకాశం ఉందని ఆయన సంకేతాలు ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ఆ చిన్న దేశంలో ఆందోళన మొదలైంది. వాస్తవానికి ఈకాల్వను అమెరికా నిర్మించి.. ఉదారంగా పనామాకు ఇచ్చేందని ట్రంప్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# సొంత సభ్యులపైనా హమాస్ హింస



**గాజాసిటీ, ఫిబ్రవరి 6:** పౌరులను బందీలు చేసుకుని ఇజ్రాయిల్‌పై సుదీర్ఘకాలంగా హమాస్ పోరాటంచేస్తున్న సంగతి తెలిసిందే. తమ చెరలో ఉన్నవారిపై హమాస్ మిలిటెంట్లు పాల్పడిన దారుణాలపై కథకథలుగా అనేకం వెలుగులోకి వచ్చాయి. చివరకు తన సొంత సభ్యులను కూడా హమాస్ హింసకు గురిచేసి మరణదండన విదించినట్లు తెలుస్తోంది. అదికూడా బందీలపై అకృత్యాలకు పాల్పడ్డారన్న కారణం వల్లనేనని చెపుతున్నారు. ఇజ్రాయెల్ పురుషులపై లైంగిక దాడికి పాల్పడినట్లు గుర్తించిన కొందరు మిలిటెంట్లపై హమాస్ కఠిన చర్యలు తీసుకుంది. ఆగ్రూప్‌నుంచి బయటకు వచ్చిన రహస్య డాక్యుమెంట్లు ఈ అకృత్యాలు బైటపెట్టాయి. హమాస్ 94 మంది ఫైటర్లు ఈనేరాలకు పాల్పడినట్లు తేలింది. వారిపై హోమో సెక్సువాలిటీకి సంబందించిన సంభాషణలు పరాయి మహిళలతోసన్నిహితంగా ఉండటం, చిన్నారులపై అత్యాచారం, చిత్రహింసలకు గురిచేయడం వంటి ఆరోపణలు వచ్చాయి. గాజాలో హోమోసెక్సువాలిటీ అనేది హమాస్ నిబంధనలకు విరుద్ధం. అలాంటి చర్యలకు పాల్పడినవారికి జైలు లేక మరణశిక్ష విధిస్తారు. 2023 అక్టోబరు ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్ మారణహోమం సృష్టించింది. తర్వాత పలువురిని బందీలుగా తెచ్చింది. దాడిసమయంలోను బందీలుగా తీసుకువచ్చిన ఇజ్రాయెల్ పురుషులపై హమాస్ ఫైటర్లు కొందరు ఈనేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్వలింగ సంబంధాలతో ఉన్నాడని హమాస్ కమాండర్ మహ్మద్ ఇష్తివికి 2016లో మరణదండన విదించారు. ఆతడి గుండెల్లో మూడు బుల్లెట్లు దింపి చంపేసారు. దానికిముందు ఆతడికి జైలుశిక్ష విదించి చిత్రహింసలకు గురిచేసారు.

# వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతపురం ఎస్పీ

## - సైబర్ నేరాలపై సోషల్ మీడియాలో ప్రజలకు అవగాహన



ఎస్పీజగదీష్ (ఫైల్ ఫోటో )

**అనంతపురం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త బ్యూరో** సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ తో జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. సృజనాత్మకతతో... సమాజ హితానికి దోహదపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ కోరారు. సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలుపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు భాగస్వామ్యులు కావాలని సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ కు జిల్లా ఎస్పీ గారు పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ తో జిల్లా ఎస్పీ గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరాలు... కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాదాలు... జీవితాలు నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల అనర్థాలపై ప్రజల్లో చైతన్య తేవడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ మూడు అంశాలపై పోలీసు పరంగా అలుపెరగని కృషి చేస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొస్తే బాగుంటుందని సంకల్పించామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజాన్ని ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా పాత్ర కీలకంగా మారిందన్నారు. సామాజిక మాధ్యమం అరచేతిలో ప్రపంచం. సేవలు విశ్వవ్యాప్తం. వినియోగం ఓ ఆనందం. భావాల వ్యక్తీకరణకు దోహదం. మధురానుభూతుల సంగమం. ఇలా ఒక్కటా రెండా మానవ జీవితంలో సామాజిక మాధ్యమాలది కీలక పాత్ర. ప్రస్తుతం అంతా సోషల్ మీడియా యుగం. కొందరు తమ టాలెంట్‌తో సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించుకుంటున్నారు. కొత్త తరహా వీడియోలు, కంటెంట్‌తో ఫ్యాన్స్ సంపాదించుకుంటున్నారు. ఇలాంటి యూట్యూబర్స్ సామాజిక బాధ్యతగా భావించి సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలుపై రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలు చేయాలని కోరారు. ముఖ్యంగా...రోడ్డు ప్రమాదాల కట్టడి, ప్రమాదాలు జరిగినప్పుడు ఆ గోల్డెన్ హావర్ లో క్షతగాత్రులను సమీప ఆసుపత్రుల్లో చేర్పించి కాపాడటం, రోడ్డు సేఫ్టీ నిబంధనలపై ప్రజల్లో అవగాహన చేయడం... గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలు, వాటి జోలికెళితే జీవితాలు ఎలా నాశనం అవుతాయి... తదితర కోణాలలో ప్రజల్ని అప్రమత్తం చేసేలా రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలు తీయాలన్నారు. ప్రధానంగా యువతకు చేరేలా సోషల్ మీడియా ద్వారా సహకరించాలని ఎస్పీ కోరారు.సైబర్ నేరాలపై గత రెండు మూడేళ్లుగా జిల్లాలో జరిగిన చోరీలు, సైబర్ క్రైం ను విశ్లేషిస్తే దొంగతనాలలో పోగొట్టుకున్న సొత్తు కంటే అనేక రెట్లు అధికంగా సైబర్ నేరాలలో ప్రజలు మోసపోయారన్నారు. అత్యాశ, అమాయకత్వం తో పాటు ప్రజల్లో అవగాహన లేకపోవడమే. సైబర్ క్రైం ఏఏ కోణాల్లో జరుగుతాయి, వాటిని నిరోధించాలంటే ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన చేశారు. ముఖ్యంగా ... డిజిటల్ అరెస్టు/ ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్ , ఇన్వెస్ట్మెంట్ / టాస్క్ / స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ ... డెబిట్ / క్రెడిట్ కార్డు ఫ్రాడ్ ... పార్ట్ టైం జాబ్ / జాబ్ ఫ్రాడ్ ... ఏ.పి . కె / లింక్ / మెసేజీ ఫ్రాడ్... ఏ.ఈ .పి.ఎస్ ఫ్రాడ్ , ఫేక్ లోన్ యాప్ ఫ్రాడ్స్ పై వివరించారు. సైబర్ క్రైం జరిగిన వెంటనే 1930 కు సమాచారం అందించాలని సూచించారు.

# బిసిలు అత్యున్నత స్థాయిలో ఉండాలి

## ఇదే సిఎం చంద్రబాబు లక్ష్యం : బిసి సంక్షేమ మంత్రి సవిత



**విజయవాడ,ఫిబ్రవరి6, ప్రభాత వార్తప్రతి నిధి విజయవాడ :** సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం నెరవేరేలా బీసీ బిడ్డలు సివిల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై అత్యున్నత కొలువులు సాధించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆకాంక్షించారు. విజయవాడలోని గొల్లపూడిలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్స్ కోచింగ్ సెంటర్ ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, విశ్రాంతి గదులను పరిశీలించారు. అనంతరం సివిల్స్ కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో మంత్రి సవిత మాట్లాడారు. మౌలిక వసతులు, భోజన సదుపాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల హాజరు, అధ్యాకుల బోధన గురించి కూడా ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు విద్యాబోధన కూడా బాగుందని అభ్యర్థులు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కార్పొరేట్ కు ధీటుగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్ సర్వీసెస్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లోనూ, ఉన్నత కొలువుల్లోనూ నిలవాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని సివిల్స్ లో ఉత్తీర్ణత సాధించాలని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారించామన్నారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనకు ఫోన్ చేయాలంటూ తన ఫోన్ నెంబర్ ను అభ్యర్థులకు అందజేశారు. గతంలో బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎంతోమంది సివిల్ సర్వీసెస్ లో విజయం సాధించారన్నారు. అదే స్పూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

# మృతదేహం వద్ద పేలిన టపాకాయలు

## 10మందికి తీవ్రగాయాలు

**గంగవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** మృతదేహాన్ని దహన క్రియలు కోసం తరలిస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు టపాకాయల మూటపై పడడంతో పది మంది తీవ్రగాయాలపాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. చిత్తూరు జిల్లా గంగవరం మండలం దండపల్లె గ్రామానికి చెందిన మునెమ్మ(80) అనే వృద్ధురాలు గ్రామంలో మృతి చెందడంతో సాయంత్రం అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా పక్కనే అంత్యక్రియల కోసం తీసుకువచ్చిన టపాకాయల మూటపై ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడడంతో టపాకాయల మూట ఒక్కసారిగా పేలడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలోగ్రామనికి చెందిన గురవయ్య(60),కుమార్‌నాయుడు (34),వెంకటరమణ(50),బాబు(50)లతో పాటు అంత్యక్రియలకు హాజరైన వికోట,బంగారు పాళ్యం, యాదమరి,చిత్తూరుకు చెందిన మృతురాలు బందువులు, తదితరులు తీవ్రంగా గాయపడ్డారు.తీవ్రంగా గాయపడ్డవారిని స్థానికులు 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం :మంత్రి పార్థసారధి

## - రూ.6,78,345 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 34 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు



**విజయవాడ,ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతుందని ఏపీ సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పెద్ద కార్పొరేట్ దిగ్గజాలు రాష్ట్రానికి వచ్చి పలు ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుందన్నారు ఇప్పటి వరకూ రూ.6,78,345 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబందించి 34 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారురజ. తద్వారా 4,28,705 మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని వివరించారు.గురువారం సాయంత్రం మాచార శాఖ సమావేశ ప్రాంగణంలో ఆయన మీడియాతో ఆయన అంశాలపై మాట్లాడుతూ పరిశ్రమలు , వాణిజ్యం 202429 ఐదేళ్ల కాలానికి సంబందించి రూపొందించిన పలు విధానాలైన ఎంఎస్ఎఇ విధానం., ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పాలసీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ , ఆంధ్రప్రదేశ్ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ టెక్స్‌టైల్, అపెరల్ గార్మెంట్స్ (గతిబి) పాలసీల సవరణల కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర ముఖ్యమంత్రి సమగ్ర కార్యచరణను రూపొందించారన్నారు.ఆయన అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ప్రభుత్వ నిర్దేశిత బి.సి., ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు మహిళా ఎంటప్రెన్యూర్సు ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. బి.సి., ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, విభిన్న ప్రతిభావంతులు. మహిళా ఎంటప్రెన్యూర్స్ ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పలు ప్రోత్సాహాలను పెంచడం జరిగింది. 35 పెట్టుబడి రాయితీని 45 శాతానికి పెంచడం జరిగింది. ఇప్పటి వరకూ మేన్యూఫ్యాక్చరింగ్ ఆక్టివిటీస్ కు ఈ పెట్టుబడి రాయితీ అందజేయడం జరుగుతుంటే, ఇకపై రవాణా, లాజిస్టిక్స్ ఆక్టివిటీస్ కు కూడా 45శాతం రాయితీని గరిష్టంగా రూ. 75 లక్షల వరకూ ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికే ఈ పెట్టుబడి రాయితీలు వర్తిస్తాయి. ఇంతకు ముందు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు భూమి విలువపై 50 శాతం రాయితీని గరిష్టంగా రూ.2.00 లక్షలు ఇవ్వడం జరిగేది. కానీ నేడు తీసుకున్న నిర్ణయం ప్రకారం 75 శాతం రాయితీని గరిష్టంగా రూ. 25 లక్షలు ఇవ్వడం జరుగుతుంది. అదే విధంగా ఇంతకు ముందున్న 4.0 పాలసీ లో మహిళలు, బి.సి. మరియు విభిన్న ప్రతిభావంతులకు ఆరు సంవత్సరాల పాటు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్ కు రూ.1/ ఇవ్వడం జరిగేది. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్ కు రూ.1.50 లు ఐదు సంవత్సరాల పాటు ఇవ్వడం జరిగేది. ఇప్పుడు అన్ని వర్గాలకు అంటే మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీ మరియు విభిన్న ప్రతిభావంతులకు విద్యుత్ రాయితీగా ప్రతి యూనిట్ కు రూ.1.50 లు ఐదు సంవత్సరాల పాటు ఇవ్వడం జరుగుతుంది. రీయింబర్స్ మెంట్ ప్రోత్సాహాన్ని ఐదు సంవత్సరాల పాటు అన్ని వర్గాల వారికి ఇవ్వడం జరుగుతుంది.

# ఉరి వేసుకొని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

## ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయం

**బాలానగర్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త :** ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాలానగర్ మండల కేంద్రంలోని జనరల్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం జరిగింది. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆరాధ్య (15) విద్యార్థులందరూ ప్రార్థన కొరకు సిద్ధమవుతున్న సందర్భంలో, ఎవరు లేని సమయం చూసి ఏడవ తరగతిలో చీరతో ఉరి వేసుకోగా, తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు విద్యార్థిని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం షాద్ నగర్ తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. బాలిక స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన కొమ్ము రమేష్, రజిత కూతురు. ఈ సం ఘటన తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు బాలిక ఆత్మహత్యకు పాఠశాల ఉపాధ్యాయులే కారణమని పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. పోలీసులు పాఠశాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేం దిర బోయి పాఠశాలను సందర్శించి, విద్యార్థి మృతికి గల కారణాలు పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చి, మనోధైర్యం కల్పించారు. బాలిక కుటుం బంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాన్ని కల్పిస్తామని, ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా.. రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



# రాష్ట్ర మహిళా పోలీసులకు ఒకే జాబ్ చార్జ్ ఇవ్వాలి

## - డిజిపికి విమెన్ పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మదులత దుర్గం వినతి

**విజయవాడ ఫిబ్రవరి 06 ప్రభాతవార్త ప్రతినిధి** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీశ్ కుమార్ గుప్తాని మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మదులత దుర్గం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా పోలీసుల యొక్క ప్రధాన సమస్యలను రాష్ట్రం మొత్తం మహిళా పోలీసులకు ఒకే జాబ్ చార్ట్ ఇవ్వవలసిందిగా డిజిపికి వినతి పత్రం అందించడమైనది. డిజిపి వినతిపత్రం స్వీకరించి, పరిశీలించి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో మహిళా పోలీస్ యొక్క సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపివిడబ్ల్యూఎస్ఎంపిఇడబ్ల్యూఎ రాష్ట్ర ట్రెజరర్ డి. నళిని, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.రాధిక, వి.నందిని బాయ్, టి. స్వాతి పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పర్యాటక రంగంలో గుర్తింపు సాధించాలి

## రాష్ట్ర టూరిజం అథారిటీ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి చేసి తమదైన ముద్రవేయాలని పర్యాటక శాఖ అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. గురువారం ఏపీఐఐసీ బిల్డింగ్ 11వ ఫ్లోర్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ శాఖల అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా రానున్న ఐదేళ్లలో పర్యాటక రంగంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రి దుర్గేష్ అధికారులకు మార్గదర్శకత్వం అందించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి అద్భుతమైన ట్యాగ్ లైన్ సిద్ధం చేసి తీసుకురావాలని, ఈనెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో జరిగే సమావేశంలో అనుమతి తీసుకొని విస్తృత ప్రచారం కల్పించేందుకు పాటుపడాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధిపై మంత్రి దుర్గేష్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టుల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రమ్మని అధికారులకు మంత్రి దుర్గేష్ సూచించారు. స్థానికంగా ఏ తరహా పర్యాటక అభివృద్ధి చేస్తే బాగుంటుందో చెప్పాలన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా అటవీ, దేవాదాయ శాఖల అనుమతులు అవసరం వస్తే తాను సంబంధిత కేబినెట్ సబ్ కమిటీలో మెంబర్ గా ఉన్నానని, తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల మంత్రులు పవన్ కళ్యాణ్, ఆనం రాం నారాయణ రెడ్డి లతో చర్చించి పరిష్కారానికి పాటుపడతానని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అధికారులకు తెలిపారు. కూటమి ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో అమితమైన విశ్వాసము ఉందని, ఆసక్తితో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి సరైన వివరాల అందించి పీపీపీ విధానంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు మంత్రి దుర్గేష్ సూచించారు. సీఎస్సార్ నిధులు రాబట్టడం పై దృష్టి పెట్టి తద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా టూరిజం, కల్చర్ ఈవెంట్ క్యాలెండరు సిద్ధం చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అనుమతితో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి ఈవెంట్లు చేద్దామన్నారు. తిరుపతి లాంటి అధ్యాత్మిక ప్రాంతాల్లో హోం స్టే లు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేశారు. తిరుపతి తరహాలో శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో శాఖాపరంగా తలెత్తిన సిబ్బంది సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సూర్యలంక మైపాడు బీచ్ లను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న తరహా టూరిజం లను అభివృద్ధి చేయాలని సంకల్పించామని టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి అన్నారు. ఫ్రీ వెడ్డింగ్ షూట్స్, అడ్వెంచరస్ స్పోర్ట్స్, చిల్డ్రన్స్ గేమ్స్, ఫిషింగ్ విత్ ఫిషర్ మెన్ వంటివి పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశపెడతామని అన్నారు.

# దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2కోట్ల 28లక్షలు



మ్యూజిక్‌డైరెక్టర్ తమన్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారిని దర్శించుకున్న భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు.2కోట్ల 28లక్షల 81వేల 128లు లభించినట్లు ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. బంగారం 328 గ్రాములు, వెండి 3 కెజిల 480 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఎ 158 డాలర్లు, సౌదీ 5 రియాల్స్, యుఎఇ 130 దిర్హమ్స్, కెనడా 115 డాలర్లు, సింగపూర్ 55 డాలర్లు, ఇంగ్లాండ్ 65 పౌండ్లు, ఖతర్ 1 రియాల్, ఒమన్ 2000 బైంసా మరియు 1 రియాల్, కువైట్ 30.5 దినార్లు లభించాయని ఇఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, ఏఇఓలు, ఆలయ అధికారులు, సిబ్బంది, ఎస్పీఎఫ్, పోలీస్ లు, శ్రీ అమ్మవారి సేవాదారులు పాల్గొన్నారు.

- **దుర్గమ్మవారి సేవలో అజయ్‌జైన్ :** దుర్గమ్మవారిని గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ దంపతులు దర్శించుకున్నారు. అలాగే ప్రముఖ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

- **మాఘమాసంలో లోకకళ్యాణార్థం సూర్యోపాసన సేవ:** దుర్గమ్మ ఆలయంలో లోకకళ్యాణార్థం మాఘమాసం సందర్భంగా వేదోక్తంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో పాల్గొనాలని ఇఓ తెలిపారు. ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ద ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్దశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు.

# పర్యాటక రంగంలో పెట్టుబడులకు అంతర్జాతీయ కంపెనీల ఆసక్తి

## - అమెరికాకు చెందిన మాక్సీ హోటల్స్ గ్రూప్ ఇన్వెస్టర్స్‌మంత్రి దుర్గేష్‌తో భేటీ

విజయవాడ.ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి:అమెరికాకు చెందిన మాక్సీ హోటల్స్ గ్రూప్ ఇన్వెస్టర్స్ సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌తో బేటీ అయ్యారు.సరైన ప్రతిపాదనలు, ప్రణాళికలతో వస్తే ప్రభుత్వం తరపున సహకరిస్తామని ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్‌తెలిపారు.పీపీపీ తమ విధానమని తెలిపిన మంత్రి దుర్గేష్.. పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, ప్రభుత్వం తరపున అందిస్తున్న రాయితీలపై మంత్రి దుర్గేష్ వివరణకు ముగ్దులైన పెట్టుబడిదారులురాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిని కలిసార. మంత్రి ఛాంబర్ లో అమెరికాకు చెందిన మ్యాక్సీ హోటల్స్ కు సంబంధించిన పెట్టుబడిదారులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రధానంగా అతిథ్య(హాస్పిటాలిటీ) రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని వారు మంత్రితో అన్నారు. మాక్సీ హోటల్స్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయని, పర్యాటకులకు విలాసవంతమైన సౌకర్యాలు కల్పించడం తమ ధ్యేయమన్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా తమ హోటల్స్ విస్తరించి ఉన్నాయని వారు వివరించారు. అనంతరం పర్యాటక రంగ అభివృద్ధిలో పీపీపీ విధానంలో ముందుకు వెళ్తున్నామని, పర్యాటక రంగానికి రాష్ట్రంలో పరిశ్రమ హోదా ఉందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు. అదే విధంగా నూతన పర్యాటక పాలసీ విధి విధానాలు, ప్రభుత్వం తరపున అందిస్తున్న రాయితీలను మంత్రి దుర్గేష్ వివరించారు. మంత్రి కందుల దుర్గేష్ వివరణతో పెట్టుబడిదారులు ముగ్దులయ్యారు. ఈ సందర్భంగా పెట్టబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్స్ ఆసక్తి కనబరచగా అందుకు మంత్రి దుర్గేష్ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సరైన డీపీఆర్, ప్రణాళికలతో వస్తే ప్రభుత్వం తరపున సహకరిస్తామని మంత్రి కందుల దుర్గేష్ భరోసానిచ్చారు. ఇటీవల పర్యాటక రంగంలో రూ.1200కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు.

# డాక్టర్ మారు ఇక లేరు



**విజయవాడ,ఫిబ్రవరి6,ప్రభాతవార్తప్రతినిధి,:** నాస్తిక ఉద్యమ నాయకురాలు, ప్రముఖ సామాజిక సంఘం సేవకురాలు, పలువురికి స్వచ్ఛంద వైద్యసేవలందిస్తూ డాక్టర్ మారు గురువారం రాత్రి మరణించారు.ఆమె ప్రముఖ నాసికయోధులు గోరా, సరస్వతి గోరాల కుమార్తె ఆమె వాసవ్యమహిళా మండలి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.కొద్ది సేపటి కితమే ఆమె మరణించినట్లు ఆమె సోదరుడు నాస్తిక కేంద్ర నిర్వాహకులు డాక్టర్ సమరం గోపరాజు వెల్లడించారు.డాక్టర్ మారుది ఉద్దాతమైన జీవన విధానం. ఎందరికో దాదాపు ఉచిత వైద్యసేవలు అందించారు.గ్రహణ మొర్రీ వంటి దూరాచారాలను ఖండిస్తూ,శాస్త్రీయ అవగాహన కల్పించే వారు,హెచ్ఐవి బాధితులకు సేవలందించారు.సామాజిక దగాబడ్డ ఎందరో అభాగ్యునిలకు అండగా నిలిచారు.డాక్టర్ మారు మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

# తెలంగాణలో ప్రశాంతంగా సాగుతోన్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

## సిసి కెమెరాలతో పర్యవేక్షణ.. ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయి. సీసీ కెమెరాల మధ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ బోర్డు అధ్వర్యంలో మొదటిసారిగా ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల మధ్య నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కమాండ్ కంట్రోల్‌ను బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షల తీరును.. పరీక్షల నిర్వహణ గురించి కంట్రోలర్ ఆప్ ఎగ్జామ్స్ (సీవోఈ) జయప్రదబాయి ఇంటర్ బోర్డు అధికారులు భీంసింగ్, మోహన్, జ్యోత్స్న, వసుంధరతో కలిసి బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం మీడియాకి వివరాలను తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఏవరైనా విద్యార్థులు అనారోగ్యంతోపాటు ఇతర ఏదైనా కారణాలతో హాజరుకాలేకపోతే వారు సరైన కారణాలను చూపుతూ తమకు అవకాశం ఇవ్వాలని జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ)లను సంప్రదిస్తే.. కారణాలను పరిశీలించి ఆయా విద్యార్థులకు తిరిగి ప్రాక్టికల్ పరీక్షలను తదుపరి స్పెల్‌లో నిర్వహించడంపై డీఈసీలు నిర్ణయం తీసుకుం టాయన్నారు.

పరీక్షలను నాలుగు స్పెల్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రాక్టికల్ పరీక్షలకు ఉపయోగిస్తున్న సీసీ కెమెరాలను భవిష్యత్‌లో జరగబోయే థియరీ పరీక్షలకు కూడా కొనసాగించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థుల నామినల్ రోల్స్‌లో తప్పుల సవరణకు గురు, శుక్రవారాల్లో అవకాశం కల్పించి నట్టు తెలిపారు. సోమవారం(ఈనెల 3) నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు నాలుగు స్పెల్స్‌లో కొనసాగుతూ 22 వరకు కొనసాగను న్నాయి. మొదటి స్పెల్ నేటి(ఫిబ్రవరి 7)తో ముగియనుంది.

సెకండ్ స్పెల్ ఈ నెల 8 నుంచి 12 వరకు, మూడో స్పెల్ 13 నుంచి 17 వరకు.. చివరగా నాలుగో స్పెల్ ఈ నెల 18 నుంచి 22 వరకు కొన సాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 4,29,052 మంది హాజరు కానున్నారు.

# విసిల నియామకంలో రాష్ట్ర అధికారాలకు గండికొడుతున్న కేంద్రం



గురువారం బెంగళూరులో జరిగిన ఆరు (బిజెపియేతర) రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## బెంగళూరు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు
## డ్రాఫ్ట్ యుజిసి రెగ్యులేషన్స్ 2025ను వ్యతిరేకిస్తూ ఆరు రాష్ట్రాల తీర్మానంలో పాల్గొన్న మంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను గండికొడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డ్రాఫ్ట్ యుజిసి రెగ్యులేషన్స్-2025ను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. గురువారం బెంగళూరులో జరిగిన ఆరు (బిజెపియేతర) రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖను నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి బదులుగా ఆయన హాజరయ్యారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌ల విద్యామంత్రులు, ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను ఆయన వెల్లడించారు. ఇప్పటిదాకా విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాన్ని చీఫ్ సెక్రటరీ సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ చేపట్టేది. అలాంటి రాష్ట్రానికి సంబంధమే లేకుండా విసిల నియామకం చేపట్టేలా డ్రాఫ్ట్ రూపొందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఉన్నత విద్యకు తెలంగాణ ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అవసరమైన చోట కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉన్నత విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు అండగా నిలుస్తోంది" దీన్ని ప్రోత్సహించాల్సిందిపోయి ఆటంకాలు కల్పించడమేమిటని శ్రీధర్‌బాబు దుయ్యబట్టారు. ఉపకులపతులుగా పరిశ్రమల అధిపతులను, బ్యూరోక్రాట్లను, బయటి వ్యక్తులను నియమించే అవకాశాన్ని కల్పించాలన్న డ్రాఫ్ట్ రెగ్యులేషన్ లోని ప్రతిపాదన పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేసారు. ఉన్నత విద్యా సంస్థల్లో మూడు వేల మంది విద్యార్థులుంటేనే గ్రేడింగులు ఇస్తామని, ఉన్నత గ్రేడ్లు వస్తేనే కేంద్ర ప్రోత్సాహకాలు అందుతాయన్న ప్రతిపాదనను కూడా శ్రీధర్ బాబు వ్యతిరేకించారు. ఇది ప్రైవేటు యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు కలిగించే చర్య అని ఆరోపించారు. బిఏ, బికాం, బిఎస్సీ, బిబిఏ లాంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలనడం పేదలకు ఉన్నత విద్యను దూరం చేసే ఆలోచనగా ఆయన అభివర్ణించారు. దేశ సరాసరి 'గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో' కేవలం 28 శాతం మాత్రమే ఉంది. అంటే ఉన్నత విద్య చదవాల్సిన వయసులో ఉన్న యువతలో నూటికి 28 మంది మాత్రమే కళాశాలల్లో చేరుతున్నారు. ఈ రేషియోను పెంచాలంటే ఎంట్రన్సులలాంటి ఆటంకాలను సృష్టిస్తారా అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇప్పటిదాకా వైస్ ఛాన్సలర్ల పదవీకాలం 3 సంవత్సరాలు ఉండగా యుజిసి రెగ్యులేషన్స్ లో 5 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. జాతీయ విద్యా విధానం 2020 ను రాష్ట్రాలు అమలు చేయాలని పేర్కొనడం చాలా సమస్యలను తీసుకొస్తుంది. డిగ్రీ కోర్సులకు ఏడాదిలో రెండు సార్లు అడ్మిషన్లు నిర్వహించాలంటే సిబ్బంది కొరత, మౌలిక సమస్యలు ఉంటాయి. ఒక విద్యార్థి ఏక కాలంలో రెండు కోర్సులు చదవొచ్చన్న ప్రతిపాదన అమలు విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుని మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు అందజేయాలి. గ్రేడింగులకు అర్హత పొందకున్నా, జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయకున్నా యుజిసి నిధులను విడుదల చేయమని పేర్కొనడం బెదిరింపు చర్యగా భావించాల్సి వస్తోందని, ఆన్లైన్, కరస్పాండెన్స్ కోర్సులకు అనుమతులివ్వమని చెప్పడం విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. డ్రాఫ్ట్ యూజిసి రెగ్యులేషన్స్ రాష్ట్రానికి ఆమోదయోగ్యంగా లేవని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు ఇప్పటికే అధికారికంగా లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. విద్యకు సంబంధించిన ఏ ప్రతిపాదనలైనా రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే రెగ్యులేషన్స్ రూపొందించాలని శ్రీధర్ బాబు డిమాండ్ చేసారు. యుజిసి రెగ్యులేషన్స్ 2025లోని 15 అంశాలను వ్యతిరేకిస్తూ, అమలును నిలిపివేయాలని రాష్ట్రాల విద్యామంత్రులు, ప్రతినిధుల సమావేశం ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరుతూ తీర్మానం చేసింది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలక్రిష్ణారెడ్డిలు హాజరయ్యారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రశంసలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 6:** తెలంగాణ ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రత్యేకంగా ప్రశంసించింది. రాష్ట్ర అభివృద్ధి దిశగా సమర్థమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారంటూ అభినందించింది. సుసంపన్నత, నగర రవాణా సౌకర్యాలు, సమన్యాయపూర్వక ఆర్థిక వృద్ధి వంటి అత్యవసరమైన గ్లోబల్ అంశాలపై రేవంత్ రెడ్డి దృష్టి సారించారని పేర్కొంది. సమర్థమైన ఆలోచన విధానాన్ని, సమాజ హితం కోసం ఆయన చేపడుతున్న కార్యక్రమాలను ప్రత్యేకంగా కొనియాడింది. ఈ మేరకు ముఖ్యమంత్రికి డబ్ల్యుఇఎఫ్ లేఖను రాసింది. ముఖ్యంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తెలంగాణ అభివృద్ధికి అమలు చేస్తున్న ప్రణాళికలు, నగర రవాణా వ్యవస్థను సులభతరం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే ప్రణాళికలు బాగున్నాయని పేర్కొంది. సమాజంలో సమానత్వాన్ని పెంపొందించి, వృద్ధిని సమాన ఖర్చంగా ప్రజలందరికీ చేరువ చేయడం, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధిపై ఆయన అవలంబిస్తున్న స్పష్టమైన విధానాలను డబ్ల్యుఇఎఫ్ తన లేఖలో ప్రస్తావించింది.

రాబోయే పదేళ్లలో తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకనామీగా మారుతుందన్న రేవంత్ మాటలు డబ్ల్యుఇఎఫ్ సదస్సుకు హాజరైన పెట్టుబడుదారులకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొంది. ఆధునిక సాంకేతికత, ప్రతిభ, స్వచ్ఛమైన ఇంధనం, స్థిరమైన, సమానమైన వృద్ధిలో తెలంగాణను అగ్రగామిగా నిలపడానికి ఉద్దేశించిన రైజింగ్ తెలంగాణ 2050 లక్ష్యాన్ని నెరవేర్చడానికి రాబోయే కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాల గురించి భారతదేశానికి కంట్రీ స్ట్రాటజీ డైలాగ్‌లో తెలుసుకోవడానికి ప్రపంచ పెట్టుబడిదారులు ఆసక్తి చూపారని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికల అమలుకు మీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి మేము ఎదురు చూస్తున్నామని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పానికి, ప్రణాళికలకు, నూతన ఆవిష్కరణలు,ప్రజా సంక్షేమ విధానాలు, అభివృద్ధి పథకాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం పట్ల కాంగ్రెస్ వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

# బిసిల అభ్యున్నతికి ఊతమిచ్చేలా కులగణన

## ఎఐసిసి అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణలోని బహుజనులు ముఖ్యంగా బిసిల అభ్యున్నతికి ఊతం ఇచ్చేలా కులగణన సమర్థవంతంగా నిర్వహించారని ఎఐసీసీ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ వివరిస్తూ ఓ లేఖ రాశారు. ఈ లేఖలో పలు విషయాలను ప్రస్తావించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని సంతృప్తిని వ్యక్తం చేస్తూ జాతీయ నాయకత్వానికి వేర్వురుగా లేఖలు రాశారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ మంత్రి కొండా సురేఖ గురువారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎఐసిసి అగ్రనేతలకు సోనియా, రాహుల్ గాంధీలకు లేఖ రాశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీ కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా శ్రమించారని వెల్లడించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీలకు మరింత న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పునరుద్ఘాటించారు. ఈ మొత్తం బీసీ సర్వే ప్రక్రియలో పార్టీ, ప్రభుత్వపరంగా కాంగ్రెస్ అధినాయకత్వం చాలా సహకరించిందని అన్నారు.. అందుకు కృషి చేసిన ఏఐసీసీ అగ్రనేతలకు రెండు బలహీనవర్గాల కులాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న వడ్డమూరి కృష్ణస్వరూప్

# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 14న 'రాష్ట్ర బంద్'

## పిలుపునిచ్చిన మాలమహానాడు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్‌లను సిఎం రేవరంత్‌రెడ్డి వర్గీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 14న 'తెలంగాణ రాష్ట్ర బంద్' పాటించాలని జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాల సామాజిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షామీర్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో అమోదించే ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి రాజ్యాంగ నిబంధనలను పాటించలేదని, ఎస్సీ జాతీయ కమిషన్‌ను ఆర్టికల్ 338 ప్రకారం సంప్రదించకుండా ఏకపక్షంగా వర్గీకరణ పూనుకున్నదని ఆరోపించారు. మాదిగలు బిజెపికి ఓట్లు వేస్తే, మాలలు కా ంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రేవంత్‌రెడ్డిని సిఎంగా చేస్తే మాలలకు ఆయన వెన్నుపోటు పొడిచారని ఆయన ధ్వజమెత్తారు. 14న జరిగే రాష్ట్ర బంద్‌లో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రుల దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలతో పాటు మేధావులు, ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అందరికి అన్నీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు.. ఇప్పుడు ఎవ్వరికీ ఏదీ చేయలేమనే పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలను పెండింగులో ఉంచారన్నారు. 317 జిఓ విషయంలో ఉద్యోగుల సమస్యలపై బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ పెద్దఎత్తున పోరాటం చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగులు మరిన్ని జటిలమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదు. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వస్తుందన్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడంలేదు..? అంటూ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ అద్భుతమైన కేంద్ర బడ్జెట్ తీసుకొచ్చారన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వేతన జీవులందరికీ రూ. 12 లక్షల వరకు ఇన్ కం ట్యాక్స్ మినహాయింపును అందించడం హార్షణీయం అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ బిజెపి అభ్యర్థి సరోత్తమ్ రెడ్డికి మద్దతు తెలపాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు సాయిరెడ్డి అనేక పోరాటాలు చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని బిజెపి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# తెలంగాణలో అన్ని వర్గాలను మోసగిస్తున్న ప్రభుత్వం

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా బిసి కులగణన సర్వే పూర్తిగా అశాస్త్రీయంగా కనబడుతుందన్నారు. 134 బిసి కులాలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో బిసిల జనాభా 46.25 శాతమని తక్కువగా చూపిస్తూ, వారి హక్కులను హరించేందుకు కుట్ర చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభా 4.10 కోట్ల మంది కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.54 కోట్లు మాత్రమేనని చూపించారని, 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా 3.51 కోట్లుగా ఉందని, 2014లో కెసిఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.68 కోట్లుగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా ఎలా తగ్గింది..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 10 శాతం మైనారిటీలను బిసిల్లో కలిపి బిసిముస్లింలు అంటూ రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తుందన్నారు.

# బిఆర్ఎస్ రాష్ట్రానికి అతిపెద్ద సమస్య

## అబద్ధానికి అంబాసిడర్ బిఆర్ఎస్: మంత్రి సీతక్క



గురువారం గాంధీభవన్‌లో మంత్రి సీతక్క సమక్షంలో ఆదిలాబాద్ జిల్లా బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన దృశ్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రాష్ట్రానికి అతిపెద్ద సమస్య తెలంగాణను పదేళ్లు పట్టించుకోక పోవడంతో అనేక సమస్యలు తిష్ఠ వేశాయని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశుసంక్షేమం మంత్రి సీతక్క అన్నారు. గురువారం గాంధీ భవన్‌లో ఆదిలాబాద్ జిల్లా బోత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పలు పార్టీల నాయకులు తరలివచ్చి కాంగ్రెస్‌లో చేరారు. బోథ్ ఇంచార్జ్ గజేందర్ నేతృత్వంలో గాంధీభవన్‌కు భారీగా చేరుకున్నారు. స్థానిక సంస్థల మాజీ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు నేతలకు సీతక్క కండువా కప్పినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టి టిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని అన్నారు. దిగజారుడు రాజకీయాలు టిఆర్ఎస్ మానుకోవాలని సూచించారు. రైతుభరోసా నిధులు రైతుల ఖాతాలలో జమచేస్తున్నాం కొన్ని యూట్యూబ్ చానళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆవేదన చెందారు. అబద్దాలు ఎంతో కాలం నిలవ్వని ఆమె అన్నారు.తెలంగాణ ఉద్యమంలో 12వందల మంది చనిపోయారని చెప్పి అధికారంలోకి రాగానే 400కు కుదించారని ఆమె ఆరోపించారు. అబద్దానికి పుట్టిన పార్టీ బిఆర్ఎస్‌పార్టీ అబద్దానికి అంబాసిడార్ బిఆర్ఎస్ నేతలు అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రామసభలు పారద్శకంగా నిర్వహించి లబ్దిదారులను ఎంపికచేస్తాం అని తెలిపారు. బిఆర్ఎస్ సర్వే నివేదిక నిజంలేదు కాబట్టే అసెంబ్లీలో ప్రవేశపెట్ట లేదని ఆయన అన్నారు.




# మారుతి సుజికి ఇ-విటాకా కారు ఆవిష్కరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మారుతి సుజికి కార్ నెక్సా డీలర్ వరుణ్‌మోటార్స్ షోరూమ్‌లో గురువారం మొదటి ఎలక్ట్రిక్ కార్ ఇ-విటారాను ఆవిష్కరించారు. మారుతి సుజికి సౌత్‌ఈస్ట్ రీజియన్ కమర్షియల్ బిజినెస్ హెడ్ వినిత్‌జైన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్‌మేనేజర్ అమిత్‌కుమార్‌సింగ్, కార్పొరేట్ జోనల్‌మేనేజర్ సాహిల్ అరోరా, వరుణ్ గ్రూప్ డైరెక్టర్ డికెరాజు, జనరల్‌మేనేజర్ శ్రీధర్‌పాల్‌లు పాల్గొన్నారు. వరుణ్ మోటార్స్ సంస్థ 20 ఇన్నోకోటన కారులను యూరో క్యాబ్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ కుల్దీప్‌కు ఆపరేషన్‌హెడ్ దీపక్ డైరెక్టర్ డికెరాజు,జనరల్‌మేనేజర్ శ్రీధర్‌పాల్‌కు అందజేశారు. నెక్సా వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా క్రాఫ్టెడ్ ఫ్యూచరిజం ఇ విటారా హైటెక్ అడ్వంచర్‌తో రూపొందిచారు.

# టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాద పార్టీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి

## బిజెపి నాయకుడు సాయిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని బిజెపి నాయకుడు సాయిరెడ్డి అన్నారు. గురువారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో రెండుసార్లు పిఆర్టీయూ, రెండుసార్లు యూటీఎఫ్ గెలిచినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ ఉపాధ్యాయులు, విద్యారంగంపై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నాయన్నారు. వ్యక్తులు ముఖ్యం కాదు, పార్టీ ముఖ్యం, సిద్ధాంతం ముఖ్యం అన్నారు. దేశంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు న్యాయం జరిగేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి బలపడాలని మనమంతా కృషి చేయాలన్నారు. నేను స్వచ్ఛందంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ నుంచి విరమించుకొని, బిజెపి అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి గారికి మద్దతు ప్రకటిస్తున్నానన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాద పార్టీ గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలన్నారు. ఉపాధ్యాయలోకం బిజెపి అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించి శాసన మండలికి పంపించాలని కోరుతున్నట్లు తెలిపారు.

# యుజిసి ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తీర్మానం

## తెలంగాణ విద్యా కమిషన్ సెమినార్‌లో నిర్ణయించిన మేధావులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) కొద్ది రోజుల క్రితం ప్రతిపాదించిన సిఫారసులను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని మేధావులు తీర్మానం చేశారు. యుజిసి యూనివర్సిటీల్లో వీసీల నియామకంతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేసి.. వాటిని అభిప్రాయ సేకరణకు పెట్టారు. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యా కమిషన్ గురువారం యుజిసి ప్రతిపాదనలపై రాష్ట్రంలోని విద్యావేత్తలతో ప్రత్యేకంగా సెమినార్ నిర్వహించింది. కమిషన్ కార్యాలయం ఉన్న భవనంలోని గోదావరి హాల్‌లో సెమినార్‌ను నిర్వహించగా.. పలువురు ప్రొఫెసర్లు సెమినార్‌లో పాల్గొన్నారు. యుజిసి ముసాయిదా నిబంధనలు- 2025 చర్చించారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తీర్మానించారు. సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించి.. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని సెమినార్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు, మేధావులు అభిప్రాయ పడ్డారు. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని నియంత్రించేలా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. రాజ్యాంగంలోని సమాఖ్య నిర్మాణం కింద రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను లాక్కునేలాగా ప్రతిపాదనలు ఉన్నాయని అభిప్రాయ పడ్డారు. యూజీ, పీజీలో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో కామన్ ఎంట్రన్స్ పరీక్షలను నిర్వహించాలని యుజిసి నిర్ణయిం చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం యుజిసి ప్రతి పాదనలను వ్యతిరేకించాలని సెమినార్ తీర్మానం చేసింది. సెమినార్‌లో జస్టిసన బి సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండరామ్, ప్రొఫెసర్ హర గోపాల్, ఓయూ మాజీ వీసీ సులేమాన్ సిద్ధిఖీ, ప్రొఫెసర్ శాంతా సిన్హా, రమా మేల్కొటే, ప్రొఫెసర్ తిరుపతిరావు తదితరులు సెమినార్‌లో పాల్గొన్నట్టు విద్యా కమిషన్ ప్రకటించింది.

# నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ నుంచి ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్, రిక్రియేషన్ మిషన్ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పేరుతో తెలంగాణలో నిరుద్యోగుల నుంచి దాదాపు 6881 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు వచ్చిన ప్రకటన అవాస్తవం అని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దర ఖాస్తుకు రూ.399 చెల్లించాలని కూడా ప్రకటనలో పేర్కొన్నారని, అయితే కేంద్ర గ్రామీణాభివృద్ధి వాఖ సమాచారం మేరకు అలాంటి సంస్థగానీ, అలాంటి విభాగం గానీ లేదన్నారు. ఇలాంటి మోస పూరిత ప్రకటనలు చూసి నిరుద్యోగులు ఎవరూ మోసపొవద్దని అన్నారు.

# మా హక్కులు కాపాడండి.. అవమానించకండి

## మాజీ విఆర్వోలకు మళ్లీ పరీక్షలు వద్దని సిసిఎల్ఏ కార్యదర్శికి వినతి



సిసిఎల్ కార్యదర్శి మకరందును కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్ర రావు, ప్రధాన కార్యదర్శి లక్షీ ్మనరసింహులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** రెండు దశాబ్దాలకు పైగా ఉద్యోగం చేస్తున్న వీఆర్వోలకు మరల పరీక్షలు ఏమిటి ? యావత్తు ఉద్యోగుల చరిత్రలో లేనటువంటి చర్య ఇది.. 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఒక్క ప్రమోషన్ కూడా పొందలేకపోయాం అనే బాధ వెంటాడుతూనే ఉందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్షీ ్మ నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వ వీఆర్వోలను రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకునే కీలకమైన అంశంలో పరీక్ష విధానంతో తీసుకోవాలని ప్రభుత్వం సూచనలు చేయడం ముమ్మాటికి పూర్వ విఆర్వోలను అవ మానించడమేనని అన్నారు. గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అత్యవసర సమా వేశం నిర్వహించింది. ఇదే విషయాన్ని సిసిఎల్ఏ కార్యదర్శి మకరందును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పిం చారు. ఎటువంటి ఆంక్షలూ లేకుండా జుళీవీ లను రెవెన్యూ డిపార్టు మెంటులోకి తీసుకోవాలని కోరగా, స్పందిస్తూ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకు పోతానని హామి ఇచ్చారు. ఈ సమావేశంలో తమ ఆవేదన, మానసిక ఆందోళన గురించి తెలి యజేప్పేందుకు, భవిష్యత్తు కార్యాచరణ పై సమావేశం అయ్యామని గరికె ఉపేంద్రరావు, లక్షీ ్మ నరసింహులు తెలియజేశారు. జీఓలు 39,903,231,1866,25(పీఆర్ సీ) లక్షలాది మందితో పోటీపడి ప్రభుత్వ నిబంధనలకు లోబడి, రాత పరీక్ష మరియు మోఖిక పరీక్షల ద్వారానే నియమింపబడ్డామని, గత ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు లోబడే నియమింపబడిన మమ్మల్ని అవమానించడమే కాకుండా.. ఆ జీవోలను కూడా తప్పుపడతారా ? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వండి...మా ఉద్యోగ హక్కులను కాపాడండి... మాకు పరీక్షలు పెడతానంటే యావత్ ఉద్యోగుల లోకంతో పాటు యావత్ సమాజం ముక్కు మీద వేలు వేసుకుంటుందని వారు ఎద్దేవా చేశారు. మీ చర్య అర్థరహితం... రెవిన్యూ మినిస్టర్ గారు ఒకసారి ఆలోచించండి... మా హక్కులను కాల రాయకండి.. అని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వ వీఆర్వోలు రెవిన్యూ శాఖ యొక్క పరీక్షలు రెవిన్యూ టెస్ట్ 1,2,3, అకౌంట్ టెస్ట్ 8, సిపిసి, సిఆర్పిసి, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, సర్వే శిక్షణ చేసి ఉత్తీర్ణులు అయి ఉన్నారనీ, గ్రామస్థాయి పరిపాలనపై అపారమైన పరిజ్ఞానం కలిగి ఉన్నారనీ, పూర్వ వీఆర్వోలను మాతృ సంస్థలోకి తీసుకొని హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

పాలకులు గ్రామస్థాయి రెవెన్యూ ఉద్యోగులను అవమానిస్తున్నారు.... సర్వీస్ లో ఉన్న వారికి పరీక్షలు పెట్టడం అవమానకరం, ఆందోళనకరం, అభ్యంతర కరమనీ, ఈ విషయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామనీ, ఈ విషయంలో ప్రభుత్వం పునరాలో చించాలని వారు ఆవేదన

# ఆగిఉన్న డిసిఎంను ఢీకొట్టిన బైక్

## ఇద్దరు యువకుల మృత్యువాత

## మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దుర్ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో న్యూ టౌన్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఆగిఉన్న డీసీఎంను వేగంగా బైక్ ఢీకొట్టడంతో బైక్ ఉన్న ఇద్దరు అక్కడికక్కడే తనువు చాలించారు.

వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట కు చెందిన శశాంక్(19) బీఎస్సీ రేడియాలజీ మొదటి సంవత్సరం, నల్గొండ జిల్లా నాంపల్లి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (19) బీఎస్సీ రెస్పిరేటరీ కోర్సులు మహబూబ్‌గర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుతున్నారు. గురువారం తెల్లవారుజామున ఇద్దరు కలిసి మోటార్ బైక్ పై వేగంగా వెళ్తూ న్యూటౌన్‌లో ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందినట్లు టూటౌన్ సీఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ప్రధాన దవాఖానకు తరలిం చారు. అయితే తలకు బలమైన గాయాలు కావడం వల్లే ప్రాణాలు కోల్పోయారని హెల్మెట్ ఉంటే బతికే వారని సంఘటనను చూసిన వారు చెబుతున్నారు.

వేగంగా వచ్చి డీసీఎంను ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని గమనించిన స్థానికులు పేర్కొన్నారు. అతివేగం హెల్మెట్ లేకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పోలీసులు చెబుతున్నారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని అభిప్రాయ పడుతున్నారు.

# ఇండస్ట్రీలో శియా గౌతమ్ సంచలనం

మాస్ మహారాజా రవితేజ సరసన ఒకే ఒక్క సినిమాలో కనిపించింది. కట్ చేస్తే టాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. అతి తక్కువ సమయంలోనే పాపులర్ అయిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాత్రం అదే క్రేజ్ కొనసాగించలేకపోయింది. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీని చూసి షాకవుతున్నారు ఫ్యాన్స్. తెలుగు సినీరంగంలో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలనుకుంది. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఒక్క సినిమాతోనే పాపులర్ అయ్యింది. కానీ ఆ తర్వాత అదే క్రేజ్ కొనసాగించలేకపోయింది. చాలాకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆ హీరోయిన్.. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయ్యింది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. ఆమె మరెవరో కాదు.. శియా గౌతమ్. ఈ పేరు చెబితే అసలు గుర్తుపట్టలేరు.. కానీ మాస్ మహారాజా రవితేజ నటించిన నేనింతే సినిమా హీరోయిన్ అంటే మాత్రం ఠక్కున గుర్తుపట్టేస్తారు. డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2008లో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ కమర్షియల్ హిట్ కాలేకపోయింది. కానీ ఇప్పటికీ ఈ సినిమాకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఇందులో రవితేజ యాక్టింగ్, పూరీ డైలాగ్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సినిమాలో రవితేజ సరసన నటించిన శియా గౌతమ్. ఈ సినిమాతోనే ఆమె టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందం, అభినయంతో మెప్పించింది. ఈ సినిమాతో శియాకు మంచి ఫాలోయింగ్ పెరిగింది. ఆమె అసలు పేరు అదితి గౌతమ్. కానీ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత తన పేరును మార్చుకుంది. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. నేనింతే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. కానీ ఫస్ట్ మూవీతో ఒక్కసారిగా ఫేమస్ అయినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు.



# ప్రతీ యేటా తెలుగు సినిమా పుట్టిన రోజు

తెలుగు సినిమా పుట్టిన రోజుగా చేయాలని నిర్ణయించింది తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్. ఇకపై ప్రతి యేడాది ఈ రోజును తెలుగు సినిమా పుట్టిన రోజుగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం అందించే అవార్డులతో పాటు, ఛాంబర్ తరఫు నుంచి వివిధ కేటగిరీల్లో అవార్డులు కూడా అందించాలనే నిర్ణయం జరిగింది. తెలుగు సినిమా పుట్టినరోజున ప్రతి సినిమా నటుడు ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాలని నిర్ణయం జరిగింది. ఈ జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించింది ఫిల్మ్ ఛాంబర్. తొలి తెలుగు టాకీ సినిమాకు సంబంధించి వివరాలను ఎంతో రీసెర్చ్ చేసి భక్త ప్రహ్లాద గురించి తెలిపిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ కృషిని గుర్తు చేసుకుంటూ.. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ ఆధ్వర్యంలో ఇదే వేదికపై ఆయన రచించిన 'మన సినిమా ఫస్ట్ రీల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఇక తెలుగు సినిమా పుట్టిన రోజు సందర్భంగా సీనియర్ రైటర్ పరుచూరు గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఛాంబర్ ప్రెసిడెంట్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తరఫున తెలుగు సినిమా దినోత్సవం మొదటిసారి చేయడం జరుగుతుంది. అంతకు ముందు కొన్ని సంస్థలు చేశాయి. ఈయేడాది నుంచి ఛాంబర్ తరఫు నుంచి చేయాలని నిర్ణయించుకున్నాం. సినిమా అనేది మా అందరికీ తల్లి లాంటిది. తెలుగు సినిమా ఛాంబర్ మదర్ బాడీ ఇక నుంచి ప్రతి సంవత్సరం చేయాలని డిసైడ్ చేశాం. మొదటి యేడాది కాబట్టి ఈ సారి నార్మల్‌గా చేస్తున్నాం. నెక్ట్స్ ఇయర్ నుంచి గ్రాండ్‌గా నిర్వహించబోతున్నాం. పాత తరం కళాకారులకు మరిన్ని సన్మానాలు చేస్తాం. సినిమా హిస్టరీ గురించి చెబితే.. సినిమా అనేది ఫస్ట్. బర్త్ ఆఫ్ సినిమా ముఖ్యం. చాలామంది ఎన్నో చరిత్రలు క్రియేట్ చేశారు. కానీ బర్త్ ఆఫ్ సినిమా అనేది ముఖ్యం. రాబోయే తరాలు కూడా ఇది గుర్తుంచుకోవాలి. ఇక ఈ రోజును గురించి పాతికేళ్ల పాటు రీసెర్చ్ చేసి మొదటి తెలుగు టాకీ సినిమా డేట్‌ను ఖచ్చితంగా గుర్తించి ప్రపంచానికి తెలియజేసిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ్‌కి థ్యాంక్స్ చెబుతున్నాను అన్నారు.



ఛాంబర్ సెక్రెటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఇవాళ సినిమా పుట్టిన రోజు. ఫస్ట్ టాకీ ఫిల్మ్ భక్త ప్రహ్లాద. ఈచిత్రానికి హెచ్‌ఎమ్ రెడ్డి దర్శకుడు. ఈ చిత్రానికి ముందు వేరే వేరే డేట్ అనుకునేవాళ్లం. రెంటాల జయదేవ్ గారు పరిశీలించి ఈ రోజు అని చెప్పడంతో సెలబ్రేట్ చేసుకుంటున్నాం. భక్త ప్రహ్లాద కంటే ముందే కాళిదాసు అనే సినిమా 1931లో వచ్చింది. కాళిదాసు చిత్రంలో నాలుగు రీళ్ల తెలుగులోనే పాటలు, డైలాగులు ఉండి.. తెలుగు దర్శకుడు హెచ్‌ఎమ్ రెడ్డి దర్శకుడు.. తెలుగువాడైన గంగాధర్ హీరోగా నటించారు.

# వరుస ప్రాజెక్టులతో తిరువీర్



జార్జ్ రెడ్డి, పలాస 1978 వంటి చిత్రాలలో తనదైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారు తిరువీర్. ఆ తరువాత మసూద, పరేషన్ వంటి చిత్రాలలో ప్రధాన పాత్రలో ప్రేక్షకులను మరింతగా మెప్పించారు. ఇక తిరువీర్ కెరీర్‌లో మసూద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం తిరువీర్ పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం తిరువీర్ ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో అనే చిత్రంలో ఫోటోగ్రాఫర్ పాత్రలో కనిపించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. తిరువీర్ తన కొత్త చిత్రం గురించి మాట్లాడుతూ, వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ పాత్రను పోషించడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మొబైల్‌తో చాలాసార్లు ఫోటోలు తీశాను. కానీ ఇలా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌గా నటించడం చాలా కొత్తగా, ఛాలెంజింగ్‌గా అనిపిస్తోంది. స్టిల్స్ ఎలా పెట్టించాలి, కెమెరాను ఎలా పట్టుకోవాలి ఇలా చాలా విషయాల్ని నేర్చుకున్నాను. అందరినీ ఎంటర్టైన్ చేసేలా ఈ చిత్రం ఉంటుంద'ని అన్నారు. రీసెంట్‌గా ఈ మూవీ షూటింగ్ అరకులో జరిగింది. అక్కడి చలి తీవ్రతను తట్టుకుని మరి టీం అంతా ఎంతో కష్టపడి సినిమాను షూట్ చేశారు. ఈ సినిమాతో పాటుగా తిరువీర్ 'భగవంతుడు' అనే మరో ప్రాజెక్ట్‌ని కూడా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలకు సంబంధించిన షూటింగ్‌తో తిరువీర్ ప్రస్తుతం బిజీగా ఉన్నారు.

# 'పోతుగడ్డ'లో వెంకట్ పాత్రకు మంచి రెస్పాన్స్

పృథ్వీ దండమూడి, విస్మయ శ్రీ, ప్రశాంత్ కార్తి, శత్రు, ఆడుకాలం నరేన్ ప్రముఖ పాత్రల్లో 24 సినిమా స్ట్రీట్ బ్యానర్ మీద అనుపమ చంద్ర కోడూరి, డా.జి. శరత్ చంద్రా రెడ్డి నిర్మించిన చిత్రం 'పోతుగడ్డ'. ఈ సినిమాకు రక్ష వీరమ్ దర్శకత్వం వహించారు. రాహుల్ శ్రీవాస్తవ్ కెమెరామెన్‌గా పని చేసిన ఈ చిత్రం ఇటీవలే ఈటీవీ విన్‌లోకి వచ్చింది. ఈ చిత్రానికి ప్రస్తుతం మంచి స్పందన వస్తోంది. వెంకట్ అనే డిఫరెంట్ షేడ్స్ ఉన్న కారెక్టర్‌లో కనిపించిన ప్రశాంత్ కార్తి తన పాత్రకు వస్తోన్న స్పందన పట్ల సంతోషాన్ని వ్యక్తంచేశారు. కెమెరా మెన్ రాహుల్ ద్వారా నాకు ఈ సినిమా అవకాశం వచ్చింది. అయితే ఈ చిత్రం కోసం గుబురు గడ్డం, పొడవాటి జుట్టు కావాలని అన్నారు. ఆ లుక్ కోసం ట్రై చేశాం. అయితే మధ్యలో కొన్ని కారణాల వల్ల నేను జుట్టు తీసేయాల్సి వచ్చింది. ఇక ఈ సినిమా ఆఫర్ పోయినట్టే అనుకున్న టైంలో డైరెక్టర్ రక్ష నుంచి కాల్ వచ్చింది. నా ఒరిజినల్ లుక్‌ని చూసి బాగుంది.. ఇదే ఫైనల్ చేద్దామని అన్నారు. అలా నా లుక్ ఇందులో చాలా నేచురల్‌గా కనిపిస్తుంది. పోతుగడ్డ సినిమాలో నా పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సినిమా ఆరంభం, ముగింపులో తన పాత్రలోని షేడ్స్ కనిపిస్తాయి. ఆ వేరియేషన్ నాకు చాలా నచ్చింది. అందుకే ఈ చిత్రానికి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇందులో నా పాత్రకి మంచి రెస్పాన్స్ వస్తోంది. అన్ని పాత్రలకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. ఇక ప్రత్యేకంగా నా పాత్రలోని వేరియేషన్, యాక్టింగ్ గురించి అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు.



చంద్ర సిద్దార్థ, చంద్రశేఖర్ యేలేటి వంటి వారు ప్రశంసించడం ఆనందంగా ఉంది. పోతుగడ్డ షూటింగ్ మొత్తం కూడా నైట్ టైంలోనే జరిగింది. అది కూడా పూర్తి చలికాలంలోనే షూటింగ్ చేశాం. అంతటి చలిలోనూ మా టీంకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మా నిర్మాత అనుపమ, మాదర్శకులు రక్ష ఎంతో చక్కగా చూసుకున్నారు. టీంఅంతా ఓ ఫ్యామిలీలా కలిసి ఎంజాయ్ చేస్తూ షూటింగ్‌చేశాం. ఆర్టిసుల్ని, టెక్నీషియన్లి మానిర్మాత ఎలాంటి లోటు లేకుండా చూసుకున్నారు. టీంను ఆమె సపోర్ట్ చేయడం వల్లే సినిమా ఇంత బాగావచ్చింది. శ్రవణ్ భరద్వాజ్ పాటలు,మార్కస్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందరి నీ ఆకట్టుకుంటోంది. పోతుగడ్డ సినిమాలో ఓ మంచి ప్రేమ కథ ఉంటుంది. యాక్షన్, ఎమోషన్స్ ఇలా అన్ని రకాల అంశాలు ఉంటాయి. రాజకీయం చుట్టూ కథ తిరిగినా కూడా ఓ అందమైన ప్రేమకథను ఇందులో చూపించారు. ఎక్కడా బోర్ కొట్టించుకుండా అందరినీ ఎంటర్టైన్ చేసేలా మాసినిమా ఉంటుంది. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీని చేస్తున్నాను.

# 'తల' ట్రైలర్ రిలీజ్

రణం మూవీతో దర్శకుడుగా సత్తా చాటిన అమ్మ రాజశేఖర్ మరోసారి అద్భుతమైన చిత్రంతో వస్తున్నాడు. తల అనే టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్ర ట్రైలర్‌కు తెలుగులో అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయం అవుతుండటం విశేషం. ఈ మధ్య కాలంలో ఇంత మంచి ట్రైలర్ రాలేదు అనే మాట ఇండస్ట్రీ నుంచి కూడా వినిపించింది. ఇక తాజాగా ఈ మూవీ తమిళ్ ట్రైలర్‌ను వెర్సటైల్ ప్యాన్ ఇండియా యాక్టర్ విజయ్ సేతుపతి చేతల మీదుగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను చూసిన విజయ్ సేతుపతి సైతం చాలా చాలా ఇంప్రెస్ అయ్యారు. ఓ స్టార్ హీరో రేంజ్‌లో కనిపిస్తోంది మూవీ అని ప్రశంసించారు. ఇలాంటి మూవీతో డెబ్యూ ఇవ్వడం అనేది ఖచ్చితంగా రాగిన్ రాజ్‌కు చాలా పెద్ద కెరీర్‌ను ఇస్తుందని కితాబునిచ్చాడు. తమిళ్‌లో ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజయ్ సేతుపతి వంటి వారి నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావడంతో బిజినెస్ పరంగానూ తలా ఊహించిన దానికంటే చాలా ఫ్యాన్సీగా వెళుతోంది. అందుకు కారణం ఈ మూవీ కంటెంట్‌లో సూపర్ హిట్ గ్యారెంటీ అనే దమ్ము కనిపిస్తోందనే మాటలు బలంగా వినిపిస్తుండటమే. ఈ నెల 14న వాలెంటైన్స్ డే సందర్భంగా తలను విడుదల చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 'వయొలెంట్ వాలెంటైన్' అనే పేరుతో ప్రమోషన్స్ చేస్తూ విడుదల చేయబోతుండటం విశేషం. దర్శకుడు: అమ్మ రాజశేఖర్, నిర్మాత: శ్రీనివాస గౌడ్ బ్యానర్: దీపా ఆర్ట్స్.





రిద్ధి కుమార్ నయా లుక్

# సినిమా హిట్‌కు ఫార్ములా అదే: ఖుషి కపూర్

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా ఖుషి కపూర్ ఇప్పటికే సినీ రంగ ప్రవేశం చేసింది. ది ఆర్చీస్ సినిమాతో కెరీర్ ను మొదలుపెట్టిన ఖుషి కపూర్ ఆ సినిమాతో ఫ్లాప్‌ను అందుకుంది. ప్రస్తుతం ఖుషి నటించిన లవ్ యాపా సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఖుషి చాలా యాక్టివ్‌గా పాల్గొంటుంది. లవ్ యాపా ప్రమోషన్స్‌లో భాగంగా ఖుషి ఏ సినిమాకైనా పబ్లిసిటీ చాలా ముఖ్యమని, మనం దేన్నైనా ఆడియన్స్ వరకు తీసుకెళ్తేనే వారు ఆదరిస్తారని, అలా కాకుండా సినిమా తీశాం చూస్తారులే అనుకుంటే కుదరదని ఈ సందర్భంగా ఖుషి తెలిపింది. లవ్ యాపా సినిమా అందరి కంటే యూత్ ను ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తుందని, కచ్చితంగా ఈ సినిమాను యూత్ మొత్తం ఆదరిస్తారని ఖుషి భావిస్తోంది. 16 ఏళ్ల లోపు వయసున్న ప్రతీ ఒక్కరికీ లవ్ యాపా నచ్చుతుందని ఖుషి ఈ సందర్భంగా తెలిపింది. అయినా మనం చేసిన సినిమా ప్రతీ ఒక్కరికీ నచ్చేలా తీయలేమని, తన మొదటి సినిమా ది ఆర్చీస్ సినిమాకీ, ఇప్పటికీ తాను చాలా డెవలప్ అవడంతో పాటూ చాలా నేర్చుకున్నానని, స్టోరీ సెలెక్షన్ విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఖుషి వెల్లడించింది. లవ్ యాపా సినిమా ఓటీటీలో కాకుండా థియేటర్లలో రిలీజవుతుండటం వల్ల కాస్త టెన్షన్ పడుతున్నట్టు ఖుషి తెలిపింది. ట్రైలర్ రిలీజ్ టైమ్‌లో బిగ్ స్క్రీన్ పై తనను తాను చూసుకున్నప్పుడు ఒణికిపోయానని, కానీ అలా చూసుకుని ఎంతో ఆనందపడ్డానని ఖుషి ఈ సందర్భంగా వెల్లడించింది. సినిమా సక్సెస్ అనేది కలెక్షన్స్ పై ఉంటుంది కాబట్టి ఆ కలెక్షన్స్ రావడానికి తన వంతు కృషి చేస్తానని ఖుషి ఈ సందర్భంగా చెప్పింది. ఆమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా నటించిన లవ్ యాపా సినిమాకు అద్వైత్ చందన్ దర్శకత్వం వహించగా ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించాడు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన మలయాళ సూపర్ హిట్ సినిమా లవ్ టుడే సినిమాకు రీమేక్‌గా లవ్ యాపా రూపొందింది. ఖుషి కపూర్ ఈ సినిమా విజయం పై ఎన్నో ఆశలు పెట్టుకుంది.



# ఏడు భాషల్లో విడుదలైన 'కోబలి'

ఏడు భాషల్లో విడుదలైన కోబలి.. అన్ని భాషల్లోనూ సూపర్ హిట్ అనిపించుకుంటోంది. ఈ సిరీస్‌కు ఇంత మంచి రెస్పాన్స్ రావడం పట్ల నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోడూరు గ్రామానికి చెందిన తిరుపతి శ్రీనివాసరావు టిఎస్ఆర్ అనే బ్యానర్‌ను స్థాపించి ఇంతకు ముందు 'తికమకతాండ'అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో ఆయన కొడుకులను హీరోలుగా పరిచయం చేస్తూ నిర్మించిన తికమకతాండ రెండు తెలుగు రాష్ట్రాల్లో 130కి పైగా థియేటర్స్‌లో విడుదలై మంచి విజయం సాధించింది. తర్వాత స్ట్రీమింగ్ పార్టనర్ ఆహాలోనూ ఆకట్టుకుంటోంది. మొదటి సినిమా ఇచ్చిన ఉత్సాహంతోనే కోబలి వెబ్ సిరీస్ ను నిర్మించారు. ఈ సిరీస్ ప్రపంచ వ్యాప్తంగా ఏడు భాషల్లో విడుదలైంది. వీటిలో తెలుగు , హిందీ , తమిళ్, మలయాళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ భాషల్లో డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతోందిప్పుడు. 'కోబలి' సిరీస్‌లో రవి ప్రకాష్, రాకీ సింగ్, తరుణ్ రోహిత్, శ్రీతేజ్, శ్యామల, యోగి ఖత్రి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఫ్యాక్షన్ డ్రాప్‌లో రివెంజ్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ కు ఆడియన్స్ నుంచి గొప్ప స్పందన వస్తోంది. డిస్నీ ప్లస్‌లో ఇలాంటి కంటెంట్ ఇంతకు ముందు చూడలేదు అనేలా యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందించారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ రివెంజ్ డ్రామాలోని ఇంటెన్స్‌కు ప్రేక్షకులకు ఫిదా అవుతున్నారు. రేవంత్ లెవక డైరెక్ట్ చేసిన ఈ సిరీస్‌తో ఇన్నాళ్లూ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే కనిపించిన రవి ప్రకాష్ మెయిన్ లీడ్‌కు వచ్చి అద్భుతంగా ఆకట్టుకున్నాడు. యాక్షన్, ఎమోషనల్ సీన్స్‌లో అతని నటన కట్టిపడేస్తుంది. ఫ్యాక్షన్ నేపథ్యంలో సినిమాల్లో రివెంజ్ అనేది కామన్ గానే ఉన్నా.. ఈ సిరీస్‌లోని రివెంజ్‌కు సంబంధించిన ప్లాట్ సరికొత్తగా ఉండటంతో ప్రేక్షకులు మరింత థ్రిల్ అవుతున్నారు.



నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు

# అన్ని జానర్లతో నెట్ ఫ్లిక్స్

నెట్ ఫ్లిక్స్ నుంచి ఈఏడాది అద్భుతమైన వెబ్ సిరీస్, అందరినీ అలరించే కంటెంట్ రాబోతోంది. ఈ ఏడాదిలో తమ నుంచి వచ్చే ప్రాజెక్టుల వివరాల్ని నెట్ ఫ్లిక్స్ ప్రకటించింది. కామెడీ, ఫ్యామిలీ, యాక్షన్, రొమాన్స్, స్పోర్ట్స్ డ్రామా ఇలా అన్ని జానర్లను టచ్ చేస్తూ నెట్ ఫ్లిక్స్ ఈ ఏడాది ఊహించని స్థాయిలో వినోదాన్ని పంచేందుకు రెడీగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 700 మిలియన్లకు పైగా వీక్షకులను సంపాదించుకున్న నెట్ ఫ్లిక్స్ ఈ ఏడాది సరికొత్త కంటెంట్‌ను పంచేందుకు రెడీ అయింది. మాధవన్, సిద్దార్థ్, నయనతార, మీరా జాస్మిన్ వంటి అద్భుతమైన తారాగణంతో ఎస్. శశికాంత్ 'టెస్ట్' అనే సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. ఏ వైనాట్ స్టూడియో బ్యానర్ మీద చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్నారు. జీవితమే ఓ ఆట అనే కాన్సెప్ట్‌తో ఈ 'టెస్ట్' రాబోతోంది. భిన్న మనస్తత్వాలు, భిన్న దారుల్ని ఎంచుకున్న ముగ్గురు వ్యక్తుల జీవితాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. లవ్, అంతులేని కలలు, లక్ష్యాలు, కోరికలు, క్రికెట్ వంటి ఎమోషన్స్ చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. నెట్ ఫ్లిక్స్‌తో కలిసి ఈ సిరీస్‌ను అందరికీ అందిస్తుండటం ఆనందంగా ఉందని నెట్ ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనిక షెర్గిల్ అన్నారు. దర్శకత్వం: ఎస్. శశికాంత్, కథ: ఎస్. శశికాంత్, నిర్మాణం: చక్రవర్తి రామచంద్ర అండ్ ఎస్. శశికాంత్, తారాగణం: ఆర్.మాధవన్, నయనతార, సిద్దార్థ్, మీరా జాస్మిన్, రానా నాయుడు సీజన్2 కూడా రెడీ అయింది. రానా నాయుడు ఫస్ట్ సీజన్‌కు వచ్చిన ఆదరణ అందరికీ తెలిసిందే. ఇక ఈ రెండో సీజన్‌లో రానా నాయుడికి ఎదురైన కొత్త సమస్య ఏంటి? తన ఫ్యామిలీని రక్షించుకునేందుకు రానా నాయుడు ఏం చేశారు? గతంలో చేసిన పనుల వల్ల ఏర్పడిన ఈ కొత్త సమస్యలు ఏంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో రెండో సీజన్ ఉంటుంది. లోగో మోటివ్ గ్లోబల్ మీడియా నిర్మాత సుందర్ అరోన్ మాట్లాడుతూ.. 'రానా నాయుడు రెండో సీజన్‌ను అందరి ముందుకు తీసుకు వస్తున్నందుకు నాకు ఆనందంగాఉంది. ఫస్ట్ సీజన్ కంప్లీట్ అయిన వెంటనే ఈ రెండో సీజన్ పనులు ప్రారంభించాం. ఈ రెండో సీజన్ స్టోరీ, స్క్రీన్ ప్లే, పెట్టిన బడ్జెట్ చూసి ఆడియెన్స్ ఫిదా అవుతారు. నెట్ ఫ్లిక్స్ సహకారంతో ఈ రెండో సీజన్‌ను అద్భుతంగా తెరకెక్కించాం. ఈ రెండో సీజన్ చూసిన తరువాత ఆడియెన్స్ అంతా ఆశ్చర్యపోతారు. ఎదురు చూపులకు తగ్గ ప్రతిఫలం దక్కిందని చెబుతారు' అని అన్నారు. కథ: కరణ్ అన్షుమాన్, దర్శకత్వం: కరణ్ అన్షుమాన్, సుబర్ణ వర్మ, అభయ్ చోప్రా, రచన: కరణ్ అన్షుమాన్, ర్యాన్ సోరస్, కర్మణ్య అహుజ్జా, అనన్య మోడీ, కరణ్ గౌర్, వైభవ్ విశాల్, ప్రొడక్షన్: సుందర్ ఆరోన్, నిర్మాణసంస్థ: లోగో మోటివ్ గ్లోబల్ మీడియా, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: విశాల్‌బజాజ్, నిశాంత్ పాండే, ఆరిఫ్ మీర్, తారాగణం: రానా దగ్గుబాటి, వెంకటేష్ దగ్గుబాటి, అర్జున్ రాంపాల్, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా.



# నిరక్షరాస్య మహిళలకు ఉపాధి

ఎగుమతి చేస్తున్నారు. వాళ్లనలా తీర్చిదిద్దుతోంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన 'నవ' సాధికారతా కేంద్రం. సుమారు 4 వేల మంది మహిళలను ఉపాధి బాట పట్టించింది.నవ లిమిటెడ్.. పాల్వంచ కేంద్రంగా నడిచే బహుళ ఉత్పత్తుల అంతర్జాతీయసంస్థ. అధికారిక సామాజిక బాధ్యత భాగంగా మహిళా సాధికారత కేంద్రాన్ని 2013లో నెలకొల్పింది. దీనిద్వారా చదువుకున్నవారికి టాలీడీటీపీ... పెద్దగా చదువు కోని, నిరక్షరాస్య మహిళలకు బ్యుటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జనపనార, తాటాకు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. మెట్రోనగరాల నుంచి శిక్షకులను రప్పిస్తున్నారు. బ్యుటీషియన్ కోర్సులకు సింగపూర్ నుంచి శిక్షకురాలిని రప్పించారు. కోర్సు పూర్తయ్యాక ఆసక్తి ఉన్నవారు ప్రాంగణం ఆన్‌లైన్ ఆర్డర్‌లపై ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తున్నారు. నూతన మహిళా సహకార సంఘాన్నిఖి ఏర్పాటు చేశారు. నాబార్డ్, ఎలిప్, జాతీయ హస్తకళా సొసైటీ వంటి సంస్థల సహకారంతో మెట్రో, ఇతర నగరాల్లో స్టాల్స్ పెడుతున్నారు. తాటాకుతో తయారయ్యే బుట్టలు, గిఫ్ట్ ఆర్టికల్స్ క్స్‌కు బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంతోపాటు విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. కేవలం తాటాకు ఉత్పత్తులను రూ.20 లక్షలు దాటింది.



సొసైటీ మొత్తం లావాదేవీలను త్వరలో రూ. కోటికి చేర్చుతామంటున్నారు నిర్వాహకులు. సొంతంగా వ్యాపారాలు చేసుకోవాలంటే వారికి బ్యాంకు రుణాలిప్పిస్తున్నారు. టైలరింగ్ నేర్చుకున్న వారికీ రాయితీపై కుట్టుమెషీన్లు అందించారు. గత అక్టోబరులో భారత దేశ పర్యటనకు వచ్చిన ఐవరీకోస్ట్ దేశ పారిశ్రామిక ప్రత్యేక బృందం, మహిళా లాక్‌డౌన్‌లో ఆసుపత్రులకు పిపి కిట్లు, మాస్కులు తయారుచేసాం. ప్రభుత్వ కూలీ ధరకే 5 లక్షల ఏకరూప దుస్తులను ప్రభుత్వ విద్యార్థులకు అందించాం. వచ్చిన ఆదాయంలో ప్రతి పైసా మహిళలకే దక్కింది. పేదలకు స్థానికం గానే నైపుణ్యాన్ని నేర్పుతున్నాం. ప్రభుత్వ సహకారంతో ఏటా వెయ్యి మందికి ఉచిత వసతితో కూడిన శిక్షణ కల్పించ డమే మా లక్ష్యం అంటారు సంస్థ మేనేజర్ ఎంజీఎం ప్రసాద్.



# నైపుణ్యం ఉంటే సక్సెస్ అవుతాం..

**ఆసక్తి, అభిరుచి ఉంటే చాలు, ఏ రంగంలోనైనా అద్భుతాలు చేసి చూపించొచ్చు ఈ అమ్మాయిలే ఉదాహరణ డాక్టర్ కావ్య నాసా శాస్త్రవేత్తగా పనిచేస్తూనే ఇతర రంగాల్లోనూ తనదైన ముద్రవేస్తున్నారు. ఇక, కరిష్మా యాదవ్‌రెడ్డి అర్కిటెక్సర్‌పై ఇష్టంతో గూగుల్ కొలువుని సైతం వదిలి ఈ రంగంలో రాణిస్తున్నారు.**

**చందమామను చూపిస్తే నాసాదాకా వెళ్లా ! -కావ్య**

హైదరాబాద్లోనే పుట్టి పెరిగా. చిన్నప్పుడు అమ్మానాన్న ఇంటి టెస్పికి తీసుకెళ్లి చంద్రుణ్ని చూపిస్తూ అన్నం తినిపించేవారు. నేనేమో చందమామపైకి మనం వెళ్లొచ్చా? పైన డైనోసార్‌లు ఉంటాయా అంటూ ఎన్నోప్రశ్నలు వేసేదాన్నట. పెద్దయ్యే కొద్దీ ఆసక్తి మరింత పెరిగింది. నాన్న ఇది గుర్తించి 45 ఏళ్ల వయసులో తన బ్యాంక్ ఉద్యోగాన్ని సైతం నాకోసం వదులుకున్నారు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని నన్ను నాసాలో చేర్చేందుకు అమెరికాకు నివాసం మార్చారు. పదో తరగతి నుంచి అక్కడే చదివా ఇంట్లో ఇద్దరం ఆడపిల్లలమే అయినా ఎలాంటి ఆంక్షలు లేకుండా. స్వేచ్ఛగా పెరిగాం.



జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాట్‌లో ఎంఎస్ పూర్తిచేశా. పదేళ్లపాటు సీఎస్టి 100 స్టార్‌లైనర్‌లో వేర్వేరు హోదాల్లో పనిచేశా. ప్రస్తుతం నాసాలో శాస్త్రవేత్తగా ఉన్నా. లూనర్ సర్ఫేస్ ఆపరేషన్లో టెక్నికల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా. ఈ ప్రయాణంలో నాలుగు 'సి'లు ముఖ్యమైనవి గుర్తించా. మహిళలు ఏది చేయాలన్నా ధైర్యం(కరేజ్)గా అడుగు ముందుకేయాలి. ఇది స్వతహాగా రావాలి. ఏం చేయాలనేదానిపై స్పష్టత (క్లారిటీ) ఉండాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం(కాన్ఫిడెన్స్) వస్తుంది. చేసే పనిని అంగీతభావంతో (కమిట్మెంట్) చేయాలి. వృత్తి విషయం పక్కన పెడితే నా అభిరుచులకు ప్రాధాన్యం ఇస్తా అందుకే, మరో పక్క ప్రైవేట్ పైలట్, స్కూబా డైవర్‌గా, పర్వతారోహకురాలిగా, భరతనాట్యకళాకారిణిగా నన్ను నేను నిరూపించుకుంటున్నా



**గూగుల్ కొలువు వదిలి.. ఆర్కిటెక్చర్‌గా మారి ! -**

కరిష్మా ఇంటీరియర్ డిజైన్ కావాలని ఉన్నా మా ఊరు ఆ అవకాశం లేదు. పైగా అర్కిటెక్చర్ అంటే ఐదేళ్లు చదవాలి, అవకాశాలు తక్కువ, అమ్మాయిలకు అంత అనుకూలంగా ఉండదని మా ఇంట్లోవాళ్లు నన్ను కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో చేర్చారు. కళాశాల టాపర్‌ను. గూగుల్ డెవలపర్‌గా ఎంపికయ్యా. మంచి వేతనం.. అంతా బాగుంది కానీ ఎక్కడో అసంతృప్తి. దాంతో ఉద్యోగం మానేశా. ఈ సమయంలోనూ ఆర్కిటెక్చర్ కాకుండా స్నేహితులు, ఇతరుల ప్రభావంతో ఫ్యాషన్ డిజైనింగ్ చేశా. బొటిక్ పెట్టుకోవచ్చు.. తమకు స్నేహితులు అవుతామని స్నేహితులు చెప్పడంతో ఈ కోర్సు చేశా. ఆ తర్వాత హైదరాబాద్‌లో నేనొక ఫ్లాట్ కొనుగోలు చేశా. ఇంటిరియర్ కోసం చాలా సంస్థలను కలిసినా నా ఆలోచనలు వారికి అర్థమయ్యేవి కావు. ఇక లాభం లేదని నేనే ఇంటి ఇంటీరియర్స్‌ను చేయించుకున్నా.ఇల్లు చూసి అందరూ బాగుందని మెచ్చుకోవడంతో నాలో విశ్వాసం వచ్చింది. అప్పుడు 'బియాండ్ హోమ్స్' పేరుతో ఇంటీరియర్ సంస్థ ఏర్పాటు చేశా. రెండేళ్లలోనే అంతా మారిపోయింది. ప్రస్తుతం నా చేతిలో 28 ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. ఆసక్తి ఉన్న రంగంలో చలించాలంటే ధైర్యంగా అడుగు ముందుకు వేయడంతో పాటూ అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి... శ్రమించాలి. అప్పుడే సక్సెస్ అవుతాం.

**కాలపరిమిత ఉండాల్సిందే ...**

**- ఫాల్గుణి నాయర్** వ్యస్థాపకురాలు, నైకా

లక్ష్యం ఉండటం ఎంత ముఖ్యమో.. దానికి నిర్దేశిత కాలపరిమితి పెట్టుకోవడమూ అంతే ముఖ్యం. 50 ఏళ్ల వచ్చేసరికి సొంత వ్యాపారం ప్రారంభించాలనేది




నా లక్ష్యం. అంతకు రెండేళ్ల ముందే 2012లో నా వ్యాపార ప్రయాణం మొదలైంది. అప్పటికి కోటక్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకింగ్ ఎండీగా ఉంది. కెరియర్లో ఎలాంటి సమస్య లేదు. పిల్లలు పైచదువులకు అమెరికా వెళ్లారు. వ్యాపారం ప్రారంభం అదే మంచి సమయం అనుకుని ఉద్యోగం విడిచిపెట్టా.

# వీటికీ ఎక్స్‌పైరీ ఉంటుంది..

**చాలావరకు తినే ఆహార పదార్థాల విషయంలోనే తయారీ, గడువు తేదీలను ఒకటికి రెండుసార్లు చూస్తుంటాం. అదే.. రోజూ వాడే వస్తువులకూ ఎక్స్‌పైరీ ఉంటుందన్న విషయం విస్మరిస్తుంటాం.** నెలసరి సమయంలో మనం ఉపయోగించే శ్యానిటరీ ఉత్పత్తులూ దీనికి మినహాయింపు కాదు. అయితే ఈ నిర్దేశమే జననేంద్రియాల్లో ఫెక్షన్లకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది క్రమంగా వివిధ రకాల ప్రత్యుత్పత్తి సమస్యలకు దారితీస్తుందని, భాగస్వామిని వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్యానిటరీ ఉత్పత్తుల గడువు తేదీ గురించి కొన్ని విశేషాలు..!

**ఏది, ఎన్ని రోజులు వాడాలి?** నెలసరి సమయంలో పరిశుభ్రతను పాటించేందుకు ప్రస్తుతం వివిధ రకాల శ్యానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. న్యాప్‌కిన్‌లు, మెన్స్రువల్ కప్స్/ డిస్కులు, ట్యాంపన్స్.. వంటి వాటిని ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే వీటిని కొనుగోలు



చేసే చాలామంది ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను పట్టించుకోరు. ఎందుకంటే ఇవి శరీరానికి బయట వాడే ఉత్పత్తులు కాబట్టి ప్రమాదమేమీ ఉండదన్నది చాలామంది ఆలోచన. కానీ అన్ని వస్తువులులాగే వీటికీ ఎక్స్ పైరీ ఉంటుందని, దాన్ని భర్తీ చేస్తే వాటిని ఎన్ని రోజులు వాడా లో పరిశీలించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ కోసం..

**ఇన్ఫెక్షన్లకు కారణం.. అదేనా?** ప్యాకెట్ కొత్తగా ఉందా, లేదా అనేది తెలుసుకోవడం.. కానీ దాని ఎక్స్‌పైరీ తేదీపై మన దృష్టి పడింది. అయితే కొన్నిసార్లు ప్యాకెట్ కొత్తగా ఉన్నా.. ఏళ్ల తరబడి అవి మూలన పడి ఉండటం వల్ల ఆ ప్రదేశంలోని తేమ, హ్యుమిడిటీ కారణంగా.. వాటిపై కంటికి కనిపించని, వైరస్‌లు వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఇలాంటి వాటిని ఉపయోగించడం వల్ల జననేంద్రియాల్లో ఫంగల్ ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతుంది. ఫలితంగా ఆ భాగంలో దురద, ఎర్రటి దద్దుర్లు, మంట.. వంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. నిపుణులు. అందుకే కోరి సమస్యను కొని తెచ్చుకునే కంటే. కొనుగోలు చేసేటప్పుడే తయారీ గడువు తేదీలను పరిశీలించడం, సరిగ్గా ప్యాక్ చేసిన వాటినే కొనడం మంచిదని గుర్తుపెట్టుకోండి..

# ఓట్స్‌తో టేస్టీ స్నాక్స్

**కావలసినవి :**

ఆలుగడ్డలు: రెండు, చీజ్ తురుము: రెండు టేబుల్ స్పూన్లు, మసాలా ఓట్స్: అర కప్పు, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్ ఫ్లోర్: పావుకప్పు, మిరియాల పొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం:** ముందుగా అలుగడ్డల్ని ఉడకబెట్టి మెత్తగా మెదపాలి. ఓట్స్ను మిక్సీ జార్లో వేసి బరకగా గ్రైండ్ చేయాలి. ఒక గిన్నెలో మైదా వేసి కొద్దిగా నీళ్లపోసి జారుగా కలపాలి. మరో గిన్నెలో ఆలు ముద్ద, కారం, మిరియాల పొడి, ఉప్పు వేసి.. తగినంత కార్న్ ఫ్లోర్, చీజ్ వేసి ముద్దగా చేసుకుని అరగంట పాటు మిశ్ర



మాన్ని ఫ్రిజ్‌లో పెట్టాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోసి వేడి చేయాలి. మిశ్ర మాన్ని చిన్నచిన్న ఉండలు చేసుకుని మైదా పిండిలో ముంచి, ఓట్లలో దొర్లిం చాలి. ఆ ఉండ లను కాగిన నూనెలో వేసి దొరగా కాల్చు కుంటే నోరూరించే ఓట్స్ చీజ్ బాల్స్ సిద్ధం.

# ఇండక్షన్ స్టవ్ వాడుతున్నారా?

ఇండక్షన్ మామూలు స్టవ్ పోలిస్తే దీని వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఒక్కోసారి కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశముంటుంది. ఈ క్రమంలో ఇండక్షన్ స్టవ్ ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఓసారి చూద్దాం..

✦ ఇండ క్షన్ స్టవ్ వాడుతున్న ప్పుడు సాధ్యమైనంత వరకు దానికి సరిపోయే పాత్రలనే ఎంచుకోవాలి.



✦ కొందరు ఇండక్షన్ స్టవ్ సైతం గ్యాస్ స్టవ్ పక్కనే పెడుతుంటారు. దీనివల్ల సాధారణ సమయాల్లో ఎలాంటి నష్టం కలగదు. కానీ ఎప్పుడైనా పొరపాటున గ్యాస్ లీకైతే మాత్రం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే కిచెన్ ప్లాట్‌ఫారంపా వేర్వేరు చోట్ల అమ ర్చు కోవడం, తగిన జాగ్రత్త లు తీసు కోవడం తప్పని సరి.

✦ ఇండక్షన్ స్టవ్‌ని రేడియోలు, టీవీలు, కంప్యూట ర్లకు దూరంగా ఉండాలి. ఎందుకంటే అయస్కాంత క్షేత్ర ప్రభావం వల్ల అవి పాడైపోయే అవకాశాలున్నాయి..

✦ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్స్‌టెన్షన్ ప్లగ్ బాక్సులకు ఇండక్షన్ స్టవ్ ప్లగ్‌ని అనుసంధానించ కూడదు.

✦ఇండక్షన్ స్టవ్‌ని శుభ్రం చేసే క్రమంలో నీటిని ఉపయోగించకుండా మెత్తని వస్త్రంతో మాత్రమే తుడవాలి.

✦ ఇండక్షన్ స్టవ్‌కి ఉన్న రంధ్రాల్లో దుమ్ము, ధూళి చేరకుండా చూసుకోవాలి.

✦ స్టవ్‌కి ఏమైనా పగుళ్లు వచ్చినట్లనిపిస్తే దానిని ఉపయోగించ కూడదు.

✦. అలాగే స్టవ్ దగ్గర్లో ఎలాంటి లోహ సామగ్రిని ఉంచకూడదు.

✦ ఇండక్షన్ స్టవ్ విద్యుత్‌తో పని చేస్తుంది. కాబట్టి వీలైనంత వరకు దీనిని చెక్క టేబుల్‌పై పెట్టడం మంచిది. అంతేకాకుండా సెరామిక్ టైల్స్, సిమెంట్ ఫ్లోర్ పైన కూడా పెట్టుకోవచ్చు. అయితే ఈ స్టవ్ మెటల్ టేబుల్ పైన మాత్రం పెట్టకూడదు. దీనివల్ల షాక్ కొట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# దత్తాత్రేయుడు

దత్తాత్రేయుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశలతో అవతారమెత్తిన దివ్యమూర్తి, ఆ స్వామి మేడి చెట్టు (ఔదుంబర్) నీడలో కొలువై ఉంటాడు. మూడు శిరస్సులు, ఆరు చేతులు కలిగిన దత్తాత్రేయుని భిక్షువు రూపం అహంకార నాశనానికి ప్రతీక. సదా ఆయనను వెన్నంటి ఉంటే గోవు ధరణికి, శునకాలు వేదాలకు ప్రతీకగా భావిస్తారు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మ పురాణం, రామాయణం, భారత, భాగవతాల్లో దత్తాత్రేయుని ప్రస్తావన ఉంది. ముఖ్యంగా శ్రీగురు చరిత్రలో దత్తాత్రేయుని అవతారాల గురించి వివరంగా లిఖితమైంది. ఆధ్యాత్మిక ప్రేరణ కల్గించే ఈ గ్రంథంలో దత్తాత్రేయుని గురుతత్వం, దైవత్వం, ఆధ్యాత్మిక బోధనలు ఉన్నాయి. దత్త జయంతిని పురస్కరిం చుకొని భక్తులు శ్రీ గురుచరిత్ర పారాయణ చేస్తారు. ఇలా చేయటం వల్ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భక్తుల విశ్వాసం.24 చరాచరాలను గురువు లుగా భావించాడు. అవి 1. భూమి 2. జలం 3. అగ్ని 4. వాయువు దత్తాత్రేయుడు తన ఆత్మనే గురువుగా భావించి తనకు ఎంతో కొంత జ్ఞానాన్ని ప్రసాదించిన 19. శిశువు 20. కన్య 21, సర్పం 22. విలుకాడు 23. సాలీడు 24. గొంగళిపురుగు5. ఆకాశం 6. చంద్రుడు 7. సూర్యుడు 8.పావురం 9. కొండచిలువ 10. తేనెటీగ 11. తేనెటీగల పెంపకం దారుడు 12. గద్ద. 13. సముద్రం 14. చిమ్మట కీటకం 15. ఏనుగు 16. జింక 17. చేప 18. వేశ్య దత్తాత్రేయుడు. దత్తా త్రేయుని ఆలయాల్లో వినిపించే 'దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా' మంత్రం భక్తుల హృదయాల్లో ప్రశాంతత ఆవరిస్తుంది.



ఆధ్యాత్మికం

# మన తోటలో ఉల్లికాడ

**సూప్‌కి చక్కటి రుచి రావాలన్నా, వంటకాలకు చక్కటి ఆరోమాతో పాటు గార్నిష్ కూడా కావాలపించినా..** స్ప్రింగ్ ఆనియన్స్‌ని ఎంచుకుంటే చాలు. వీటిని వంటింటి బాల్కనీలోనూ సులువుగా పెంచుకోవచ్చు. అదెలాగో చూద్దామా !

ఉల్లికాడలు, ఉల్లికోళ్లు, ఉల్లిపరక, గ్రీన్ ఆన్స్... ఇలా స్ప్రింగ్ అన్ని చాలా పేర్లే ఉన్నాయి. దీన్ని ఉల్లిపాయగా మారకముందే కత్తిరించి కూరల్లో వాడతారు. ఇవి రుచిలో సాధారణ ఉల్లిపాయల కంటే కాస్త ఘాటు తక్కువగా ఉంటాయి. మెసపొటేమియా కాలం నాడే ఉల్లికాడల్ని వాడిన ఆధారాలూ దొరికాయట. ఈ పోషకాల ఉల్లి పొరకను చైనా, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా వంటి తూర్పు ఆసియా దేశాల వంటకాల్లో ఎక్కువ వాడతారట. చైనీయులు సుమారు 2000 ఏళ్ల క్రితం నాటి నుంచే వీటిని వాడుతున్నారట.

మట్టి వదులుగా ఉల్లికాడలు, ఉల్లికోళ్లు, ఉల్లిపరక, గ్రీన్ ఆన్స్... ఇలా స్ప్రింగ్ ఆన్నియు చాలా పేర్లే ఉన్నాయి. దీన్ని ఉల్లిపాయగా మారకముందే కత్తిరించి కూరల్లో వాడతారు. ఇవి రుచిలో సాధారణ ఉల్లిపాయల కంటే కాస్త ఘాటు తక్కువగా ఉంటాయి. మెసపొటేమియా కాలం నాడే ఉల్లికాడల్ని వాడిన ఆధారాలూ దొరికాయట.

ఈ పోషకాల ఉల్లి పొరకను చైనా, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా వంటి తూర్పు ఆసియా దేశాల వంటకాల్లో ఎక్కువ వాడతారట. చైనీయులు సుమారు 2000 ఏళ్ల క్రితం నాటి నుంచే వీటిని వాడుతున్నారట.




# 'ఫేషియల్ కప్పింగ్' అవసరం?

వయసు పెరిగినా అందం తరిగిపోకూడదనే అందరూ కోరుకుంటారు. ఈ క్రమంలోనే పలు చికిత్సలు తీసుకోవడంతో పాటు ఇంటి చిట్కాలూ పాటిస్తుంటారు. అయినా కొందరికి చిన్న వయసులోనే ముఖంపై ముడతలు, గీతలు.. వంటివి ఏర్పడుతుంటాయి. ఇలాంటి వృద్ధాప్య ఛాయల్ని దూరం చేయడంలో 'ఫేషియల్ కప్పింగ్' పద్ధతి చక్కగా దోహదం చేస్తుందంటున్నారు సౌందర్య నిపుణులు. బాడీ కప్పింగ్ను పోలి ఉన్నా.. ఎన్నో విధాలుగా అందాన్ని ద్విగుణీకృతం చేసే ఈ పద్ధతిని పాటించే అమ్మాయిల సంఖ్య క్రమంగా పెరుగుతుందంటున్నారు. మరి, ఏంటీ ఫేషియల్ కప్పింగ్ ఎలా చేసుకోవాలి? తెలుసుకుందాం రండి..

**బాడీ కప్పింగ్..** చాలామందికి తెలిసిన పద్ధతే! శారీరక నొప్పుల్ని దూరం చేసుకునేందుకు చాలామంది ఈ చికిత్స తీసుకుంటారు. ఫేషియల్ కప్పింగ్ కూడా ఇలాంటిదే కానీ దీని ప్రయోజనాలు వేరుగా ఉంటాయి. చర్మానికి రక్తప్రసరణను మెరుగుపరిచి.. చర్మాన్ని పునరుత్తేజితం చేసే ఈ సౌందర్య థెరపీతో వృద్ధాప్య ఛాయల్నీ దూరం చేసుకోవచ్చంటు న్నారు నిపుణులు, బాడీ కప్పింగ్లో భాగంగా శరీరంపై కప్స్ అమర్చుకున్న పుడు మచ్చలు పడే అవకాశం ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఫేషియల్ కప్పింగ్‌లో ఈ సమస్య ఉండకపోవచ్చంటున్నారు.

**కప్పింగ్.. దశల వారీగా!** బాడీ కప్పింగ్ మాదిరిగానే ఫేషియల్ కప్పింగ్లోనూ సిలికాన్, గ్లాస్ మెటీరియల్తో రూపొందించిన వివిధ రకాల కప్స్ ఉపయోగిస్తారు. అయితే ఇవి కాస్త మృదువుగా ఉండడం వల్ల చర్మంపై మచ్చలు పడే అవకాశం చాలా తక్కువంటున్నారు నిపుణులు. ఫేషియల్ కప్పింగ్ కోసం ప్రత్యేకమైన కిట్స్ కూడా మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించి ఫేషియల్ కప్పింగ్ ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం..



◆ ముందుగా ముఖాన్ని శుభ్రం చేసుకొని కాస్త తేమగా ఉండేలా తుడుచుకోవాలి.

◆ ఇప్పుడు చేతులు, మునివేళ్లతో ముఖంపై కాసేపు మర్దన చేసుకోవాలి. ఈ కొన్ని చుక్కల ఫేస్ ఆయిల్/సీరమ్ని కూడా వాడవచ్చు. దీనివల్ల కప్ప మచ్చలు చర్మంపై పడకుండా జాగ్రత్తపడచ్చు.

◆ గడ్డం వద్ద నుంచి కప్పింగ్ థెరపీ మొదలుపెట్టాలి. గడ్డం వద్ద చిన్న కప్పి అమర్చుకొని.. కాసేపటి తర్వాత నోటి చుట్టూ అక్కడక్కడ కప్పి కొన్ని నిమిషాల చొప్పున అమర్చుకోవాలి. ఇలా ఆపై బుగ్గలు, నుదుటి వరకూ దశల వారిగా కప్స్ని అమర్చుకొని తొలగించుకోవాలి.

◆ బుగ్గలు, నుదురు వంటి విశాలమైన ప్రదేశాల్లో పెద్ద కప్స్ని కూడా ఉపయోగించవచ్చు. ఇలా అవసరమైన ముఖభాగాల్లో కప్పి ఉంచుకోవాలి.

◆ ముందుగా ఫేస్ ఆయిల్/సీరమ్ రాసుకున్న వాళ్లు కప్పడం పూర్తయ్యాక ముఖం శుభ్రం చేసుకొని తడిపొడిగా ఉండేలా తుడుచుకోవాలి. ఆయిల్/ సీరం రాసుకొని వారు గోరువెచ్చటి నీటిని ముఖంపై చల్లుకొని తుడుచుకుంటే సరిపోతుంది. దీనివల్ల చర్మ రంధ్రాలు తెరుచుకొని శ్వాసనిస్తుంది. ఫలితంగా అందం ఇనుమడిస్తుంది. ◆ ఆపై మీ బ్యూటీ రొటీని ని యధావిధిగా కొనసాగించవచ్చు. ఫేషియల్ కప్పింగ్.. సౌందర్య పోషణలో భాగంగా ఉపయోగించే పదార్థాలను చర్మం మరింతగా శోషించుకునేలా ప్రేరేపిస్తుంది. అవగాహన ఉన్న వారు ఫేషియల్ కప్పింగ్ని ఇంట్లోనే చేసుకోవచ్చు.. లేదంటే నిపుణుల సహాయం తీసుకోవచ్చు. అంతేకానీ సొంత ప్రయత్నాలు మాత్రం వద్దంటున్నారు. నిపుణులు. ఎందుకంటే సరైన పద్ధతిలో దీన్ని పాటించినప్పుడే సత్ఫలితాలు పొందొచ్చు.

అందరికీ సూటవుతుందా?అందాన్ని పెంచే ఫేషియల్ కప్పింగ్ పద్ధతిని పాటించాలంటే కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు.

◆ ఒకే ప్రదేశంలో ఎక్కువసేపు ఉంచకూడదు. దానివల్ల అక్కడ మచ్చలు పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కప్ అమర్చుకునే ప్రదేశాన్ని నిర్ణీత సమయాల్లో మార్చాల్సి ఉంటుంది.

◆ సున్నితమైన చర్మతత్వం, వివిధ రకాల చర్మ సమస్యలు/ఇన్ఫెక్షన్లు ఉన్న వారు ఈ థెరపీ తీసుకోకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.

◆ అలాగే వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, నెలసరిలో ఉన్న వారు, గుండె సమస్యలతో బాధపడుతున్న వారు, కొవ్వులు అధికంగా ఉండే వారు.. ఫేషియల్ కప్పింగ్‌కి దూరంగా ఉండాల!

◆ ఫేషియల్ కప్పింగ్ కారణంగా కొంతమందిలో వికారం, అలసట, మగతగా అనిపించడం... వంటి దుష్ప్రభావాలు కనిపించడం!

కాబట్టి ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకొని, నిపుణుల సలహా ప్రకారం ఈ చికిత్స తీసుకోవడం వల్ల ఆశించిన ఫలితాలు సొంతం చేసుకోవచ్చు.



# సౌతాఫ్రికా టి20 లీగ్ టైటిల్ రేసులో సన్‌రైజర్స్

## సూపర్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరోసారి టైటిల్ రేసులో నిలిచింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో జొబర్గ్ సూపర్ కింగ్స్‌ను చిత్తు చేసి క్వాలిఫయర్2కు అర్హత సాధించింది. సెంచూరియన్ వేదికగా సాగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సూపర్ కింగ్స్ తొలుత బౌలింగ్ చేసింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 184 పరుగులు చేసింది. ఓపెనర్లు బెడింగ్‌హాం (14 బంతుల్లో 27), టోనీ డి జోర్జి (9 బంతుల్లో 14) ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభించగా, జోర్డాన్ హెర్మాన్ (16 బంతుల్లో 12), అబెల్ (10 బంతుల్లో 10) నిరాశపరిచారు. ఈ క్రమంలో ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. 40 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 62 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. మిగతా వాళ్లలో వికెట్ కీపర్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ 21 బంతుల్లో 26 పరుగులు చేయగా, ఆఖర్లో మార్కో జాన్సెన్ మెరుపు ఇన్నింగ్స్ (12 బంతుల్లో 23) ఆడాడు. ఫలితంగా సన్‌రైజర్స్ 6 వికెట్లు నష్టానికి 184 పరుగులు నమోదు చేయగలిగింది. జొబర్గ్ సూపర్ కింగ్స్ బౌలర్లలో ఇమ్రాన్ తాహిర్, విల్‌జోయెన్ చెరో 2 వికెట్లు దక్కించుకోగా, మహీశ్ తీక్షణ, మొయిన్ అలీ ఒక్కో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో జొబర్గ్ శుభారంభమే అందుకున్నా దానిని కొనసాగించలేకపోయింది. ఓపెనర్లలో డెవాన్ కాన్వే (20 బంతుల్లో 30) రాణించగా, కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ (18 బంతుల్లో 19) మాత్రం విఫలమయ్యాడు. మిగిలిన ఆటగాళ్లలో జేపీకింగ్ (9), విహాన్ ల్యూబే (13), మొయిన్ అలీ (0),



హార్డస్ విల్‌జోయెన్ (14) పూర్తిగా నిరాశపరచగా, వికెట్ కీపర్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టో ధనాధన్ దంచికొట్టాడు. కేవలం 17 బంతుల్లోనే 37 పరుగులు సాధించాడు. అతడికి తోడుగా ఇవాన్ జోన్స్ (17 బంతుల్లో 22 నాటౌట్) రాణించాడు. కానీ అప్పటికేపరిస్థితి చేజారిపోయింది. 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 7 వికెట్లు నష్టపోయిన జొబర్గ్ సూపర్ కింగ్స్ 152 పరుగులకేపరిమితమైంది. దీంతో 32 పరుగుల తేడాతో గెలుపొందిన సన్రైజర్స్ ఈస్టర్న్ కేప్ జొబర్గ్‌ను ఎలిమినేట్ చేసి క్వాలిఫయర్2కు అర్హత సాధించింది.

# ఐపిఎల్ ఆరెంజ్ క్యాప్ హీరోస్

## బ్యాటింగ్ నైపుణ్యాలతో చెరగని ముద్ర

### ఈ యేడాది ఎవరిని వరించేనో?



**న్యూఢిల్లీ;** ఐపిఎల్ 2025 సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రతిష్టాత్మక టి20 టోర్నమెంట్ కోసం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ప్రదానం చేసే ఆరెంజ్ క్యాప్‌ను గెలుచుకోవడానికి ప్రతీ ఆటగాడు పోటీపడతాడు. త్వరలో జరగబోయే ఐపీఎల్‌లో ఈ ఏడాది ఆరెంజ్ క్యాప్ ఎవరికి దక్కుతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. ఆరెంజ్ క్యాప్ విజేతలు తమ సుప్రీం బ్యాటింగ్ నైపుణ్యాలతో ఐపీఎల్ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. ఐపీఎల్ ప్రారంభమైన 2008-2025 ఇప్పటి వరకూ ఆరెంజ్ క్యాప్ విజేతల జాబితాలో తొలిసారి ఆస్ట్రేలియా ప్లేయర్ షాన్ మార్ష్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున ఆడి 616 పరుగులు చేశాడు. తదుపరి వరుసగా మాథ్యూస్ హెడెన్ (2009), సచిన్ టెండూల్కర్ (2010), క్రిస్ గేల్ (2011, 2012), మైఖేల్ హస్సీ (2013), రాబిన్ ఊతప్ప (2014), డేవిడ్ వర్నర్ (2015, 2017, 2019), విరాట్ కోహ్లి (2016, 2024), వేస్ విలియంసన్ (2018), కేఎల్ రాహుల్ (2020), రుతురాజ్ గైక్వాడ్ (2021), జోస్ బట్లర్ (2022), శుభ్‌మన్ గిల్ (2023)లు ఆరెంజ్ క్యాప్‌లు గెలుచుకున్నారు. ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఈ స్టార్లు, క్రికెట్ చరిత్రలోనే రికార్డు సృష్టించారు. వీరిలో పలువుర

ు ఆటగాళ్లు రిటైర్మెంట్ అనంతరం కోచ్‌లు, కామెంటేటర్లు, టీం మెంటర్లు వంటి విభిన్న పాత్రల్లో కొనసాగుతున్నారు. తొలిసారి ఆరెంజ్ క్యాప్ గెలిచిన భరత్ ఆటగాళ్లలో 2010లో 618 పరుగులు చేసి ముంబై ఇండియన్స్‌ను ఫైనల్‌కు నడిపించిన సచిన్ టెండూల్కర్, రిటైర్మెంట్ తర్వాత కూడా క్రికెట్‌కు దగ్గరగానే ఉన్నాడు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ మెంటర్‌గా సేవలు అందిస్తున్నాడు. విరాట్ కోహ్లి 2016, 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడి 973, 741 పరుగులు చేశాడు, 2016లో విరాట్ కోహ్లి సాధించిన 973 పరుగుల రికార్డ్ ఇప్పటికీ ఎవ్వరూ చేరుకోలేని ఘనతగా నిలిచింది. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ, కోహ్లి ఇప్పటికీ బెంగళూరు జట్టుకు కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. కేఎల్ రాహుల్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున 670 పరుగులు చేసి 2020లో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడు. రాహుల్ ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. భారత జట్టులో కూడా ప్రధాన బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో కీలకంగా వ్యవహరించడమే కాకుండా, 635 పరుగులు చేసి తన సంచలనాత్మక ప్రదర్శనతో 2021లో చెన్నై జట్టును టైటిల్ గెలిపించాడు. ఇప్పటికీ సీఎస్‌కే తరఫున నంబర్ 1 ఓపెనర్‌గా కొనసాగుతున్నాడు. భవిష్యత్తులో భారత జట్టుకు కెప్టెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కాగా శుభ్‌మన్ గిల్ గుజరాత్ టైటాన్స్ జట్టులో 2023లో ఆడి 890 పరుగులు చేశాడు. గుజరాత్ టైటాన్స్‌ను ఫైనల్‌కు నడిపించిన గిల్, తన అద్భుతమైన ఫామ్‌తో భారత జట్టులో కీలక బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. అన్ని ఫార్మాట్‌లలో అతను భారత క్రికెట్ భవిష్యత్తుగా నిలుస్తున్నాడు.






# గాయత్రికి పసిడి

## జాతీయ క్రీడల్లో టిజి టీమ్‌కు కాంస్యం

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదే ఖాతాలో మూడో స్వర్ణ పతకం చేరగా, మహిళల ఆర్చరీలో తెలంగాణ టీమ్‌కు కాంస్యం దక్కంది. డెహ్రాడూన్‌లో జరిగిన మహిళల కనోయ్ స్లాలోమ్ కే-1 విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగిడి గాయత్రి పసిడి పతకం సాధించింది. అలాగే ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక రజతం, ఒక కాంస్యం లభించాయి. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో తిరుమూరు గణేశ్ మణిరత్నం-మాదాల సూర్య హంసిని జోడీ రజత పతకం గెలిచింది. ఫైనల్లో గణేశ్-సూర్య హంసిని ద్వయం 148-154 పాయింట్ల తేడాతో రిషభ్ యాదవ్-దీప్షిక (హరియాణా) జంట చేతిలో ఓడింది. కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తిరుమూరు గణేశ్ మణిరత్నం కాంస్య పతకం సంపాదించాడు. మరోవైపు తెలంగాణ ఖాతాలో ఒక కాంస్య పతకం చేరింది. మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో చికిత, మానస నయన, శ్రేష్ఠరెడ్డి, మన్సూరా హసీబాలతో కూడిన తెలంగాణ జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఇందులో తెలంగాణ జట్టు 232 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. తదుపరి పోటీలు ముగిసే సమయానికి ఆంధ్రప్రదేశ్ 3 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో కలిపి 8 పతకాలతో 18వ స్థానంలోనూ, తెలంగాణ 1 స్వర్ణం, 3 కాంస్యాలతో కలిపి 4 పతకాలతో 25వ స్థానంలో ఉన్నాయ.

## గుజరాత్ జెయింట్స్ మహిళా జట్టుకు కొత్త కెప్టెన్

**న్యూఢిల్లీ:** మహిళల ఐపీఎల్-2025 సీజన్ ప్రారంభానికి ముందు గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంత వరకూ పనిచేసిన కెప్టెన్‌ను మార్చి కొత్త కెప్టెన్‌ను గుజరాత్ యాజమాన్యం నియమించింది. ఇంత వరకూ పనిచేసిన బెత్ మూనీ (ఆస్ట్రేలియా) స్థానంలో ఆష్లే గార్డనర్‌ను (ఆస్ట్రేలియా) నూతన సారథిగా నియమిస్తున్నట్లు జెయింట్స్ యాజమాన్యం ప్రకటించింది. గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శనల నేపథ్యంలో కెప్టెన్‌ను మారుస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. జెయింట్స్ గత రెండు సీజన్లలో (2023, 2024) చిట్ట చివరిస్థానంలో నిలిచింది. 2023 సీజన్లో 8 మ్యాచ్‌లు ఆడగా, అందులో 2 మ్యాచ్‌లను గెలిచిన జెయింట్స్, 2024 సీజన్లోనూ అదే ప్రదర్శనను పునరావృతం చేసింది.



గత రెండు సీజన్లలో జెయింట్స్ ప్రదర్శన బాగా లేనప్పటిక గార్డనర్ మాత్రం వ్యక్తిగతంగా రాణించింది. గార్డనర్ డబ్ల్యూ పీఎల్ మొత్తంలో 324 పరుగులు చేసి 17 వికెట్లు పడగొట్టింది. కాగా తనను కెప్టెన్‌గా నియమించడం పట్ల గార్డనర్ హర్షం వ్యక్తం చేసింది. జట్టును ముందుండి నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నానని తెలిపింది. తమ జట్టులో భారతీయ ప్రతిభ పుష్కలంగా ఉందని పేర్కొంది. జెయింట్స్ కెప్టెన్‌గా ఎంపిక కావడం తనకు దక్కిన గౌరవమని తెలిపింది. తదుపరి సీజన్లో జెయింట్స్‌కు నాయకత్వం వహించడానికిసిద్దం గా ఉన్నానని ప్రకటించింది.

# 'ఇవి' రంగానికి బడ్జెట్ బూస్ట్..

**ముంబై, ఫిబ్రవరి 6:** ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి కీలకమైన ఖనిజాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని తొలగించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించడంతో ఎలక్ట్రిక్ వాహనాలు మరింత సరసమైన ధరకు అందుబాటులోకి రానున్నాయి. లిథియం అయాన్ బ్యాటరీలు, సంబంధిత రంగాల స్థానిక తయారీని పెంచడానికే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కీలకమైన చర్యలను తీసుకుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో కోబాల్ట్ పౌడర్, లిథియంఅయాన్ బ్యాటరీవ్యర్థాలు, స్క్రాప్, సీసం, జింక్, ఇతర పన్నెండు కీలకమైన ఖనిజాలపై బీసీడీ నుంచి పూర్తి మినహాయింపును ప్రకటించారు. అంతేకాకుండా అవసరమైన బ్యాటరీ ఉత్పత్తి పరికరాలపై దిగుమతి సుంకాలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రం తాజా నిర్ణయంతో బ్యాటరీ తయారీ ఖర్చులు తగ్గి ఎలక్ట్రిక్ వాహనాలు మరింత తక్కువ ధరకే వినియోగదారులకు అందుతాయని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశంలో బ్యాటరీలు, బ్యాటరీ సెల్లను ఉత్పత్తి చేయడంలో చురుకుగా పనిచేస్తున్న టాటామోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, లాగ్9 మెటీరియల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి వాటితో స్థానిక ఉత్పత్తిదారులకు కేంద్రం చర్యలు మరింత ప్రోత్సాహకంగా మారనున్నాయి. భారతదేశంలో



బ్యాటరీలకు ప్రధాన సరఫరాదారులుగా కొనసాగుతున్న చైనా, దక్షిణ కొరియాతో సహా ఇతరమార్కెట్లపై ఆధార పడడాన్ని తగ్గించడానికి స్థానిక తయారీ ఊతం ఇవ్వడానికి కేంద్రం ఈచర్యలు తీసుకుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశానికి సంబంధించిన బ్యాటరీ రీసైక్లింగ్, తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి బడ్జెట్ 2025 కీలకంగా మారుతుందని వివరిస్తున్నారు. బ్యాటరీరీసైక్లింగ్, 'ఇవి' సరఫరా విషయాల్లో పెట్టుబడిని పెంపొందించడంతో పాటు 'ఇవి' మొబైల్ బ్యాటరీల తయారీ పెరుగుతుందని తద్వారా స్థానికులకు ఉద్యోగాలు కూడా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈవీ బ్యాటరీ రంగం ప్రధానంగా పన్ను మినహాయింపు నుంచి ప్రయోజనం పొందుతుంది. ముఖ్యంగా కేంద్రం చర్యల కారణంగా ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సరసమైనవిగా మారతాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల పరిణామాలు, అమెరికా బాండ్ల రాబడి తగ్గుముఖం పట్టడం వంటి పాజిటివ్ సంకేతాలున్నప్పటికీ, దేశీయ మార్కెట్లు నష్టాల్లో ముగియడం విశేషం. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ నిర్ణయాలు వెలువడనున్న వేళ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడమే దీనికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. సెన్సెక్స్ ఉదయం 78,513.36 పాయింట్ల వద్ద క్రితం ముగింపు 78,271.28 పాయింట్ల లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ, రోజంతా అదే బాటలో పయనించింది. చివరికి సెన్సెక్స్ 213.12 పాయింట్లు నష్టపోయి 78,058.16 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 73.55 పాయింట్ల నష్టంతో 23,622.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.87.60గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, ఎన్‌టిపిసి, స్టేట్



బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐటిసి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74.94 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2880 డాలర్ల వద్ద ట్రేడయింది. భారతదేశంలో రెండవ అతిపెద్ద ఐటి సేవల సంస్థ ఇన్ఫోసిస్ తాజాగా ఉద్యోగులకు మార్చి నెలాఖరులోగా అన్యువల్ కాంపెన్సేషన్ రివిజన్ లెటర్స్ విడుదల చేస్తామని తెలిపింది. అయితే డెలివరీ యూనిట్ల నుంచి వచ్చిన సిఫార్సుల ఆధారంగా పెంపుపై పని చేస్తున్నట్లు చెప్పారు. జాబ్ లెవెల్ 5 అండ్ అంతకంటే తక్కువ ఉన్నవారికి జనవరి 1 నుంచి పెంపుదల అమల్లోకి వస్తుంది. అలాగే జాబ్ లెవెల్ 6 ఇంకా అంతకంటే పై ఉన్నవారికి ఏప్రిల్ 1 నుంచి వేతన పెంపు లభిస్తుంది అని బెంగళూరులోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లోని చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ షాజీ మాథ్యూ ఉద్యోగులకు టౌన్‌హాల్‌లో తెలిపిన విషయం విదితమే.


# ఫేక్ యాప్స్‌తో జాగ్రత్త: ఎల్ఐసి

**ముంబై, ఫిబ్రవరి 6:** ఫేక్ యాప్స్ అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) పాలసీదారులకు సూచించింది. తమ పేరు మీద నకిలీ యాప్‌లు సర్క్యులేట్ అవుతున్నట్లు దృష్టికి రావడంతో తాజాగా పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. అలాంటి యాప్స్ వలలో పడొద్దని సూచించింది. ఎల్ఈసీ ఇండియా పేరు మీద కొన్ని నకిలీ మొబైల్ అప్లికేషన్‌లు చెలామణి అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కాబట్టి పాలసీహోల్డర్లు, కస్టమర్‌లు అప్రమత్తంగా ఉండాలి. ఎల్ఈసీ ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఎల్ఈసీ డిజిటల్ యాప్, ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఇతరమార్గాల ద్వారా లావాదేవీలు జరపాలి అని సూచి ంచింది. ఇతర మార్గాల ద్వారా చెల్లింపులకు ఎస్ఐసీ బాధ్యత వహించబోదని స్పష్టంచేసింది. ఎస్ఐసీ అధికారిక యాప్‌ను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురైతే. వెబ్‌సైట్‌లోకి వెళ్లి సంబంధిత లింక్‌పై క్లిక్ చేసి మీకు కావాల్సిన (ఆండ్రాయిడ్/ఐఓఎస్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.




# రిలయన్స్ పవర్ షేర్ల ర్యాలీ

**ముంబై, ఫిబ్రవరి 6:** ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ దాదాపు దశాబ్దానికి పైగా పతనం వల్ల మార్కెట్లో కనుమరుగయ్యాయి. విడిపోయినప్పుడు అన్నతో సమానంగా ఆస్తులు పొందిన అనిల్ తర్వాతి కాలంలో భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయి దివాలా తీసిన సంగతి తెలిసిందే. అయితే దాదాపు ఏడాది కాలం నుంచి అనిల్ అంబానీ తన రెండవ ప్రయాణంలో అనేక విజయాలను నమోదు చేస్తున్నారు. కంపెనీలను అప్పులనుంచి విముక్తి చేస్తున్నారు. అయితే కుమారుల సహకారంతో వ్యాపారంలో తిరిగి పుంజుకుంటున్న అనిల్ అంబానీ నీరంతరం కొత్త విజయాలను సాధిస్తూ తన కంపెనీలను పునః నిర్మిస్తున్నారు. వివరాల్లోకి వెళితే అనిల్ అంబానీకి చెంది రిలయన్స్ పవర్ కంపెనీ షేర్లలో భారీ పెరుగుదలను నమోదు చేశాయి. గురువారం ఇంట్రాడేలో స్టాక్ ధర 7శాతం మేర లాభపడి రూ.43.69కి చేరింది. దీనికి కారణం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ పవర్ రూ.41.95 కోట్ల లాభాన్ని నమోదు చేయటమే. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ భారీ నష్టాన్ని చూసిన సంగతి తెలిసిందే. రిలయన్స్ పవర్ క్రమంగా తన అప్పుల భారాన్ని తగ్గించుకుంటూ, కొత్త ప్రాజెక్టులపై దృష్టిని కేంద్రీకరించటం కొనసాగించటంతో 5 ఏళ్ల కాలంలో స్టాక్ ధర 3700 శాతానికి పైగా పెరుగుదలను చూసింది. గత ఏడాది కంపెనీ పనితీరును పరిశీలిస్తే.. అంబానీ పవర్‌కంపెనీ డిసెంబర్ త్రైమాసికంలో రూ.1,136.75 కోట్ల నష్టాన్ని చూసింది. డిసెంబర్ 2024తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ వ్యాపార ఆదాయం రూ.2159.44 కోట్లుగా ఉండగా.. ఖర్చులు రూ.2109.56 కోట్లుగా నమోదు చేసింది. ప్రస్తుతం కంపెనీ రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో ప్రాజెక్టులను దక్కించుకునేందుకు అడుగులు వేస్తోంది. ఇతర దేశాల్లో సైతం ప్రాజెక్టులను చేపడుతోంది. స్టాక్ మార్కెట్లో ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్న ప్రధాన అంశం కంపెనీ పూర్తిగా రుణాలను చెల్లించి జీరో బ్యాంక్ లోన్స్ స్థాయికి చేరుకోవటమే. దీనికి తోడు ప్రస్తుతం కంపెనీ పనితీరు మెరుగుపడి త్రైమాసికంలో చాలా కాలం తర్వాత లాభదాయకమైన రిపోర్ట్ కార్డ్ రావటం పెట్టుబడిదారులను ఆకట్టుకుంటోంది. మార్చి 27, 2020లో పవర్ కంపెనీ షేర్లు ఒక్కోటి రూ.1.13 రేటు వద్ద ఉన్నాయి. అయితే కంపెనీపై నమ్మకంతో ముందుకు సాగిన పెట్టుబడిదారులు ప్రస్తుతం స్టాక్ దూకుడు పెరుగుదల నుంచి మంచి లాభాలను ఆర్జిస్తున్నారు.




# ఎస్‌బిఐ నికర లాభం 84% వృద్ధి

**ముంబై, ఫిబ్రవరి 6:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మూడవ త్రైమాసిక ఫలితాలను అదరగొట్టింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో స్టాండెలోన్ ప్రాతిపదికన రూ.16,891 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9.163 కోట్ల నికర లాభంతో పోలిస్తే నికర లాభం 84శాతం పెరిగింది. మార్కెట్ అంచనాలు మించి నికర లాభాన్ని నమోదు చేయడం విశేషం. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే మాత్రం నికర లాభంలో 8శాతం క్షీణత నమోదైంది. రెండవ త్రైమాసికంలో నికర లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. ఇక సమీక్షా త్రైమాసికంలో వడ్డీ ద్వారా వచ్చే ఆదాయం రూ.1.06 లక్షల కోట్ల నుంచి 10శాతం వృద్ధితో రూ.1.17 లక్షల కోట్లకు పెరిగింది. గత త్రైమాసికంలో 2.13 శాతంగా ఉన్న స్థూల నిరర్ధక ఆస్తులు 2.07 శాతానికి తగ్గాయి. అలాగే 0.53 శాతంగా ఉన్న నికర ఎన్‌పిఎలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఫలితాల నేపథ్యంలో బ్యాంకు షేర్లు 0.39శాతం నష్టంతో 763.05 వద్ద కొనసాగింది.




# వాణిజ్యం

## బ్లాక్‌రాక్‌లో కొత్త ఉద్యోగాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:** ప్రపంచంలోనే ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బ్లాక్‌రాక్ ఇంక్. భారత్‌లో దాదాపు 1,200 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోనుంది. దీని ద్వారా దేశంలో తన ఉద్యోగుల సంఖ్యను విస్తరించే ప్రణాళికలను ప్రకటించారు. కంపెనీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) సామర్థ్యాలను పెంచడం, ముంబై, గుర్గావలో బహట్స్‌గా పిలువబడే దాని సపోర్ట్ హబ్లను పెంచేందుకు ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్ తోడ్పడుతుందని కంపెనీ ప్రకటించింది. మెరుగైన అసెట్ మేనేజ్మెంట్ సేవల కోసం ఏఐను ఉపయోగించుకోవాలంటే బ్లాక్ విస్తృత వ్యూహంలో భాగంగా ఈ ఉద్యోగాలు కల్పించనున్నారు. ఇంజినీర్లు, డేటా నిపుణులతో సహ కృత్రిమ మేధ సాంకేతికతల అభివృద్ధి, వాటిని అమలు చేసే విభాగాల్లో రిక్రూట్‌మెంట్ ఉంటుందని కంపెనీ అధికారులు తెలిపారు. ముంద్రి, గుర్గావ్ బ్లాక్‌లోని రాక్ బహట్లు




ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్, రిస్క్ మేనేజ్‌మెంట్ మెంట్, ఫైనాన్షియల్ ఇంజినీరింగ్, బిజినెస్ ఆపరేషన్స్, డేటా అనలిటిక్స్ వంటి విలువ ఆధారిత సేవలకు సంబంధించి కొత్త ఆవిష్కరణలు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఉద్యోగులతో మొత్తం భారత్‌లో వీరి సంఖ్య 3,500 కు చేరుతుంది. బ్లాక్ సంస్థ ప్రికిన్ అనే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని కూడా కొనుగోలు చేయనుంది. దానితో బెంగళూరులో 1,500 మంది ఉద్యోగులతో గ్లోబల్ సామర్థ్యాల కేంద్రాన్ని బ్లాక్ రాక్ సొంతం చేసుకో నుంది. ఈ కొనుగోలు సంస్థ ఇంటెలిజెన్స్, అనలిటిక్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తుంది. సంస్థకు కీలకమైన కార్యకలాపాలు స్థావరంగా ఈ బెంగళూరు కార్యాలయంలో ఉన్నట్లు కంపెనీ ప్రదర్శిస్తోంది. పెరుగుతున్న శ్రామిక శక్తికి అనుగుణంగా ముంబైలోని శివారులోని గోరేగావ్‌లో అదనపు కార్యాలయ ఒదిరాయ్ రియాల్టీ లిమిటెడ్ నుంచి బ్లాక్‌టెక్ లీజుకు తీసుకువెళ్లింది. దీనికి సంబంధించి ఇరు సంస్థల మధ్య దాదాపు రూ.400 కోట్లు విలువైన డీల్ కుదిరింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.